Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

బుధవారం, ఎప్రిల్ 02, 2025 | సంపుటి - 20 | సంచిక 180 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## గుజరాత్ బాణాసంచా
## ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

**భారీగా చెలరేగిన మంటలు....అలముకున్న పొగ**

**17మంది మృతి..పలువురికి తీవ్ర గాయాలు**



అహ్మదాబాద్ : గుజరాత్‌లోని బనస్‌కాంత జిల్లాలో విషాదకర సంఘటన చోటు- చేసుకుంది. ఈ జిల్లాలోని దీషా నగరంలోని టాపాసుల ఫ్యాకర్టీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మంగళ వారం ఉదయం 9.30లకు ఈ ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో 17 మందికి పైగా మృతి చెందాగా.. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. మిగతా 2లో

## హెచ్‌సియూ భూ వివాదంపై
# ప్రభుత్వం దృష్టి

## మంత్రులతో సిఎం రేవంత్ సమీక్ష

**విపక్షాల విమర్శలకు స్పష్టమైన సమాధానం**

**బిల్లీరావు చేతిలో ఉన్న భూములను కొట్లాడి సాధించాం**

**మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, శ్రీధర్ బాబు**

**హెచ్‌సియూ భూ వివాదంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ విషయంలో నిజానిజాలను ప్రజల ముందుంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిఎం రేవంత్ అధ్యక్షతన పలువురు మంత్రులు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భేటీ అయ్యారు. ఈ భేటీలో పూర్వాపరాలను చర్చించారు. అనంతరం మంత్రులు భట్టి, శ్రీధర్ బాబులు సచివాలయంలో మీడియాతో మాట్లాడారు.**



హైదరాబాద్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన ఆస్తి, ఒక అంగుళం భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడంలేదని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ విషయంలో కొంతమంది వ్యక్తులు, కొన్ని పార్టీలతో అనుసంధానంగా ఉన్న సంఘాలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వర్సిటీ భూమి వర్సిటీకే ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పనికి అడ్డుతగిలితే ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. సచివాలయంలో నిర్వహించిన మంత్రుల మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. కంచె గచ్చిబౌలి భూములపై బీఆర్‌ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హెచ్ సీయూ ఇంచు భూమి కూడా ప్రభుత్వం తీసుకోలేదన్నారు. హెచ్ సీయూ భూములను గుంజుకుంటున్నారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే తమ ఆలోచన అని అన్నారు. 13 ,01,2004 వరకు ఆ భూములు 2లో



## హెచ్‌సీయూ భూముల్లో
# కాంగ్రెస్ విధ్వంసం

**ఆభూములపై సుప్రీంకోర్టులో కేసులున్నాయి**

**చదును పేరుతో కోర్టు ధిక్కారణ**

**భూముల వేలం ప్రక్రియతో కాంగ్రెస్ అరాచకానికి పరాకాష్ట**

**కేంద్రమంత్రి బండిసంజయ్ ఆగ్రహం**

**కాంగ్రెస్ ప్రభుత్వం చెట్లను తొలగిస్తూ, మొక్కలను పీకేస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడు తోందని కేంద్ర మంత్రి బండిసంజయ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదని, అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయలేమని సుప్రీం కోర్టుతీర్పులున్నాయని ఆయన అన్నారు.**

హైదరాబాద్ : కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తోందని, వట ఫౌండేషన్ అనే ఎన్‌జీవో దాఖలు చేసిన కేసులో ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఆ భూములను వేలం వేయడం కుదరదని.. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం భూముల చదును పేరుతో కోర్టు ధిక్కారణకు పాల్పడుతోందని బండి సంజయ్ విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయించడాన్ని రేవంత్ రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. మిగతా 2లో

## ఢిల్లీ చేరుకున్న చిలీ అధ్యక్షుడు

**ప్రధాని మోదీతో భేటీ**



న్యూఢిల్లీ : చిలీ అధ్యక్షుడు గాబ్రియేట్ బోరిక్ ఫాంట్ భారత్ పర్యటనలో భాగంగా ఢిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత ప్రధాని మోడీని ఆయన కలిశారు. ఇరు దేశాల నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు. 2లో

## 2026 నాటికి నక్సలిజం
# నిర్మూలనే లక్ష్యం

**నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య ఆరుకు చేరిక**

**హోంమంత్రి అమిత్ షా వెల్లడి**

న్యూఢిల్లీ : 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిగా నిర్మూలిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు తగ్గినట్లు వెల్లడించారు. నక్సల్ రహిత భారత్‌ను నిర్మించే దిశగా మనం మరో మైలు రాయిని చేరుకున్నామన్నారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో గత కొన్ని రోజులుగా వరుస ఎన్‌కౌంటర్‌లు చోటు- చేసుకుంటున్న విషయం తెలిసిందే. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య 2లో



## ప్రజలే ముందు.. తరవాతే
## మిగతా పనులు

**అందుకే నేరుగా పేదలకు పెన్షన్ల పంపిణీ**

**తెలంగాణ కంటే ఏపిలో పెన్షన్లు ఎక్కువ**

**గతంలో బటన్ నొక్కిన దానికంటే పెన్షన్ డబ్బులే మిన్న**

**పదిలక్షల కోట్ల అప్పు వారసత్వంగా వచ్చిపడింది**

**కొత్తగొల్లపాలెంలో పెన్షన్లను పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు**




## నేడు పార్లమెంట్ ముందుకు
# వక్ఫ్ బిల్లు

**సాధారణ మెజార్టీతో గట్టెక్కే చాన్స్**

**బిల్లును వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్**

**పార్లమెంట్‌కు హాజరు కావాలని ఎన్‌డిఎ ఎంపిలకు ఆదేశం**



న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా చర్చంతా వక్ఫ్ బిల్లుపై జరుగుతున్న వేళ బుధవారం పార్లమెంట్ ముందుకు ఈ బిల్లు రానుంది. ఎన్‌డిఎకు ఉన్న బలం దృష్ట్యా ఈ బిల్లు ఆమోదం పొందుతుందని అంచనా వేస్తున్నారు. బిల్లు రానున్న క్రమంలో ఎన్‌డిఎ ఎంపిలంతా తప్పకుండా పార్లమెంట్‌కు హాజరు కావాలని ఆదేశాలు వెళ్లాయి.

## లెక్కలు తీస్తే బొక్కలు
# విరుగుతాయ్

**హెచ్‌సీయూ భూములపై రామేశ్వరరావు కన్ను**

**హెచ్‌సీయూ భూములపై ఆనాడు కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదు**

**ఘాటుగా స్పందించిన టీపీసీసీ మహేశ్‌కుమార్‌గౌడ్**



హైదరాబాద్ : హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని యూనివర్సిటీల భూములపై సర్వే వేయించి కాపాడాలని ముఖ్యమంత్రికి రిక్వెస్ట్ చేస్తానన్నారు. లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయన్నారు. హెచ్‌సీయూ కోసం ఇందిరా గాంధీ 2500 ఎకరాలు ఇచ్చారని తెలిపారు. కేటీఆర్, కిషన్ రెడ్డి చేతిలో చెయ్యేసి చెప్పు బావ అనే లాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రామేశ్వర రావు కన్ను హెచ్‌సీయూ భూములపై పడిందన్నారు. 2లో

## పేదల ఇండ్ల కూల్చివేతకు
# వెళ్లిన బుల్డోజర్లు

**మళ్లీ హెచ్‌సీయూ భూముల స్వాధీనానికి..**

**రేవంత్‌ది బుల్డోజర్ల పాలన అనటానికి ఇదే నిదర్శనం**

**ఎందుకు కాంగ్రెస్‌కు పాలన అప్పగించామని అన్నివర్గాల మనోవేదన**

**కాంగ్రెస్ పాలన తీరుపై కేటీఆర్ ఆగ్రహం**



హైదరాబాద్ : అప్పుడు మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లు కూల్చిన రేవంత్, ఇప్పుడు హెచ్‌సీయూ భూములపై పడ్డాడని ఆయన పాలనలో కేవలం బుల్డోజర్లు తప్ప ఏమి కనిపించడం లేదని మాజీమంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్ర పరిస్థితి చూస్తుంటే అసలు కాంగ్రెస్‌కు ఎందుకు పాలన అప్పగించా మంటూ అన్నివర్గాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. తొలుత పర్యావరణ పరిరక్షణ పేరుతో చాలా మంది పేదల ఇండ్లను కూల్చివేశారని మండిపడ్డారు. ఆ తర్వాత అభివృద్ధి పేరుతో గిరిజన గ్రామాలను వెంబడించారని.. బంజరు భూములు, బల్లులు కూడా గుడ్లు పెట్టవు అన్నారని.. ఇప్పుడు మీరు జంతువుల గూళ్ళను వెంటాడి సామూహిక హత్యలు చేస్తారంటూ మండిపడ్డారు. విధ్వంసం మీ ఏకైక నినాదం! మీ ఖజానాను దాఖలు చేయడమే 2లో

# హెచ్‌సీయూ భూ వివాదంపై ప్రభుత్వం దృష్టి

హెచ్ సీయూవేనని చెప్పారు. ఆ తర్వాత 2004 లో బదలాయింపు కింద హెచ్ సీయూకి పక్కనే 397 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు . ఆనాటి ప్రభుత్వానికి హెచ్ సీయూ 400 ఎకరాలు ఇచ్చిందన్నారు. బిల్లీరావు అనే వ్యక్తి చేతిలో ఇన్ని రోజులు ఆ భూమి ఉందన్నారు భట్టి. ఆ భూమి తమదేనని బిల్లీరావు సుప్రీంలో రిట్ పిటిషన్ వేశారని చెప్పారు. 2014నుంచి2013 వరకు ఆ భూములను బీఆర్ఎస్ ఎందుకు పట్టించుకోలేదని భట్టి ప్రశ్నించారు. వేల కోట్ల భూమిని 400 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తికి ఎలా అప్పగిస్తాం. ప్రభుత్వ భూమి ఇంచు కూడా వెళ్లకూడదని కేబినెట్ నిర్ణయించింది. ఈ భూములపై కాంగ్రెస్ సర్కార్ పోరాడింది. హైకోర్టులో కొట్లాడి కేసు గెలిచాం. దశాబ్ద కాలం పోరాడి ఆ భూములను కాపాడినం. వేల కోట్ల విలువైన భూములను ప్రజలకు దక్కేలా చేశాం. ప్రజల కలలను నిజం చేసేందుకు మేం పోరాటం చేస్తున్నాం. మా ఆలోచన అంతా సంపదను సృష్టించడంపైనే. రాజకీయ స్వార్థం కోసం కొన్ని పార్టీలు కుట్ర చేస్తున్నాయి అని భట్టి అన్నారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని న్యాయపరంగానే తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హెచ్ సీయూ విద్యార్థుల ఆందోళన పట్టాడు..పార్టీల ప్రలోభాలకు లోనవద్దని సూచించారు. కంచె గచ్చి బౌలి భూములపై బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. 400 ఎకరాలు20 ఏండ్లుగా న్యాయపోరాటంలో ఉందన్నారు. వర్శిటీ విద్యార్థులు, సిబ్బందికి తాము విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. హెచ్ సీయూ భూమిలో ఇంచు భూమిని కూడా ప్రభుత్వం తీసుకోలేదన్నారు. వారం రోజుల క్రితమే హెచ్ సీయూ వీసీ,సబ్ రిజిస్ట్రార్ తో తాము సంప్రదింపులు జరిపామన్నారు. కొంత మంది వ్యక్తులు విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. తప్పుడు ప్రచారాలను ప్రజలకు చేరవేస్తున్నారు. 2016లో సీనియర్ ఐఏఎస్ అధికారితో కమిటీని వేశారు. గందరగోళం సృష్టించేందుకు బీఆర్ఎస్,బీజేపీ కుట్ర చేస్తున్నాయి. జీవ వైవిధ్యానికి ఎలాంటి నష్టం కల్గించకుండా చూస్తాం. ప్రభుత్వ భూమిలో ఉన్న రాక్స్,లేక్ లను కాపాడుతాం. 2003లో ఆనాటి ప్రభుత్వం తప్పిదం చేసింది. 400 ఎకరాల ప్రభుత్వాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రైవేట్ వ్యక్తి చేతిలో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది అని శ్రీధర్ బాబు అన్నారు. వారం రోజుల క్రితం హెచ్ సీయూ వీసీ, రిజిస్ట్రార్ తో ప్రభుత్వ పరంగా మేం సంప్రదింపులు చేశాం. వారికి స్పష్టంగా చెప్పాం. చాలా ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యను పరిష్కరించాలని కోరాం. వర్సిటీ భూమి వర్సిటీకే ఉండాలని వారికి తెలియజేశాం. 1500 పైచిలుకు ఎకరాల భూమి వారికి న్యాయపరంగా ఇచ్చేందుకు సిఫార్సులు చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని మీరు మీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ లో చర్చించాలని సూచించాం. చట్టపరమైన అన్ని హక్కులు కల్పిస్తామని వారికి స్పష్టంగా చెప్పాం అన్నారు. గత రెండు రోజుల నుంచి కొన్ని మీడియా సంస్థలు, కొన్ని పార్టీలకు సంబంధించిన సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ఈరోజు అక్కడ ఉన్న రాక్ ఫార్మేషన్స్, లేక్ లు, ప్రసిద్ధి గాంచిన మష్రూమ్ రాక్స్, పికాక్ లేక్ ను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. హెచ్ సీయూ పరిసరాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడతాం. అన్నిప్రభుత్వ భూముల్లో ఉన్నప్పటికీ వాటిని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. 400 ఎకరాల ప్రభుత్వ భూమిని న్యాయపరంగానే తీసుకుంటు-న్నాం. హెచ్ సీయూ విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దు. పార్టీల ప్రలోభానికి లోనుకావొద్దని అని శ్రీధర్ బాబు తెలిపారు.

## గుజరాత్ బాణాసంచా ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

ఈ ప్రమాదంలో ఫ్యాక్టరీ నేలమట్టం అయింది. ఈ ప్రమాదంపై జిల్లా కలెక్టర్ మిహిర్ పటేల్ మాట్లాడుతూ.. ' రోజు ఉదయం అగ్ని ప్రమాదం గురించి సమాచారం అందింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు. ఘటనలో 10 మంది అక్కడికక్కడే మృతి చెందగా.. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నాం. ప్రమాదం కారణంగా ఫ్యాక్టరీ పూర్తిగా కుప్పకూలిపోయిందని అన్నారు. ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఫ్యాక్టరీ ఓనర్ పరారీలో ఉన్నారు. బనస్కాంఠలోని దీసాలోని ధున్వా రోడ్డులోని బాణసంచా కర్మాగారంలో పేలుడు కారణంగా భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీసాలోని ధున్వా రోడ్డులో దీపక్ ట్రేడర్స్ అనే బాణసంచా కర్మాగారం ఉంది. ఈరోజు బాణసంచా తయారు చేస్తుండగా, పేలుడు పదార్థం అకస్మాత్తుగా పేలి, మంటలు చెలరేగాయి. బాణసంచా కర్మాగారం కావడంతో క్షణాల్లోనే దట్టంగా మంటలు వ్యాపించాయి. ఈ అగ్నిప్రమాదంలో 17 మంది కార్మికులు మరణించినట్లు సమాచారం. ఆకస్మాత్తుగా చోటుచేసుకున్న ఈ ఘటనతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ప్రాణ భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రమాద సమాచారాన్ని అందుకున్న అగ్నిమాపక శాఖ బృందం సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఘటనా స్థలంలో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

## ఢిల్లీ చేరుకున్న చిలీ అధ్యక్షుడు

కాగా, భారత్ పర్యటనలో భాగంగా ఫాంట్ ఢిల్లీలోని మహాత్మాగాంధీ రాజ్‌ఘాట్‌కు చేరుకుని గాంధీజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'చిలీ మంత్రులు, పార్లమెంటు- సభ్యుల బృందం ఢిల్లీలోని మహాత్మాగాంధీ గౌరవార్థం నిర్మించిన రాజ్‌ఘాట్ వద్ద చేరుకుని ఆయనకు నివాళులర్పించాము. భారతదేశం ఆయన వారసత్వాన్ని గుర్తుచేస్తుంది. ఈ సందర్భంగా మేము ఉమ్మడి ఆసక్తులను పంచుకోవడమే కాదు.. మా ప్రజల భవిష్యత్తు కోసం గొప్ప అవకాశాలనే కాదు.. ప్రాథమిక విలువలను పంచుకున్నాము' అని ఫాంట్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## పేదల ఇండ్ల కూల్చివేతకు వెళ్లిన బుల్డోజర్లు

ఏకైక నినాదం.. నేను మిమ్మల్ని అడుగుతున్నాను రేవంత్ రెడ్డి.. మీ బుల్డోజర్లు వారాంతంలో, రాత్రిపూట ఎందుకు నిరంతరాయంగా పనిచేశాయి.. మీరు కోర్టుకు ఎందుకు భయపడుతున్నారు? మీరు ఏమి దాచారు? అంటూ తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో హెచ్‌సీయూ భూముల్లో బుల్డోజర్లు చదును చేస్తుండడంతో అక్కడి అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో జింకలు అక్కడ ఏం జరుగుతుందో తెలియక ఆగమాగం అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. పెద్ద సంఖ్యలో అర్ధరాత్రి మోహరించిన బుల్డోజర్లతో నెమళ్ల అరుపులతో అటవీ ప్రాంతం దద్దరిల్లింది. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. కంచె గౌచ్చిబౌలిలోని హెచ్‌సీయూ సమీపంలో ఉన్న 400 ఎకరాల భూమిని ఇటీవల కాంగ్రెస్ అమ్మేయాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. ఆ స్థలాన్ని చదును చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున బుల్డోజర్లను మోహరించారు. చదును చేయడాన్ని విద్యార్థులు అడ్డుకున్నారు. ఆ భూమి యూనివర్సిటీదేనని పేర్కొంటున్నారు. ప్రకృతి విధ్వంసాన్ని ఆపాలని.. అక్కడ ఉంటున్న జీవరాశిని కాపాడాలని విద్యార్థులతో పాటు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## నేడు వక్ఫ్ బిల్లుపై సమగ్ర చర్చ

**బిఎసి సమావేశం నుంచి కాంగ్రెస్ వాకౌట్**

**ఎంపిలకు విప్ జారీ చేసిన బిజెపి**

న్యూఢిల్లీ : నేడు వక్ఫ్ బిల్లుపై సమగ్ర చర్చ జరుగనున్న నేపథ్యంలో నిర్వహించిన బిఎసి సమావేశం నుంచి కాంగ్రెస్ వాకౌట్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బావిస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు బుధవారంనాడు పార్లమెంటు- ముందుకు రాబోతున్న తరుణంలో.. బిజెపి తన ఎంపిలకు విప్ జారీచేసింది. ఈ బిల్లుకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఉభయ సభల ఆమోదం లభించేలా చూసేందుకు అధికార పార్టీ పట్టుదలగా ఉంది. పలు కారణాలతో విపక్షాలు విభేదిస్తున్న క్రమంలో బిల్లును ఈనెల 2న లోక్‌సభలో ప్రవేశపెడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. స్పీకర్ దీనిపై చర్చకు 8 గంటలు కేటాయించాలని నిర్ణయించారు. అనంతరం ఓటింగ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు బీజేపీ మూడులైన్ల విప్ జారీ చేసింది. ఎంపీలంతా బుధవారంనాడు తప్పనిసరిగా సభకు హాజరుకావాలని, రోజంతా ఉండాలని, ప్రభుత్వ వైఖరికి బాసటగా నిలడాలని పార్టీ ఎంపీలను బీజేపీ కోరింది. కాగా, వక్ఫ్ బిల్లుపై చర్చా సమయం, పార్టీలకు సంఖ్యాబలం ఆధారంగా సమయం కేటాయింపుపై చర్చించేందుకు బీఏసీ సమావేశానికి బీజేపీ మంగళవారంనాడు పిలుపునిచ్చారు. బిల్లుపై చర్చకు 8 గంటలు కేటాయించాలని బీఏసీలో నిర్ణయించారు. అయితే 12 గంటల సేపు చర్చించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీనిపై తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమావేశం నుంచి విపక్షాలు వాకౌట్ చేశాయి. వక్ఫ్ సవరణ బిల్లు-2024ను బుధవారంనాడు ప్రశ్నోత్తరాల సమయం అనంతరం లోక్‌సభలో ప్రవేశపెడతారని, దీనిపై 8 గంటలసేపు చర్చ జరపాలని బీఏసీ సమావేశం నిర్ణయించిందని, అవసరాన్ని బట్టి సమయం పొడిగించే వీలుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సభలో చర్చను తాము కోరుకుంటున్నామని, ప్రతి రాజకీయ పార్టీకి తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఉంటుందని, సవరణ బిల్లుపై ఏ పార్టీ ఎలాంటి వైఖరి తీసుకుందో ప్రజలు కూడా తెలుసుకోవాలని అనుకుంటారని చెప్పారు.

### కాంగ్రెస్ అధిష్టానానికి సీనియర్ నేత జానారెడ్డి లేఖ

హైదరాబాద్ : త్వరలోనే తెలంగాణ కేబినెట్ విస్తరణ ఉంటుందని వార్తలు వస్తున్న తరుణంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేబినెట్ విస్తరణలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన నేతలకు కేబినెట్‌లో ప్రాతినిథ్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ హైకమాండ్‌కు ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి లేఖ రాశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌కు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ నిర్ణయంతో పార్టీకి, ప్రజలకు మేలు జరుగుతుందని తన లేఖలో ప్రస్తావించారు జానారెడ్డి. కేబినెట్ విస్తరణ అంశంపై ఉన్నట్టుండి జానారెడ్డి హైకమాండ్‌కు లేఖ రాయడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కేబినెట్‌లో ప్రాతినిథ్యం లేకపోవడాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అనేకసార్లు బహిరంగంగానే ప్రస్తావించారు. ఈ కోటాలో తనకు కచ్చితంగా మంత్రి పదవి ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఆయనకు చోటు దక్కుతుందా ? లేదా ? అన్నది సస్పెన్స్‌గా మారింది. కేబినెట్‌లో ఆరు ఖాళీలు ఉండగా.. ప్రస్తుతం నాలుగు స్థానాలను భర్తీ చేయాలని హైకమాండ్ భావిస్తున్నట్టు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నాలుగు కోసం సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, ఆది శ్రీనివాస్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి పోటీపడుతున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఒకవేళ ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల వారికి అవకాశం ఇస్తే.. మల్ రెడ్డి రంగారెడ్డికి ఛాన్స్ ఉంటుందని.. అదే జరిగితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఉండకపోవచ్చనే టాక్ ఉంది. అయితే అనేక సామాజిక, రాజకీయ కోణాల్లో లెక్కలు వేసుకున్న తరువాత కేబినెట్ విస్తరణ ఉంటుంది.. కాబట్టి తుది జాబితాలో ఎవరికి అవకాశం ఉంటుందో చెప్పడం కష్టమే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## 2026 నాటికి నక్సలిజం నిర్మూలనే లక్ష్యం

ఎదురు కాల్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ కాల్పుల్లో అనేక మంది మావోలు హతమవుతున్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతపై అమిత్ షా తాజాగా స్పందించారు. దేశంలో నక్సలిజాన్ని అంతం చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం కఠినమైన విధానాన్ని అవలంభిస్తున్నట్లు చెప్పారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారని.. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. భారత్‌లో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు తగ్గాయి. తద్వారా కొత్త మైలురాయిని సాధించాం. మోదీ ప్రభుత్వం నక్సలిజం పట్ల కఠినమైన విధానాన్ని అవలంబిస్తోంది. మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి కృషి చేస్తున్నాము. 2026 మార్చినాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తాం' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. హోంమంత్రిత్వ శాఖ రూపొందించిన నివేదికల ప్రకారం.. దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 ఉన్నాయి. అధికారిక రికార్డుల ప్రకారం..2015లో ఇవి 35 ఉండగా..2018 నాటికి 30కి తగ్గాయి. 2021నాటికి 25కు వచ్చాయి. తాజాగా వాటి సంఖ్య 6కు చేరింది. మరోవైపు రాష్ట్రంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించేందుకు అమిత్ షా ఈనెల 4, 5 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించ నున్నారు. ఈ సందర్భంగా ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కార్యకలాపాలను సమీక్షించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అనంతరం షా ఏప్రిల్ 7, 8 తేదీల్లో జమ్మూకశ్మీర్‌లో కూడా పర్యటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## నేడు పార్లమెంట్ ముందుకు వక్ఫ్ బిల్లు

ఓ వర్గం ఈ బిల్లును వ్యతిరేకిస్తుండగా కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇది ఎవరికి వ్యతిరేకం కాదని, అందరికీ సమన్యాయం చేసేందుకే వక్ఫ్ చట్టంలో మార్పులు తీసుకొస్తున్నామని చెబుతోంది. ఇప్పటికే గత ఏడాది ఈ బిల్లును లోక్‌సభ ముందుకు కేంద్రప్రభుత్వం తీసుకొచ్చింది. దీనిపై సమగ్రంగా చర్చ జరగాలని మిగతా రాజకీయ పార్టీలు కోరడంతో చివరకు జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లును లోక్‌సభ నివేదించింది. జేపీసీ వివిధ పార్టీలతో చర్చల అనంతరం నివేదికను ప్రభుత్వానికి సమర్పించగా ఏప్రియల్ 2వ తేదీన కేంద్రం మరోసారి లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లును ఆమోదం కోసం ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లును ఆమోదింపచేసుకోవడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ చట్టంలో సవరణలను ఆమోదింపజేసుకోవడం కేంద్రంలోని ఎన్డీయే సర్కార్ తీవ్ర కృషి చేస్తోంది. బుధవారం బిల్లు పార్లమెంట్ ముందుకు రాబోతున్న క్రమంలో ప్రభుత్వం దీనిని పాస్ చేయించుకునేందుకు సిద్దంగా ఉంది. కేంద్రప్రభుత్వం 2024లో వక్ఫ్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ బిల్లను ప్రవేశపెట్టగా ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నేపథ్యంలో జేపీసీకి పంపేందుకు ప్రభుత్వం ఓకే చెప్పింది. దీంతో బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ నేతృత్వంలోని జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందుకు ఈ బిల్లును పంపగా.. వివిధ పార్టీలు, మత సంస్థలు, ప్రముఖ వ్యక్తులతో సుదీర్ఘ చర్చల తర్వాత వక్ఫ్ బిల్లు ముసాయిదాను జేపీసీ రూపొందించింది. వక్ఫ్ బిల్లుపై చర్చల సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో ఉద్రిక్తతలు నెలకొన్న సందర్భాలు చూశాం. ఈ పరిస్థితుల్లో వక్ఫ్ బిల్లును పార్లమెంట్ ఆమోదం పొందుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. లోక్‌సభలో ప్రస్తుతం ఎన్నికైన సభ్యుల సంఖ్య 543 కాగా వీరిలో స్పీకర్‌ను మినహాయిస్తే ఓటింగ్‌లో పాల్గొనేవారి సంఖ్య 542. వీరిలో బీజేపీ సంఖ్యా బలం 240, మిత్రపక్షాలతో కలిపి ఎన్డీయే ఎంపీల సంఖ్య 294. లోక్‌సభలో ఏదైనా బిల్లు ఆమోదించాలంటే 272 మంది సభ్యుల సాధారణ మెజార్టీ అవసరం కావడంతో లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రతిపక్షాల విషయానికొస్తే కాంగ్రెస్‌కు గరిష్టంగా 99 మంది ఎంపీలు ఉండగా ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కలిపి వారి బలం 233. ఎన్డీయే, ఇండియా కూటమిలో భాగస్వామ్యం కాని కొందరు ఎంపీలున్నారు. వీరు ఎవరికి మద్దతు ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. అదే రాజ్యసభలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ప్రస్తుతం ఎగువసభలో సంఖ్యాబలం 236 వీరిలో బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యులు 98 మంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో కలిపితే వీరి సంఖ్య 115. ఆరుగురు నామినేటెడ్ సభ్యులను కలుపుకుంటే ఎన్డీయే బలం 121 అవుతుంది. రాజ్యసభలో ఈ బిల్లును ఆమోదించాలంటే 119 మంది సభ్యులు అవసరం. ఈ పరిస్థితుల్లో సాధారణ మెజార్టీతో పోల్చుకుంటే ఇద్దరు సభ్యుల బలం ఎక్కువగా ఉంది. విపక్షాలకు సంబంధించి కాంగ్రెస్ నుంచి 27మంది రాజ్యసభ సభ్యులు ఉండగా ఇండియా కూటమి నుంచి 85 మంది ఉన్నారు. మరోవైపు వైసీపీ నుంచి ప్రస్తుతం ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఉండగా, బీజేడీ నుంచి మరో ఏడుగురు, అన్నాడీఎంకే నుంచి నలుగురు సభ్యులు ఉన్నారు. ఏ కూటమిలో భాగస్వాం÷-మ్య కాని మరో ముగ్గురు సభ్యులు ఉన్నారు. వీరంతా వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా ఓటు- వేస్తారా.. వ్యతిరేకంగా ఓటు- వేస్తారా అనేది చూడాల్సి ఉంది. వక్ఫ్ బిల్లుపై చర్చా సమయం, పార్టీలకు సంఖ్యాబలం ఆధారంగా సమయం కేటాయింపుపై చర్చించేందుకు స్పీకర్ బీఏసీ సమావేశానికి పిలుపునివ్వగా విపక్షాలు ఈ సమావేశాన్ని బహిష్కరించాయి. వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ సమావేశం నుంచి కాంగ్రెస్ వాకౌట్ చేసింది.

## ప్రజలే ముందు.. తరవాతే మిగతా పనులు

బాపట్ల : ప్రజలే ముందు.. ఆ తర్వాతే మిగతా పనులు అని స్పష్టం సిఎం చంద్రబాబు నాయుడు చేశారు. గతంలో బటన్ నొక్కామని చెప్పారు.. మీ బటన్లు అన్నీ నా పెన్షన్‌తో సమానం. ప్రజా సేవల పేరుతో పెన్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టా. ముందుండి నడిపించాలనే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా. పెన్షన్లు ఇచ్చేటప్పుడు గౌరవంగా ఇవ్వాలి. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఏపీ కంటే తక్కువ పెన్షన్లని అని తెలిపారు. మంగళవారం బాపట్ల జిల్లాలో పర్యటించిన సిఎం చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో పెన్షన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించిన ముఖ్యమంత్రి.. లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తగొల్లపాలెం ప్రజావేదిక సభలో చంద్రబాబు మాట్లాడుతూ... ప్రజలే ముందు.. ఆ తర్వాతే మిగతా పనులు అని స్పష్టం చేశారు. పెంచిన పింఛన్లను గత ఏప్రిల్ నుంచే అమలు చేస్తున్నాం. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్లు ఇస్తున్నాం. కోటిన్నర కుటుంబాలకు గానూ 64 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నాం. కొందరికి సంపాదించే దానికంటే ఎక్కువ ఆదాయం వస్తోంది. పింఛన్ల పంపిణీ కోసం ఏడాదికి రూ.33,100 కోట్లు ఖర్చవుతోంది. ఒకప్పుడు నొక్కిన బటన్లన్నీ నేను ఇచ్చే పింఛన్లతో సమానం. పింఛన్ల రూపంలో నెలకు రూ.2,722 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గతంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే ఆ డబ్బు వచ్చే పరిస్థితి లేదు. ఒక నెల తీసుకోకపోతే.. రెండు లేదా మూడో నెల తీసుకునే అవకాశం ఇచ్చాం. రెండు నెలలు పింఛన్లు తీసుకోని వారు 93,300 మంది ఉన్నారు. మిగుల్చు కోవాలంటే నెలకు రూ.76 కోట్లు ప్రభుత్వానికి మిగులుతుంది. పేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో అదనంగా రూ.76 కోట్లు ఇస్తున్నాం. పేదరికం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కఅషి చేయాలని సిఎం వివరించారు. కొత్తగొల్లపాలెం టీడీపీకి కంచుకోట అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మళ్లీ అమరావతిని గాడిన పెట్టామని తెలిపారు. అక్కడ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. విశాఖ స్టీల్ కూడా గాడిలో పడిందన్నారు. విశాఖ ఉక్కుకు రూ.11 వేల కోట్లు నిధులు తెచ్చామన్నారు. విశాఖకు రైల్వే జోన్ కూడా వచ్చిందన్నారు. ఈనెలలోనే డీఎస్సీ పూర్తి చేసి జూన్‌లోగా టీచర్ల నియామకాలు చేపడతామన్నారు. ఉద్యోగులు ప్రజా సేవలో బాగా పని చేస్తున్నారని అన్నారు. తాను ఏం సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నానని విమర్శించే వాళ్ళు కళ్లు తెరిచి చూడాలని అన్నారు. 2027కి పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. 2029కి ఏపీలో జీరో పావర్టీ చూడాలనేది తన లక్ష్యమన్నారు. వారసత్వంగా అప్పు వచ్చిందని.. రూ.10 లక్షల కోట్లు అప్పు ఉందని వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి సమానంగా చేస్తానన్నారు. తల్లికి వందనం మేలో ఇస్తామని ప్రకటించారు. ఎందరు పిల్లలు ఉంటే.. అంతమందికి తల్లికి వందనం ఇస్తామన్నారు. నాలుగు నెలలకు ఒకసారి ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. రైతుల పంటలకు గిట్టు-బాటు- ధర ఇస్తామని చెప్పారు. మే, జూన్‌లో వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఇస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామని చెప్పారు. వ్యవసాయంలో మోడరైజేషన్ తీసుకువస్తామన్నారు. రాష్ట్ర ప్రజల కోసం డబ్బు సంపాదిస్తానని చెప్పారు. అంబేద్కర్ షెడ్యూల్ కులంలో పుట్టిన 12వ సంతానమని.. లండన్‌లో అంబేద్కర్ చదువుకోడానికి బరోడా రాజు సాయం చేశారన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం రాసే స్థాయికి ఎదిగారన్నారు. అబ్దుల్ కలామ్‌కు అయ్యర్ అనే వ్యక్తి ఆపన్న హస్తం అందించారని చెప్పుకొచ్చారు. కలాం చరిత్రలో నిలిచిపోయారన్నారు. డ్వాక్రా సంఘాలకు పొదుపు నేర్పించారని.. ఇప్పుడు వారి వద్ద రూ.35 వేల కోట్లు పొదుపు డబ్బులు ఉన్నాయని తెలిపారు. సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిందన్నారు. గతంలో తాను సెల్‌ఫోన్ గురించి చెబితే అందరూ నవ్వారన్నారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇస్తామన్నారు. ఐదేళ్లలో ఇళ్లులేని అందరికీ ఇళ్లు కట్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక చాలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. రాజధాని అమరావతిని గాడిలో పెట్టాం. అక్కడ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రాజధాని అభివృద్ధి చెందితే ఆదాయం వస్తుంది. దాని ద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు అవకాశం కలుగుతుంది. మూడు నాలుగేళ్లలో మళ్లీ అమరావతికి పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతుల చేపట్టాం. మిగిలిన చోట కూడా పూర్తిచేస్తాం అని చంద్రబాబు అన్నారు.

## హెచ్‌సీయూ భూముల్లో కాంగ్రెస్ విధ్వంసం

కంచె గచ్చిబౌలి భూముల విక్రయం కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట అని, తక్షణమే గచ్చిబౌలి భూముల అమ్మకంపై ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్దంగా ఉన్నారని బండి సంజయ్ కుమార్ అన్నారు. కాగా కంచె గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిల్‌ను న్యాయస్థానం స్వీకరించింది. బుధవారం విచారణ జరగనుంది. ఆ 400 ఎకరాలు హెచ్‌సీయూ భూమి అని, అటవీ భూమిలో వన్య మృగాలకు ఆవాసం ఉండదని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ భూములను డీఫారెస్టైజేషన్ చేసి అమ్మి రూ. వేల కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ క్రమంలో వట ఫౌండేషన్ 400 ఎకరాల వివాదాస్పద భూముల వ్యవహారంపై ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసింది. కంచె గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని పిటిషన్‌లో కోరారు. అత్యవసరంగా పిటిషన్ స్వీకరించి విచారణ చేపట్టాలని వట ఫౌండేషన్ లాయర్ కోరారు. బుధవారం ఈ పిటిషన్‌ను విచారిస్తామని న్యాయస్థానం పేర్కొంది.

## లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయ్

కోర్టులో ఉన్న కారణంగా భూములను కొల్లగొట్టలేకపోయారని తెలిపారు. హెచ్‌సీయూ అన్యాక్రాంత భూముల్లో మై హోం విహంగ భవనం వెలిసిందంటూ వ్యాఖ్యలు చేశారు. హెచ్‌సీయూ భూముల్లో మైహోం భవనాలు కట్టారని... అప్పుడు బీజేపీ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అక్కడ రోడ్లు వేశారని చెప్పుకొచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ బినామీలకు భూములు ఇచ్చేపుడు వన్య ప్రాణులు కనపడలేదా అని నిలదీశారు. 534 ఎకరాలు ప్రభుత్వం తీసుకున్నందుకు గోపనపల్లిలో 397 ఎకరాల భూమిని యూనివర్సిటీకి కేటాయించారని తెలిపారు. విద్యార్థులను రెచ్చగొట్టి కేటీఆర్ రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయల భూములను కొల్లగొట్టింది బీఆర్ఎస్ నాయకులే అంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. క్యాబినెట్ విస్తరణపై అభిప్రాయాలు చెప్పామన్నారు. అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. తాముఇప్పటి వరకు ఎలాంటి తేదీలు చెప్పలేదని తెలిపారు. సాయంత్రం ఢిల్లీకి వెళు తున్నామని.. బీసీ సంఘాల నిరసన కార్యక్రమంలో పాల్గొంటామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.


## పేదల ఆత్మగౌరవం పెంచేలా సన్నబియ్యం పంపిణీ

**మోడీ ఫోటోలు పెట్టాలన్న బండి వ్యాఖ్యలకు కౌంటర్**

**ఆదాయం సమకూరుస్తున్న సిఎంల ఫోటోలు చాలా పెట్టాలి**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్య**

నల్లగొండ : పేద ప్రజల ఆహార భద్రతను మెరుగుపరిచేందుకు సన్న బియ్యం పంపిణీ సాహసోపేత నిర్ణయమని తెలంగాణ మునిసిపల్ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ పథకం వల్ల పేదల ఆత్మగౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించిందని ఆయన వివరించారు. గత ప్రభుత్వాలు రేషన్ కార్డుల పంపిణీ విషయంలో పూర్తిగా విఫలమయ్యాయి. రేషన్ షాపులను నిర్వీర్యం చేయడంతోపాటు-, పేదలకు నాణ్యమైన ఆహారం అందించడంలో విఫలమయ్యాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం పేదలకు లబ్ధి చేకూర్చే గొప్ప అడుగు అని తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నేత బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో రేషన్ బస్తాలపై ఉండాలన్న బండి సంజయ్ వ్యాఖ్యలపై స్పందించిన ఆయన, 'ఈ దేశానికి ఆదాయ వనరు రాష్ట్రాలే. రాష్ట్రాల ఆదాయమే కేంద్రానికి ఆదాయం. ఆర్థిక వ్యవస్థ రాష్ట్రాల పన్నుల మీద ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. ఫోటోలు పెట్టాల్సి వస్తే, రాష్ట్ర ముఖ్యమంత్రుల ఫోటోలు చాలా చోట్ల పెట్టాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం వైఖరిపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పని చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సన్న బియ్యం పంపిణీని విజయవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పేదలకు నాణ్యమైన ఆహారం అందించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. సామాన్య ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతి విషయంలో అంకితభావంతో పనిచేస్తోంది. పేదల హక్కులను కాపాడేందుకు, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచేందుకు ప్రభుత్వ చర్యలు కొనసాగుతాయని మంత్రి హామీ ఇచ్చారు.



# హామీల అమలులో రేవంత్ విఫలం

### ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్ : రైతు భరోసా అమలు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తన మాటను నిలబెట్టుకోలేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మాట తప్పడం, రైతులను మోసం చేయడం రేవంత్ రెడ్డికి అలవాటు-గా మారిందని ఆయన ధ్వజమెత్తారు. జనవరి 26న రైతు భరోసా కింద ఇచ్చే డబ్బులను మార్చి 31లోగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఆ హామీ ఇంకా నెరవేరలేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ మార్చి 31 కల్లా రైతులందరికి రైతు భరోసా అందజేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఏప్రిల్ 1వ తేదీ వచ్చేసినా ఆ నిధుల గురించి ఎలాంటి ప్రకటన రాలేదని ఆయన మండిపడ్డారు. ఉగాది పండుగను పురస్కరించుకుని



రైతులు రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూశారని, అయితే వారికి ప్రభుత్వం చేదు అనుభవం మిగిల్చిందని హరీష్ రావు విమర్శించారు. దసరాకు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, సంక్రాంతికి అందిస్తామన్నా నిధులు రాలేదని, ఉగాది నాటికి కూడా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడం బాధాకరమన్నారు. కాలండర్లు మారుతున్నా రేవంత్ రెడ్డి మాట మాత్రం మారడం లేదని ఎద్దేవా చేశారు. నాట్ల సీజన్‌లో కేసీఆర్ రైతులకు రైతు బంధు అందించారని, కానీ రేవంత్ రెడ్డి కోతల సమయం వచ్చినా రైతు భరోసా అందించలేకపోయారని హరీష్ రావు ఆరోపించారు. మోసపూరిత పాలననే విధానంగా మార్చుకున్న రేవంత్ రెడ్డి రైతులను అన్ని కోణాల్లో దగా చేస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ వాగ్దానం ఇంకా నెరవేరలేదు. ఇందిరమ్మ భరోసా పథకం కేవలం మాటలకే పరిమితమైంది. హామీలు నెరవేర్చకుండా మోసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగానే, అసెంబ్లీలో ప్రకటించినట్లుగానే రైతు భరోసా నిధులు అందించే వరకు బీఆర్ఎస్ పార్టీ రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూనే ఉంటు-ంది. ప్రజల్లో మీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటుందని హరీష్ రావు హెచ్చరించారు.

## కాకాణికి హైకోర్టులో చుక్కెదురు

### మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు

అమరావతి : తెల్ల రాయి అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిపై నమోదు చేసిన కేసులో తొందరపాటు చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని ఏపీ హైకోర్టు తేల్చి చెప్పింది.. ఈ కేసులో కాకాణి ఏ 4గా ఉన్నారు.. పోలీసులు రెండుసార్లు నోటీసులు ఇచ్చినా.. కాకాణి సహకరించటం లేదని ప్రభుత్వం.. హైకోర్టుకి తెలియజేసింది.. ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదు చేసినట్టు- కోర్టులో మెమో ఫైల్ చేసింది.. అయితే, హైదరాబాద్ లో ఉన్న కారణంగా పోలీసు విచారణకు హాజరు కాలేకపోయారని కాకాణి తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు.. పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించిన న్యాయస్థానం.. తదుపరి విచారణ గురువారానికి వాయిదా వేసింది.. అయితే, పోలీసులు రెండో నోటీసులు జారీ చేసిన.. వరుసగా రెండో రోజూ కూడా పోలీసు విచారణకు డుమ్మా కొట్టిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి.. ముందస్తు బెయిల్ కోసం.. మరోవైపు.. కేసు క్వాష్ చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. కాకాణిపై తొందరు పాటు- చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు పేర్కొంది.. పొదులుకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్, క్వాష్ పిటిషన్లు దాఖలు చేయగా.. విచారణ జరిపి తొందరపాటు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసిన న్యాయస్థానం.. వివరాలు సమర్పించాలని పోలీసులకి ఆదేశాలు జారీ చేస్తూ.. తదుపరి విచారణ ఎల్లుండికి వాయిదా వేసింది.

## స్థానిక సంస్థల ప్రతినిధులతోనేడు జగన్ భేటీ

### రాజకీయంగా గట్టిగా నిలబడ్డ వారికి అభినందన

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీలు, ఎంపీపీలు, మున్సిపల్ కార్పొరేషన్లు.. ఇలా పలు చోట్ల అవిశ్వాస తీర్మానాలు పెట్టడం.. అందులో మెజార్టీ సాధించినవారు విజయం సాధించారు.. అయితే, కూటమి ప్రభుత్వం కేసులు, వేధింపులు, ప్రలోభాలతో కొన్నింటిని కైవసం చేసుకుందని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు.. అయితే, అధికార కూటమి పార్టీల వేధింపులను తట్టుకుని నిలబడిన ప్రజాప్రతినిధులతో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమావేశం కాబోతున్నారు. బుధవారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో.. వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో జగన్ ప్రత్యేకంగా భేటీకాబోతున్నారు.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీ తరపున గట్టిగా నిలబడిన ప్రజా ప్రతినిధులను ఈ సందర్భంగా అభినందించనున్నారు వైఎస్ జగన్.. కేసులు పెట్టి వేధించినా.. ఇబ్బందులను గట్టిగా ఎదుర్కొని.. పార్టీ కోసం నిలబడి పోరాడిన వారి అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ సమావేశం నిర్వహించాలని వైఎస్ జగన్ నిర్ణయించారు.. ఈ సమావేశానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలకు చెందిన 8 నియోజకవర్గాల్లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులతో పాటు-, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఇప్పటికే సమాచారం అందించారు.. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపైనా దిశా నిర్దేశం చేయనున్నారు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి..

## జర్మన్ యువతిపై అత్యాచారం

### పోలీసుల అదుపులో నిందితుడు అస్లాం

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జర్మన్ యువతిపై అత్యాచారయత్నం చేసిన అస్లాం అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మార్చి మొదటి వారంలో హైదరాబాద్ వచ్చి, నగరాన్ని సందర్శిస్తున్న జర్మన్ యువతి, యువకుడు ఇద్దరూ స్నేహితుల వద్ద ఉండి అక్కడి ప్రదేశాలను చూస్తూ తిరుగుతున్నారు. అయితే.. సోమవారం మార్కెట్ చూసేందుకు జర్మన్ యువతి, యువకుడు బయటకు వచ్చారు. మీర్‌పేట్ సమీపంలో జర్మన్ యువతి, యువకుడిని అస్లాం, అతడి స్నేహితులు చూశారు. నగరాన్ని చూపిస్తానని నమ్మించి జర్మన్ యువతి, యువకుడిని కారులో ఎక్కించుకున్నారు. జర్మన్ యువతి, యువకుడిని సెల్ఫ్‌డ్రైవ్ కారులో పలు ప్రాంతాల్లో తిప్పిన అస్లాం... రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఎయిర్‌పోర్టు రోడ్డువైపు కారును మళ్లించాడు. ఈ క్రమంలోనే ఫొటోలు దిగేందుకు కారు నుంచి అస్లాం స్నేహితులు, జర్మన్ యువకుడు దిగారు. కారు యూటర్న్ చేసుకొద్దామని జర్మన్ యువతిని కారులో తీసుకెళ్లిన అస్లాం... కారును నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో నిందితుడి నుంచి తప్పించుకున్న బాధిత యువతి... తన స్నేహితుడితో కలిసి ఫహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జర్మన్ యువతి ఫిర్యాదు మేరకు అస్లాంను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.

## వైద్యం వ్యాపారంగా మారింది

### దాని పవిత్రతను కొనసాగించాలి

### ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

విజయవాడ : గతంలో పోలిస్తే.. ఇప్పుడు వైద్యం వ్యాపారంగా మారిందని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.. విజయవాడలో జరిగిన ఏపీ మెడికల్ కౌన్సిల్ లో నామినేటెడ్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఆరుగురు సభ్యులను నామినేటెడ్ పోస్టుల్లో ఎన్నుకున్నాం.. వారందరికీ అభినందనలు తెలియ జేస్తున్నాను... మంచి అనుభవం కలిగిన డాక్టర్లను ప్రభుత్వం ఎన్నుకుందన్నారు.. తరతరాలుగా వైద్యుల్ని దేవుడు పోల్చేవారు.. ఇదివరకు పోలిస్తే ఇప్పుడు వైద్యం వ్యాపారంగా మారిందన్న ఆయన.. డాక్టర్లు రోగులను మానవత దృష్టితో చూడాలని సూచించారు.. వైద్యవృత్తి విలువలు పల్చబడ్డాయి.. అవసరం లేకుండానే ఎక్సరేలు, సిటీ- స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్ లు తీస్తున్నారు.. అలాగే నార్మల్ డెలివరీ చేయడం మానేశారు.. అవసరం లేకపోయినా ఆపరేషన్ చేస్తున్నారు.. ప్రభుత్వ డాక్టర్లు గానీ.. ప్రైవేట్ డాక్టర్లు గానీ నార్మల్ డెలివరీస్ చేస్తే బాగుంటుందన్నారు.. ప్రజలు కూడా రకరకాల టెస్టులు రాస్తేనే మాకు సరిగ్గా డాక్టర్లు చూశారని అపోహలో ఉన్నారని వ్యాఖ్యానించారు మంత్రి సత్యకుమార్.. అటు-వంటి వారికి అవగాహన కల్పించాలి.. వచ్చిన పేషెంట్ ను చిరునవ్వుతో డాక్టర్లు స్వాగతం పలకాలని సూచించారు.. డాక్టర్లు సర్టిఫికెట్లను ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలి.. కొత్త కౌన్సిల్, ఏపీఎంసీ సర్టిఫికెట్స్ రెన్యువల్ మీద ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు.. ఫారెన్ రిటర్న్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎక్కువగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు.. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఏపీఎంసీ సభ్యులుగా డాక్టర్ గోగినేని సుజాత, డాక్టర్ కె.వి.సుబ్బానాయుడు, డాక్టర్ డి.శ్రీహరిబాబు, డాక్టర్ స్వర్ణగీత, ఎస్.కేశవరావు బాబు, డాక్టర్ సి.మల్లీశ్వరి ప్రమాణస్వీకారం చేయగా వారికి అభినందనలు తెలిపారు.. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడానికి, నైతిక ప్రమాణాలను కాపాడటానికి ప్రభుత్వం కట్టు-బడి ఉందని చెప్పడానికి నిపుణులైన వైద్యులను ఏపీఎంసీ సభ్యులుగా నియమించడమే నిదర్శనం. అందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని, వైద్య రంగాన్ని ఆదర్శనీయంగా నిలపాలని కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులను ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ కోరారు..

## భారత్ చీనీ భాయీభాయీ

### జిన్‌పింగ్ ఆశాభావం

బీజింగ్ : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్, చీనీ భాయీభాయీ అన్న నినాదాన్ని తెరపైకి తెచ్చారు. ఇరుదేశాలు మరింత సన్నిహితంగా కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. భారత్- చైనా దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన పరస్పర స్నేహం కోసం చేయిచాచరు. ఈ మేరకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో పరస్పర అభినందన సందేశాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు ఏనుగు- డ్రాగన్‌లా అభివృద్ధి చెందాలని అన్నారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లో సైనికుల మధ్య తీవ్ర ఘర్షణతో ఇరు దేశాల మధ్య స్తంభించిన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నాలు కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటు-చేసుకోవడం విశేషం. పొరుగు దేశాలు శాంతియుతంగా ఉండేందుకు మార్గాలను అన్వేషించాలన్న జిన్‌పింగ్.. కీలకమైన అంతర్జాతీయ వ్యవహారాల్లో సంప్రదింపులు, సమన్వయాన్ని మరింతగా పెంచుకొనేందుకు, సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని సంయుక్తంగా కాపాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మరోవైపు.. భారత్- చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి నేటికి 75 ఏళ్లు అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ అన్నారు. చైనా అధ్యక్షుడు, ప్రధాని.. భారత రాష్ట్రపతి, ప్రధానిలతో అభినందన సందేశాలు ఇచ్చిపుచ్చుకున్నట్లు- మీడియా సమావేశంలో వెల్లడించారు. రెండు దేశాలూ పురాతన నాగరికతలు కలిగి ఉన్నాయని, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు అన్నారు. గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్యులైన ఇరు దేశాలూ ఆధునికీకరణలో కీలక దశలో ఉన్నాయని పేర్కొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం

### పచ్చివడ్ల పంటను అమ్ముకోవద్దు

### తూకం, పేమెంట్‌లో ఎలాంటి మోసాలు లేకుండా చర్యలు

### వరి ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట : అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుదని, కాని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్)లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సేర్ఫ్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో మొదటి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పోతారంలో ప్రారంభించుకున్నామన్నారు. పచ్చివడ్ల పేరుతో పంటల వద్ద అమ్ముకునే ప్రయత్నం చేయొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. వడ్ల కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొస్తే మద్దతు ధర వస్తుందని తెలిపారు. తూకంలో మోసం లేకుండా, డబ్బుల పేమెంట్ విషయంలో కూడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'గతంలో ఓ ఆసామి మా గ్రామంలో ధాన్యం కొనుగోలు చేసుకుని పోయాడు డబ్బులు ఇవ్వలేదని నా దగ్గరికి వచ్చారు. అలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే ప్రభుత్వమే మీ దగ్గర ధాన్యం కొనుగోలు చేస్తుంది ' అని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల కొనుగోలు కేంద్రాలు ఈరోజు ప్రారంభం చేసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించి భవిష్యత్తులో ఇంకా అనేక ప్రయోజనాలు కలిగించేలా నిర్ణయం తీసుకుంటుందన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామన్నారు. అగ్రికల్చరల్ పనిముట్లు మండల సమైక్యాల ద్వారా ఇచ్చి రైతులకు ఉపయోగపడేలా చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు, సమైక్య సంఘాల ద్వారా 600 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే గ్రామాల్లో జరుగుతుందని.. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు వస్తామని తెలిపారు. ఫేస్ -1, ఫేస్ -2 కింద ఇల్లు మొత్తం లేనివారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే విధంగా గ్రామంలో నిర్ణయం తీసుకోవాలన్నారు. నేటినుంచి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు, ఉద్యోగులకు, మహిళలకు సంక్షేమ పథకాలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలు ముందుకు తీసుకుపోయేలా ప్రభుత్వాన్ని అక్కా చెల్లెళ్లు ఆశీర్వదించాలని కోరారు.

## తెలుగు రాష్ట్రాల్లో వడ గాడ్పులు!

### ఈ రెండు నెలలు అత్యధిక ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ : దేశంలో ఈసారి ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలోని పశ్చిమ, తూర్పు ప్రాంతాలు మినహా చాలా చోట్ల సాధారణ స్థాయి కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎక్కువ రోజులపాటు- వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ సారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు- పలు రాష్ట్రాల్లో సాధారణ స్థాయికి మించి 2 నుంచి 4 రోజులపాటు- తీవ్రమైన వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదని స్పష్టం చేసింది.మంగళవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు తగ్గుతాయని ఐఎండీ తెలిపింది. శనివారం ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ప్రస్తుత వేసవిలో ఏప్రిల్-జూన్ మధ్య ఎండలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని భారత వాతావరణ విభాగం ఐఎండీ అంచనా వేస్తోంది. మధ్య, తూర్పు ప్రాంతాల్లో, వాయవ్య రాష్ట్రాల్లో క్కువరోజులు వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఎక్కువ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి నమోదవుతాయని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పలుచోట్ల సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని ఐఎండీ తెలిపింది. రాబోయే మూడు నెలలపాటు- అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు నుంచి నాలుగు రోజులు ఎక్కువగా వడగాలులు వీస్తాయని తెలిపింది. మామూలుగానే ఏప్రిల్, నెలల్లో వడగాలులు నమోదవుతుంటాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువగా వడగాలుల రోజులు కొనసాగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఏప్రిల్‌లో దేశంలో చాలా ప్రాంతాల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండి తెలిపింది.ఎపిలో దాదాపు అన్ని జిల్లాల్లోనూ వడగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని ప్రకటించింది. సోమవారం నంద్యాల జిల్లా గోస్పాడులో 40.3, కర్నూలు జిల్లా కమ్మరచేడులో 40.2, అనంతపురం జిల్లా నాగసముద్రంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో వేడి, ఉక్కపోత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించనుంది.

## వెన్నాడిన అమెరికా టారిఫ్ భయాలు

### భారీ నష్టాలతో ముగిసిన సూచీలు

### 1400 పాయింట్లకు పైగా క్షీణించిన నిఫ్టీ

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. అమెరికా టారిఫ్‌లు భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1400 పాయింట్లకు పైగా క్షీణించగా.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 23,200 మార్క్ దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.5 లక్షల కోట్లు- క్షీణించి రూ.409 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ ఉదయం 76,882.58 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,912.18 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1390.41 పాయింట్ల నష్టంతో 76,024.51 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 353.65 పాయింట్ల నష్టంతో 23,165 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయం ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దేశీయ ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. అలాంటిది అమెరికాలో ఐటీ-కి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చనే అంచనాలతో ఐటీ- స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ-, హెచ్‌సీఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీ-వల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి చేరింది. భారత్ చమురును ప్రధానంగా దిగుమతి చేసుకునే దేశం కావడంతో మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీ-వల దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా 8 సెషన్లలో దాదాపు 5 శాతానికి పైగా పెరిగాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో అమ్మకాలు సూచీలను డీలాపడేలా చేశాయి. వొడాఫోన్ ఐడియాలో వాటాను పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించడంతో ఆ టెలికాం కంపెనీ షేర్లు నేడు 20 శాతం మేర రాణించాయి. స్పెక్ట్రమ్ కోసం వొడాఫోన్ ఐడియా చెల్లించాల్సిన మొత్తానికి సంబంధించి తాజాగా ఈక్విటీ- షేర్లను ప్రభుత్వానికి కేటాయిస్తున్నట్లు- సంస్థ తెలిపింది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 22.6 శాతం వాటా ఉండగా.. అది తాజాగా 49 శాతానికి పెరిగింది.

## 2,719 మంది మృత్యువాత.. 441 మంది గల్లంతు

న్యూఢిల్లీ : మయన్మార్ భూకంప మృతుల సంఖ్య అంతకంతకూపెరుగుతోంది. శుక్రవారం భూకంపం సంభవించిన ప్రాంతంలో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. శిథిలాలను తొలగించినా కొద్ది మృతదేహాలు బయటపడుతున్నాయి. ఇప్పటివరకు 2,719 మంది మృతదేహాలను వెలికితీశారు. స్థానిక మీడియా తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. మృతుల్లో 5 ఏళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారని తెలిపింది. మరో 4,521 మంది గాయపడ్డారని, ఇంకో 441 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉందని పేర్కొంది. ఇప్పటికే సైనిక పాలన, అంతర్యుద్ధాలతో మగ్గిపోతున్న మయన్మార్‌పై గత శుక్రవానం సంభవించిన భూకంపం తీవ్ర ప్రభావాన్ని చూపించింది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమైంది. కొన్ని ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకోవడం కూడా కష్టంగా ఉంది. దాంతో శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటికి తీసుకురావడం ఆలస్యమవుతోంది. మాండలే వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం వెలువడుతోంది. మండుటెండలో ఉత్త చేతులతో, చిన్నచిన్న పారలతో శిథిలాలను తొలగిస్తూ ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమో తెలుసుకునేందుకు స్థానిక ప్రజలు ప్రయత్నిస్తు న్నారు. మాండలే ప్రాంతంలోనే ఓ ప్రీస్కూల్ కూలిపోవడంతో 50 మంది చిన్నారులు, ఇద్దరు టీ-చర్లు చనిపోయారని ఐరాస సిబ్బంది వెల్లడించారు. వివిధ దేశాల నుంచి వస్తోన్న సహాయక బృందాలు భూకంప ప్రాంతాలకు వెళ్లేందుకు ఆయా చోట్ల ప్రభుత్వ, తిరుగుబాటు-దళాల మధ్య జరుగుతోన్న ఘర్షణలు అవరోధంగా మారాయి. ఈ పరిణామాల మధ్య మృతుల సంఖ్య ఎంతకు చేరుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, నీరు, షెల్టర్ తక్షణమే అందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని సహాయక చర్యల్లో పాల్గొంటు-న్న బృందాలు పిలుపునిస్తున్నాయి.

## హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కంచ గచ్చిబౌలి భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్నారు. యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు బీజేవైఎం, ఏబీవీపీ, వామపక్షాల నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. దాంతో రేవంత్ సర్కారుపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## సంక్షేమం పేరుతో.. దివాళా తీయిస్తే ఎలా !

సంక్షేమం పేరుతో ఉచిత పథకాలు అమలు చేయమని చెప్పిందెవరు..ఉచిత బియ్యాలు, ఉచిత పందేరాలు... 58 ఏళ్లకే పెన్షన్లు...రాజకీయ నాయకులకు జీతభత్యాలు..ఇవన్నీ ఎవరి కోసం..ప్రజలు కట్టిన పన్నులతో పాటన చేయాల్సిన నేతలు రాష్ట్రాలను దివాళా తీయించేస్తున్నారు. అభివృద్ధి అంటే పెన్షన్లు పంచడం, సన్నబియ్యం పంచడం ఇదేనా..ఇవన్నీ నిలదీయడానికి ప్రజలంతా సిద్ధం కావాలి. ఎపి కావచ్చు.. తెలంగాణ కావచ్చు....ధరల గురించి మాట్లాడరు. అభివృద్ధి గురించి మాట్లాడరు. వారి సెక్యూరిటీ, ఆకాశ హర్మ్యాలను నిర్మించుకోవడం...ప్రజల డబ్బుతో సోకులు చేసుకోవడం ఇదా పాలన అంటే..అన్నది ప్రజలంతా ఆలోచించాలి. జగన్ తన హయాంలో రాజధాని, పోలవరం నిర్మాణాలను పక్కన పెట్టారు. విశాఖ భీమిలి దగ్గర మాత్రం అద్భుత సౌధాలను నిర్మించుకున్నారు. దీనికి నాటి పాలకులు నేటికీ సమర్థించు కుంటున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఉండదు. ఇలాంటి పాలకులు అవసరమా అని ఆలోచన చేయాలి. రాష్ట్రాలను అప్పుల్లో కూరుకు పోయేలా చేసి...దివాళా తీయించిన నేతలు నీతి వాక్యాలు పలుకుతున్నారు. అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయరు. మిర్చి పండితే కొనుగోలు చేయలేరు. విద్యుత్, వైద్యం, విద్యారంగాలను పటిష్ఠంట చేయరు. ఇవన్నీ మరచి పందేరాలు చేస్తున్న ...వీరా మన పాలకులు ..అయినందుకు సిగ్గు పడాలి. ఇక తాజాగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని నిస్సిగ్గుగా అమ్మాలనుకోవడం రేవంత్ ప్రభుత్వ దివాళాకోరు విధానం కాక మరోటి కాదు. పెన్షన్లు, ఉచిత బస్సు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ఎవరు అడిగారు. ఇవ్వడానికి డబ్బులు ఉన్నాయో లేదో ఆలోచించకుండా ఇష్టారీతిన హామీలు ఇచ్చి ఇప్పుడు భూములు, ఆస్తులు తెగనమ్మితే ఎలా. నీతులు పలుకుతున్న గత బిఆర్ఎస్ పాలకులు కూడా ఇంతకన్నా భిన్నంగా చేయలేదు. వారి హయాంలోనూ భూములు అమ్ముకున్నారు. పేదలు ఇళ్లు కొనగలిగేలా పరిస్థితులు ఉంటే మూసీ మురికిలో ఎందుకు నివసిస్తారు. మూసీ సుందరీకరణ పేరుతో వారిని నిర్వాసితులను చేయడం ఎంతవరకు సమంజసం. మూసీ సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ పేరిట పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకు సబబు. లగచర్లలో ఫార్మా పేరుతో దాడులు జరిగాయి. అభివృద్ధి పేరుతో గిరిజన తండాలపైకి వెళ్లారు. పాలకులు పక్కా రియల్ ఏజెంట్లలాగా మారితే ఇక రక్షించేదెవరన్నది గుర్తించాలి. చెప్పిన పథకాల అమలుకు, ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ నాయకులు హెచ్‌సియూ భూములను అమ్ముకుంటామంటే ఎలా! హెచ్‌సియూ భూములు అమ్మకాన్ని ఎవ్వరైనా తీవ్రంగా తప్పు పట్టాల్సిందే. హైదరాబాద్‌లో హెచ్‌సీయూ పరిసర ప్రాంతాలే కాస్త ఆక్సిజన్ ఇచ్చే ప్రాంతాలుగా ఉన్నాయి. వీటిని కూడా లేకుండా చేస్తామనే దుర్మార్గపు ఆలోచన సరికాదు. 400 ఎకరాలు అమ్మి.. రూ.30వేల కోట్లు రాబట్టుకోవాలని అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలి. చ్‌సీయూ విద్యార్థుల పోరాటానికి అందరూ అండగా నిలవడం ద్వారా విలువైన భూములను కాపాడాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులపైన ప్రభుత్వం అణచివేతకు పాల్పడడం తగదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశంలో పేరు ప్రఖ్యాతలు సాధించుకుంది. అక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో గొప్పగా రాణిస్తున్నారు. దేశానికి తలమానికంగా ఉన్న విద్యాసంస్థల్లో ఒకటిగా ఉంది. హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం విశ్వవిద్యాలయ భవిష్యత్తు కోసం భూముల వేలం తగదని ప్రభుత్వం పెద్దలు గుర్తించాలి. భూములు ప్రభుత్వానివే అని చెబుతున్న సిఎం, మంత్రులు వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాలి. యూనివర్సిటీ భూములపైన రాజకీయం చేస్తున్న తీరు మంచిది కాదు. బుల్డోజర్లను పెట్టి అక్కడున్న చెట్లను తొలగించి చదును చయడం సరికాదు. హైదరాబాద్‌కి ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాలలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలే. ఇప్పటికే కొండలు, గుట్టలను మాయం చేస్తున్నారు. హైదరాబాద్లోఓ ఇప్పటికే కొండలు గుట్టలు మాయం అయ్యాయి. ఎక్కడపడితే అక్కడ ఇవి ధ్వంసం చేయడం సరికాదు. వీటిని కూడా ఆపాలి. ఇలాచేస్తూ పోతే భవిష్యత్తులో ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టం అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. పర్యావరణ నష్టం ప్రభావంపై అధ్యయనం చేయాలి. ఇప్పటికే హైదరాబాద్‌లో వేల ఎకరాలు మాయం అయ్యాయి. పర్యావరణ విధ్వంసాన్ని వెంటనే ఆపాలని రేవంత్ ప్రభుత్వానికి రాజకీయపార్టీలు కూడా సూచించాయి. పచ్చదనం, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడం సరికాదని పాలకులు గుర్తించాలి. నిధుల సమీకరణ కోసం ఈ తరహా చర్యలు చేపట్టడం కూడా మంచిది కాదు. ముందుగా ఉచిత పథకాలను సమీక్షించాలి. నష్టాలను తెచ్చే పథకాల్లో కోతలు విధించుకోవాలి. అప్పులకు,భేషజాలకు పోకుండా ఉన్న ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడపాలి. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోంచి బయటపడేయాలంటే అమ్మకాలు.. కాదు ఆస్తులు సృష్టించాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయం భూముల అమ్మకం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి. విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్ళడం సరికాదు. ఇప్పటికే హైదరాబాద్‌లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చింది. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారుతోంది. హైదరాబాద్ లో కబ్జాలను గుర్తించి ముందుగా వాటిని విముక్తం చేయాలి. చెరువులు కబ్జాలను గుర్తించాలి. అందుకు హైడ్రా చేస్తున్న కృషిని మరింతగా ప్రోత్సహించాలి. హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల కబ్జాలను గుర్తించి, ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి. డబ్బులను వృధా చేసే ఓట్ల పథకాలకు పాతరేసినప్పుడే రాష్ట్రం అప్పుల ఊబినుంచి బయటపడగలదు. ఇది చంద్రబాబుకైనా మరెవ్వరికైనా వర్తిస్తుంది. సంక్షేమం పేరుతో అప్పులు చేసి, పందేరాలు చేయడం ఎంతమాత్రం కాదు. ఫ్రీ పథకాలను ఇకనైనా సమీక్షించడం క్షేమకరం.

# భూకంపాల రాక తెలుసుకోలేమా?



మయన్మార్, థాయ్‌లాండ్‌ల్లో రెండు భారీ భూకంపాల ప్రళయానికి మృతుల సంఖ్య వెయ్యి దాటడం అత్యంత శోచనీయం. ఈ విపత్తుతో ఛిన్నాభిన్నమైన ఆ దేశాలను ఆదుకోవడానికి ప్రపంచ దేశాలు ముందుకొస్తున్నాయి. ప్రపంచం లో అత్యధిక భూకంపాలు సంభవించే ప్రమాదకరమైన ప్రాంతాల్లో మయన్మార్ ఒకటి. గత వందేళ్లలో మయన్మార్‌లో 14 భూకంపాలు వచ్చాయి. మయన్మార్ భూగర్భంలో పొరల అమరికల్లో లోపాలు ఉన్నాయి. దీనిని సంగాయిక్ ఫాల్ట్‌గా వ్యవహరిస్తుంటారు. మయన్మార్‌లో ఈ సంగాయిక్ ఫాల్ట్ దాదాపు 1200 కి.మీ పరిధిలో విస్తరించింది. ఈ పొరల కదలికలు ఏడాదికి 11 మి.మీ నుంచి 18 మి.మీ వేగంగా జరుగుతున్నట్టు 18 మి.మీ అంటే దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మార్పులను అంచనా వేయగలిగిన శాస్త్రవేత్తలు భూకంపాలు ఎప్పుడు, ఎక్కడ వస్తాయో ముందుగా పసికట్టలేకపోవడం ఆధునిక శాస్త్రపరిశోధనకు సవాలుగా నిలిచింది. అంతరిక్షంలో గ్రహాంతర వాసంకోసం విస్తృతంగా పరిశోధనలు సాగుతున్నాయి. ఏ గ్రహశకలం ఎప్పుడు భూమిని ఢీ కొడుతుందో ముందుగానే హెచ్చరిస్తున్నారు. సూర్యునిలో వస్తున్న మార్పులను, సౌర తుపాన్ల వ్యాప్తిని అంచనా వేస్తున్నారు. ఇన్ని జరుగుతున్నా మన భూమి అడుగున ఏం జరుగుతోందో తెలుసుకోలేకపోవడం ప్రశ్నార్థకమవుతోంది. భూమి ద్రవీకరణ చెందినప్పుడు నేల తన సహజ స్వభావ లక్షణాలను కోల్పోయి చిక్కని ద్రవంగా మారుతుందని ఫలితంగా భూకంపాలకు దారి తీస్తుందని భారత్‌లోని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ వెల్లడించింది. భూగర్భం ఏడు ఫలకలుగా విడిపోయి ఉంటుందని, వీటిలో కదలికలు ఏర్పడితే ఒత్తిడి పెరిగి సంఘర్షిస్తుంటాయని, ఫలితంగా ఆకస్మికంగా శక్తితరంగాల రూపంలో భూమి ఉపరితలానికి చేరి భూకంపంగా ప్రళయం సృష్టిస్తుందని శాస్త్రవేత్తలు నిర్ధారిస్తున్నారు. భూకంపాలపై జరుగుతున్న పరిశోధనల్లో కొంతవరకు పురోగతి కనిపిస్తోంది. భూకంపం రావొచ్చని ముందుగా అంచనా వేసే స్థాయి వరకు చేరుకోగలిగినా, ఎప్పుడు, ఎక్కడ కచ్చితంగా వస్తుందో చెప్పలేకపోతున్నారు. అలా చెప్పగలిగితే కొన్ని వేల ప్రాణాలను, ఆస్తులను కాపాడగలుగుతారు. ఎనిమిదేళ్ల క్రితం దక్షిణ కాలిఫోర్నియా, దక్షిణ మధ్య అలస్కా ప్రాంతాల్లో తక్కువ స్థాయి లో ప్రకంపనలు నమోదైనప్పుడు భూకంపం వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు ముందుగానే ఊహించగలిగారు. వారు ఊహించినట్టుగానే ప్రకంపనలు సంభవించాయి. అయితే ఇది చాలా తక్కువస్థాయి ప్రకంపనలకే పరిమితం అయింది. భారీ స్థాయి భూకంపాలను మనం ముందుగా అంచనా వేయలేమా అన్నదే ఇప్పుడు ప్రశ్న. అయితే భూకంపాలు వచ్చే ముందు ఏర్పడే ప్రకంపనలను కొన్ని వన్యప్రాణులు ముందుగానే పసిగట్ట గలుగుతున్నాయని శాస్త్రవేత్తల అధ్యయనాల్లో తేలింది. భూకంపం రావడానికి కొన్ని రోజుల ముందే పాములు పుట్టల్లోంచి బయటకు వచ్చి దూరంగా వెళ్లిపోతాయని, పశు పక్షాదులు వింతగా ప్రవర్తిస్తుంటాయని చెబుతున్నారు. పావురాళ్లు తమ దిశను మార్చుకుంటాయని, కుక్కలు, పిల్లులు, ఎలుకలు అసాధారణంగా అరుస్తాయని అంటున్నారు. అలాగే నీటిలో చేపల ప్రవర్తనలో అసాధారణ మార్పులు కనిపిస్తుంటాయని వివరిస్తున్నారు. ఇంత లోతుగా పరిశీలిస్తున్నప్పుడు ఈ వన్యప్రాణుల ప్రవర్తన ఆధారంగా భూకంపాలను ముందుగానే కనుక్కునే సాంకేతికత అభివృద్ధి చేయవచ్చన్న సూచనలు వస్తున్నాయి. మన దేశంలో కూడా భూకంపాల ప్రభావం కనిపిస్తోంది. భారత దేశం భూ ఫలక ఉత్తర దిశగా ఈశాన్యం వైపు కదులుతూ ఉంటుంది. ఈ ఫలక సంవత్సరానికి 5 సెం.మీ చొప్పున కదులుతుంది. భారత దేశానికి పైభాగంలో ఉన్న యురేషియన్ భూఫలక ఉత్తరదిశగా ఏడాదికి రెండు సెం.మీ చొప్పున కదులుతోంది. ఈ రెండు ఫలకల కదలికల్లో తేడాలు ఉండడం వల్ల భారత భూఫలక, యురేషియన్ ఫలకను ఢీకొడుతుంది. అందుకే హిమాలయాల ప్రాంతాల్లో తీవ్ర భూకంపాలు సంభవిస్తున్నాయి. దేశ చరిత్రలో ఇప్పటివరకు ముఖ్యమైన భూకంపాల తీవ్రతలు 5.4 8.4 మధ్యే నమోదయ్యాయి. భూకంపం వచ్చేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను ఐదు సెస్మిక్ జోన్లుగా వ్యవహరిస్తూ ఉంటారు. ఈ లెక్కన జోన్ 5లో ఉంటే భూకంపాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు, జోన్ 1లో ఉంటే భూకంపం వచ్చే అవకాశం తక్కువగా ఉన్నట్టు భావించవచ్చు. జోన్ 5 లో ఉన్న ప్రాంతాల్లో రిక్టర్ స్కేలుపై 7 కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపాలు వచ్చే వీలున్నట్టు అధికారులు చెబుతున్నారు. జమ్మూకశ్మీర్, పశ్చిమ, మధ్య హిమాలయాలు, ఈశాన్య రాష్ట్రాలు, అండమాన్ నికోబార్ దీవులు, ఉత్తర, మధ్య బీహార్, గుజరాత్‌లోని రానా ఆఫ్ కచ్ ఈ జోన్ లోనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ గత ఏడాది డిసెంబర్‌లో భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. జోన్ 3 లో తెలంగాణ లోని రామగుండం, మంచిర్యాల, భూపాలపల్లి, ఖమ్మం, బెల్లంపల్లి, భద్రాచలం ఉన్నాయి. ఆంధ్రలోని ఉభయ గోదావరి జిల్లాలు, ఒంగోలు, నెల్లూరు, విజయవాడ ప్రాంతాలు ఈ జోన్ కిందకు వస్తాయి. భూకంపాల ప్రమాదాలను నివారించాలంటే భూకంప నిరోధక నిర్మాణ విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. భూకంపాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించాలి. భూకంపం సంభవించిన వెంటనే పరిశోధనలతోపాటు, ఆ ప్రకంపనలను విపత్తు నిర్వహణ సంస్థలు తక్షణమే విశ్లేషించగలగాలి. అప్పుడే అత్యవసర సేవలను బాధితులకు సత్వరం అందించడానికి వీలవుతుంది

## నేటినుంచి మధురైలె సిపిఎం మహాసభలు

### వేలాదిగా తరలి వెళ్లిన ఎర్రదండు సభ్యులు

చెన్నై : సిపిఎం 24వ అఖిల భారత మహాసభ బుధవారం తమిళనాడులోని మధురైలో ప్రారంభం కానుంది. అంతకుముందే తమిళనాడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరిని అమరవీరుల స్మారక జాతాలు మంగళవారం మదురైకు చేరుకున్నాయి. అందులో భాగంగానే జాతాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కామ్రేడ్ సింగరవేలర్ స్మారక జాతా చెన్నై నుండి మదురైలోని పార్టీ మహాసభ వేదిక వరకు కొనసాగుతోంది. సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె బాలభారతి జాతాకు నాయకత్వం వహిస్తున్నారు. దీనిలో వందలాది మంది కామ్రేడ్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ జాతా ప్రారంభం సందర్భంగా చెన్నై శివార్లలోని తాంబరంలో బహిరంగ సభ జరిగింది. విద్యార్థి అమరవీరులు సోము, సెంబు త్యాగాలను గౌరవించే జాతా తూత్తుకుడి నుండి మధురైలోని పార్టీ మహాసభ వేదిక వరకు కొనసాగింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పి సంపత్ ఈ జాతాకు నాయకత్వం వహించారు. విద్యార్థి సంఘం నేతలు, పార్టీ నాయకుల సమక్షంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కెజి భాస్కరన్‌కు జ్యోతిని అందజేశారు. సేలం జైలు అమరవీరుల స్మారక జాతా సేలం సెంట్రల్ జైలు నుండి ప్రారంభమైంది. 1946లో ఉరితీయబడిన నలుగురు యువ వస్త్ర మిల్లు కార్మికుల జ్ఞాపకార్థం కోయంబత్తూరులోని చిన్నియం పలయం అమరవీరుల జాతా మదురైలోని పార్టీ మహాసభ వేదిక వరకు కొనసాగింది. మాజీ ఎంపి పిఆర్ నటరాజన్ జ్యోతిని అందజేసిన కార్యక్రమంలో వందలాది మంది కామ్రేడ్స్ పాల్గొన్నారు. కోయంబత్తూరు జిల్లా కమిటీ కార్యదర్శి సి పద్మనాభన్, ఇతర నాయకులు హాజరయ్యారు. తిరువయారు యూనియన్ కందియూర్‌లోని వెన్మణి అమరవీరుల స్మారక జాతాకు యూనియన్ కార్యదర్శి ఎ రాజు నాయకత్వం వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చిన్నైతో పాటు పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎంజి సంస్థకు ఆ భూములను చంద్రబాబు కేటాయించారు: చామల

హైదరాబాద్: గతంలో ఐఎంజి సంస్థకు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ భూమిని కేటాయించారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. హెచ్‌సియు దగ్గర ఉన్న 800 ఎకరాలు ప్రభుత్వ భూమి అని తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఆర్ సర్కార్ ఆ భూములను వెనక్కి తీసుకుందని, 19 ఏళ్లుగా భూములు వివాదంలో ఉండడంతో చెట్లు పెరిగాయని చామల స్పష్టం చేశారు. అటవీ భూములంటూ తప్పుదారి పట్టిస్తున్నారని, బిఆర్ఎస్, బిజెపి తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకులు విద్యార్థులను రెచ్చగొడుతున్నారని చామల మండిపడ్డారు. హెచ్‌సియు భూములను అమ్మవద్దని విద్యార్థుల సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఇవాళ యూనివర్సిటీ బంద్ కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. బిజెవైఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్?సీయూ ముట్టడికి వస్తారనే సమాచారంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. యూనివర్సిటీ పరిసరాల్లోకి ఎవరినీ పోలీసులు రానివ్వడంలేదు. యూనివర్సిటీ భూములను పరిశీలించేందుకు వస్తున్న బిజెపి ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేశారు. హెచ్?సియు వద్ద భారీగా పోలీసుల మోహరించారు.

## జజార్ఖండ్‌లో రెండు గూడ్స్ రైళ్ల ఢీ

### ముగ్గురు లోకో పైలట్లు మృతి

రాంచీ : జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌లో మంగళవారం ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు గూడ్సు రైళ్లు ఢీకొన్న ఈ ఘటనలో లోకో పైలెట్లు ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో జరిగింది. ఫరక్కా నుంచి లాల్మాటియాకు వెళ్తున్న గూడ్స్ రైలు బర్హెట్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఆ తర్వాత మంటలు చెలరేగి రెండు ఇంజిన్లకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో లోకో పైలెట్లు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరో ముగ్గురు సిఐఎస్ఎఫ్ జవాన్లు సైతం గాయపడినట్లు సమాచారం. ఇక ఈ విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని.. మంటల్ని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు.

## వైసిపి కార్యకర్త హత్య

### కుటుంబానికి జగన్పరామర్శ

అమరావతి : శ్రీ సత్యసాయి జిల్లాలోని రామగిరి మండలం పాపిరెడ్డి పల్లిలో గత రెండు రోజుల క్రితం హత్యకు గురైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. లింగమయ్య కుమారుడు మనోహర్ తో ఫోన్లో మాట్లాడారు. తనకు ప్రాణహాని ఉందని జగన్ కి చెప్పిన లింగమయ్య కుమారుడు మనోహర్.. అన్ని రకాలుగా అండగా ఉంటామని, అవసరమైన సహాయం అందిస్తామని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. ఈ వారంలో పాపిరెడ్డిపల్లికి వస్తానని వైఎస్ జగన్ పేర్కొన్నారు. వైసీపీ కార్యకర్త లింగమయ్య హత్యను మాజీ సీఎం జగన్ తీవ్రంగా ఖండించారు. లింగమయ్యను టీడీపీ నేతలు పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నించినందుకే హత్య చేశారని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలపై దాడులు చేయడం ఆపాలని చెప్పుకొచ్చారు. పోలీసులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కయ్యారు.. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని విమర్శించారు. లింగమయ్య కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.


## తిరుపతి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

### హనుమంత వాహనంపై విహరించిన స్వామివారు

తిరుపతి : తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం ఉదయం 8 గంటలకు



స్వామివారు హనుమంత వాహనంపై అభయమిచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. త్రేతాయుగంలో రామభక్తునిగా, భగవద్భక్తులలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధిగాంచిన వాడు హనుంతుడు. రాముడు భక్తాగ్రగణ్యుడైన హనుమకు ఆత్మతత్వాన్ని బోధించినట్లు- ప్రాచీన వాఙ్మయం నుండి తెలుస్తోంది. హనుమంతుడు తనను సేవించే భక్తులకు ఆత్మోన్నతిని ప్రసాదిస్తున్నాడు. శ్రీ వైష్ణవ సాంప్రదాయంలో హనుమద్వాహన సేవను సిరియ తిరువడిగా కీర్తిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, కొబ్బరినీళ్లు, చందనంలతో అభిషేకం చేశారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మికం

# సన్న బియ్యం పంపిణీ వల్ల నిరుపేదలకు లబ్ధి

- త్వరలోనే కొత్త రేషన్ కార్డుల పంపిణీ
- రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుంది
- సన్న వడ్లకు బోనస్‌తో గణనీయంగా పెరిగిన సన్నాల సాగు: వొడితల ప్రణవ్





**హుజురాబాద్ ఏప్రిల్ 1 (ది క్రైమ్ న్యూస్):** దేశంలో ఏ ప్రభుత్వం చేయని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని,రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ గొప్ప కార్యక్రమమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం నాడు హుజురాబాద్ మండల పరిధిలోని కందుగుల గ్రామంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని, గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పిన నాయకులు ఆశ్చర్యపడేలా ఇతర దేశాలకు సైతం సన్న బియ్యాన్ని ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ రాష్ట్రం ఎదిగిందని అన్నారు. సన్న బియ్యం పంపిణీ ద్వారా రాష్ట్ర ఖజానా మీద 2,300 కోట్ల అదనపు భారం పడుతున్న పేదల అభ్యున్నతి కోసం ఆలోచించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో పేదవాడి ఆకలి తీర్చడానికి కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,200 రేషన్ షాపుల్లో ఇలాంటి కార్యక్రమాన్ని చేస్తున్నామని, రానున్న రోజుల్లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఒక్కొక్కటిగా ఎన్నికల్లో ఇచ్చిన పనులన్నీ పూర్తి చేస్తామని, ప్రతిపక్ష నాయకులు చెప్పిన మాటలు నమ్మి మళ్ళీ మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులను ఆపాలి

- ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక పిలుపు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆదివాసీలపై దాడులకు వ్యతిరేకంగా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం పెద్దపల్లి పట్టణం లోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక కన్వీనర్ లు ముడిమడుగుల మల్లన్న, జిన్నా ప్రసాద్, గుమ్మడి కొమురయ్య, తాళ్లపల్లి లక్ష్మణ్, రామిళ్ల బాపు శ్రీపతి రాజగోపాల్‌లు మాట్లాడుతూ ఆదివాసీలకు అన్ని ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష,పౌర,ప్రజాస్వామిక, వర్గాల ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అడవులలోని కొల్లగొ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని, అందులో భాగంగానే చిన్న పిల్ల గుడ్డు మొదలు పండు ముసలి వరకు దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగిస్తున్నదని ఆరోపించారు.దీనికోసం ఆదివాసీలకు అన్ని వర్గాల ప్రజలు, దళితులు, మేధావులు, హక్కుల కార్యకర్తలు అండగా ఉండాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, సిపిఐ ఎమ్ ఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు గుమ్మడి వెంకన్న, అసంఘటిత కార్మిక సంఘం అధ్యక్షులు బాపన్న , రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెళ్తురు సదానందం, ప్రజా ఫ్రంట్ జిల్లా కో కన్వీనర్ గాండ్ల మల్లేశం, కొంతం రాజు, రైతు సంఘం నాయకులు ఎరుకల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఊరుకోము

- మాజీ జెడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్



**జమ్మికుంట ఏప్రిల్ 1 (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టడం అత్యంత దౌర్భాగ్య చర్యను జమ్మికుంట మాజీ జెడ్పిటిసి డాక్టర్.శ్రీరామ్ శ్యామ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వవిద్యాలయాలు క్రియాశీలక పాత్ర పోషించినని వారు గుర్తు చేశారు విశ్వవిద్యాలయ విద్యార్థుల పోరాటాల మూలంగానే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత యువతకు నిరుద్యోగులకు ,ఉద్యోగాలు వస్తాయని ఎంతగానో ఆశించారని వారు గుర్తు చేశారు, కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ భూములు, విశ్వవిద్యాలయ భూములను అమ్మి వాటిని సొమ్ము చేసుకుని ప్రజాపాలన చేయడం అత్యంత దౌర్భాగ్యమని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈరోజు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మడమే కాకుండా రాబోయే రోజులలో అన్ని జిల్లాల్లోని విశ్వవిద్యాల భూములను, ఇంటర్,డిగ్రీ కళాశాలకు చెందిన ప్రభుత్వ భూములు కూడా అమ్మడానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వెనకాడదని వారి సందర్భంగా ఎద్దేవా చేయడం జరిగింది. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి పాలన ప్రజా సమస్యలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపైన దృష్టి సారించాలని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. యూనివర్సిటీ భూమిలో జోలికి పోతే ఎంత పెద్ద నాయకుడైనా భూస్థాపితం కావాల్సిందని వారు హెచ్చరిక చేయడం జరిగింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నూతన విద్యా విధానం పాలసీ అనుకుంటూనే విద్యా వ్యవస్థను నాశనం చేయడానికి మరో పక్క ఆలోచిస్తున్నాడని వారి సందర్భంగా గుర్తు చేశారు. విశ్వవిద్యాలయాలలో బోధన, బోధనేతర సిబ్బంది నియామించకుండా విశ్వవిద్యాలయాల పైన రాష్ట్ర ప్రభుత్వం మునిలి కన్నీరు కారుస్తుందని వారు ఎద్దేవా చేశారు. విద్యార్థులపైన లాఠీచార్జ్ చేయడం వారిపై కేసులు నమోదు చేయడం మూలంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెడ్డ పేరు తప్ప ప్రజల్లో మంచి పేరు రాదని వారి సందర్భంగా గుర్తు చేశారు. రేవంత రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలో అమలు చేయలేక ప్రజల విశ్వాసం కోల్పోయారని ఈ సందర్భంగా వారు గుర్తు చేయడం జరిగింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను యూనివర్సిటీకే కేటాయించాలని, మాజీ జెడ్పిటిసి డాక్టర్.శ్రీరామ్ శ్యామ్ డిమాండ్ చేశారు.

# కరీంనగర్ త్రీ టౌన్, మానకొండూరు పోలీసుస్టేషన్ల ఆకస్మిక తనిఖీ

- కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం






**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని త్రీ టౌన్ మరియు మానకొండూరు పోలీస్ స్టేషన్లను కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆకస్మిక తనిఖీ చేసారు. పోలీసు స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగారు. పోలీస్ స్టేషన్ లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. వారికి కేటాయించబడిన విధులు అడిగి తెలుసుకున్నారు. సరైన పద్దతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్ లో పొందుపరచాలన్నారు. పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని సూచించారు. నమోదైన సైబర్ నేరాల గురించి తెలుసుకున్నారు. అర్బన్ పోలిసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మానకొండూరు పోలీసు స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేసారు. పోలీసు స్టేషన్ లో అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలన్నారు. రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు మొదలగు విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని తెలిపారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి మరియు మానకొండూరు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రామగుండం.2లో 99% బొగ్గు ఉత్పత్తి సాధ్యం



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ డివిజన్ గనుల్లో ఈ ఆర్థిక సంవత్సరం 99 శాతం బొగ్గు ఉత్పత్తి సాధ్యమైంది. ఈ మేరకు డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో, డివిజన్ జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని ఓసిపి.త్రి ప్రాజెక్టు, వకీల్ పల్లి గని లో 2024- 25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, ఓవర్ బర్డన్ (మట్టి) వెలికితీత, రవాణా జరిగిన వివరాలను వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పతి లక్ష్యాలు 98,70,000 టన్నులకు గాను, 97,77,937 టన్నులు, ఓవర్ బర్డెన్ వెలికితీత లక్ష్యాలు 6,03,48,000 క్యుబిక్ మీటర్లకు గాను, 4,55,70,002 క్యూభిక్ మీటర్లతో 76% తీయడం జరిగిందని తెలిపారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో ఓసిపి-3 కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నుండి 86,73,922 టన్నుల బొగ్గును రవాణా చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఇక రాబోయే 2025-26 ఆర్థిక సంవత్సరములో వంద శాతం ఉత్పత్తి సాధించే దిశ లో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు ప్రణాళికలు సిద్దం చేసినట్లు జీఎం కోరారు. అలాగే ఏరియాలో ఉద్యోగుల, పరిసర గ్రామాల ప్రజల కొరకు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను జీఎం వివరించారు. ఈ సమావేశంలో డివిజన్ ఇంజినీర్ నరసింహారావ్, డివిజన్ అఫిషియేటింగ్ ప్రాజెక్ట్ అధికారి ఎస్ఓ టు జీఎం ఎం. రాముడు, డిజిఎం (పర్సనల్) %ఁ% అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, ఏజీఎం వర్క్ షాప్ ఎర్రన్న, డిజిఎం లు మురళీకృష్ణ, ధనుంజయ, వెంకట రామచంద్ర, సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్ పాల్గొన్నారు.

# డివిజన్ కార్యాలయంలో శ్రీ లక్ష్మీదేవి పూజ



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** నూతన ఆర్థిక సంవత్సరాన్ని పురస్కరించుకొని సింగరేణి రామగుండం రెండవ డివిజన్ కార్యాలయంలోని ఫైనాన్స్ విభాగం ఎకౌంట్స్ సెక్షన్ లో మంగళవారం డివిజన్ జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య శ్రీ లక్ష్మి దేవి పూజ నిర్వహించారు. ఉదయం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పండితలు జగనాథఆచార్యులు శాస్త్రోత్తంగా లక్ష్మి దేవి పూజా నిర్వహించారు. ఈ ఆర్థిక 2025- 26 సంవత్సరంలో మెరుగైన ఉత్పత్తి లక్ష్యాలు సాధించి, సంస్థకు మంచి లాభాలు ఆర్జించాలని ఆయన అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ నాయకుడు జి. రవీందర్, ఇంజినీర్ నరసింహారావ్, డివిజన్ అఫిషియేటింగ్ ప్రాజెక్ట్ అధికారి ఎస్ఓ టు జీఎం ఎం. రాముడు, డిజిఎం లు మురళీకృష్ణ, వెంకట రామచంద్ర, సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, ఫైనాన్స్ మేనేజర్ తిరుపతి రెడ్డి, నాయకులు అన్నారావ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణి ప్రారంభించిన ఎమ్మెల్యే



**జగిత్యాల (ది క్రైమ్ న్యూస్).** జగిత్యాల పట్టణంలో 8వ వార్డు బుడగ జంగాల కాలనీలో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్ సివిల్ సప్లై డిఎం జితేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్‌స్పందన,మాజీమున్సిపల్‌చైర్మన్ కౌన్సిలర్లు నాయకులు వార్డు ప్రజలు పాల్గొన్నారు. సన్న బియ్యాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రికి వార్డు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలి

- పెద్దపల్లి డీసీపీ పి.కరుణాకర్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి పట్టణ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ నేరాలకు పాల్పడిన రౌడీ షీటర్లకు పెద్దపల్లి డీసీపీ పి. కరుణాకర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తన తో ఉండాలని ఒకవేళ క్రిమినల్ కేసులలో ఇన్వాల్వ్ అయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, పెద్దపల్లి సిఐ కె. ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి ఎస్సైలు జె. లక్ష్మణ్ రావు, బి. మల్లేశం, ధర్మారం ఎస్సై, ఎస్. లక్ష్మణ్, బసంత్ నగర్ ఎస్సై, ఆర్. స్వామి లు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో సన్న బియ్యం పంపిణీ



**జమ్మికుంట ఏప్రిల్ 1 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపెల్లి ఏరియా 17 వార్డులో పరిధిలోని చౌక దుకాణంలో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి, జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సివిల్ సప్లై మినిస్టర్ ఉత్తంకుమార్ రెడ్డి ఉగాది రోజు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సన్న బియ్యం ఇవ్వడం ప్రారంభించడం జరిగింది, కాంగ్రెస్ ప్రభుత్వం మాటిస్తే మాట తప్పదు అందులో భాగంగా ఈరోజు జమ్మికుంటలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించడం జరిగిందని హాయ్ తెలిపారు.

# రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

## • సింగరేణి జీఎం బి. వెంకటయ్య





**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** ఈ ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి చేసిన ఓసిపి.3 ప్రాజెక్టు ఉద్యోగులను, సింగరేణి రామగుండం రెండవ డివిజన్ జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య అభినందించారు. మంగళవారం ప్రాజెక్టు ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రాజెక్టు కార్మికులకు ముందుగా ఉగాది, రంజాన్ పర్వదినాల శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాధించవలసిన లక్ష్యాలు, గడచిన ఆర్థిక సంవత్సరం సాధించిన విజయాలకు కృషి చేసిన ఉద్యోగులు, అధికారులు అభినందనీయులన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి రోజు అత్యదిక ట్రిప్పులు కొట్టిన డంపర్, షావల్ ఆపరేటర్లను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రికార్డ్ స్థాయిలో 1,21,365 క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డన్ (మట్టి), 51,111 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడం ఉద్యోగులను, అధికారులను అభినందించారు. అలాగే ఇటీవల అశ్వస్వత గురైన సంక్షేమాధికారికి సిపిఆర్ చేసి కాపాడిన ఉద్యోగులను ఆయన ఘనంగా సన్మానించారు. ఉత్పత్తి లక్ష్యాలు సాధించడంలో అన్ని విభాగాల ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. రాబోయే 2025-26 వార్షిక లక్ష్యాలు సాధించడానికి ఉద్యోగులు కలిసి కట్టుగా ప్రాజెక్టుకు కేటాయించిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కోరారు. బారీ యంత్రాలవద్ద పని చేస్తున్నప్పుడు సూచించిన రక్షణ సూత్రాలను విధిగా పాటించాలని, అలాగే సీనియర్ ఉద్యోగులతో క్రమశిక్షణ కలిగిన ఉద్యోగులుగా మెదలాలని జీఎం సూచించారు. అనంతరం ఆయన ప్రాజెక్టు ఉద్యోగులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి జి. రవీందర్, ఏజీఎం వర్క్ షాప్ ఎర్రన్న, అఫిషియేటింగ్ ప్రాజెక్ట్ అధికారి ఎస్ఓ టు జీఎం ఎం. రాముడు, అధికారుల సంఘం ప్రతినిధి నర్సింహులు, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, డిజిఎం (పర్సనల్) అధికార ప్రతినిధి ఎస్. అనిల్ కుమార్, డిజిఎం లు మురళీకృష్ణ, వెంకట రామచంద్ర, బేస్ వర్క్ షాప్ ఇంచార్జ్ విజయ్ కుమార్, ప్రాజెక్టు మేనేజర్ భరత్ కుమార్ ఇతర అధికారులు, కార్మిక నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉగాది పండగ పురస్కరించుకొని వాలీబాల్ టోర్నమెంట్ పెట్టడం హర్షనీయం



**కమాన్ పూర్ (ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండల కేంద్రంలో వాలీబాల్ టోర్నమెంట్ పెట్టడం హర్షనీయమని మాజీ ఎంపీపీ వాలీబాల్ మాజి ఆటగాడు మల్యాల రామ్ చంద్ర గౌడ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ పి విజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రాత్రి సుభాష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను అందజేశారు. గత రెండు రోజులుగా కొనసాగిన ఇందులో సుమారు పది జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఫైనల్ లో పాలకుర్తి మండలం లోని భామల నాయక్ తండ జట్టు గెలుపొందగా రన్నరప్ గా కమాన్ పూర్ మండలంలోని పేరా పల్లి జట్టు నిలిచింది. వీరికి బహుమతి ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. గెలిచిన జట్టుకు మాజీ ఎంపీపీ పోలేటి మారుతి 5000 రూపాయలను అలాగే రన్నర్ అఫ్ జట్టుకు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు రంగ్ సత్యం గౌడ్ 3000 రూపాయలను అందజేశారు. సెమీ ఫైనల్ లో ఓడిపోయిన రెండు జట్లకు 2000 రూపాయల చొప్పున అలాగే ఉత్తమ క్రీడాకారులకు 500 చొప్పున సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి అందజేశారు. ఈ సందర్భంగా కమాన్పూర్ మండల కేంద్రంలో చాలా రోజుల తర్వాత వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగిందని దీని నిర్వహించిన సుభాష్ యూత్ క్లబ్ సభ్యులను కొని ఆడారు. నేడు గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి క్రీడలు నిర్వహించి క్రీడాకారులను వెలిక్కి తీయాలని అన్నారు. అలాగే రానున్న రోజుల్లో మరిన్ని క్రీడలు నిర్వహించాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు గెలిపిదేయంగా పనిచేయాలని కోరారు. అలాగే ప్రముఖ సీనియర్ పాత్రికేయుడు జబ్బార్ ఖాన్ ఈ కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ ఆటగాడు నల్లవెల్లి శంకర్, అలవేన లక్ష్మీరాజం, మచ్చగిరి రాము, వెంగలి తిరుపతి, సుభాష్ యూత్ సభ్యులు అధ్యక్షుడు చీదురాల అజయ్,పంజా సాయిరాం గౌడ్, పల్లె అనుదీప్ గౌడ్, నరేష్, పెంద్యాల అమరేశ్వర్, ప్రవీణ్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులందరికీ ఇన్సెంటివ్ వర్తింపచేయాలి

**- ఐఎన్టియూసి నాయకులు డిమాండ్**




**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం ఓసిపి.1 ప్రాజెక్టులో సర్వీస్ కాలం పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొందిన శివనందిని ప్రాజెక్టు అధికారులు, తోటి ఉద్యోగులు శాలువాలతో సన్మానించి వీడ్కోలు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కార్మిక నాయకులు, ఉద్యోగులు శివనంది దంపతులను వేదికపైకి ఆహ్వానించి ఘనసన్మానంతో వీడ్కోలు పలికారు. ఇక ఇదే సందర్భంగా ప్రాజెక్టు యాజమాన్యం ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసింది. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించినందుకు గాను ప్రాజెక్టు అధికారి జె.రాజశేఖర్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ డివిజన్ ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, కేంద్ర కమిటీ కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ప్రాజెక్టు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. నాయకులు రవీందర్ రెడ్డి, గడ్డం తిరుపతి మాట్లాడుతూ.. ప్రాజెక్టు ఉద్యోగులందరికీ స్పెషల్ ఇన్సెంటివ్ తో ప్రోత్సాహాన్ని అందించాలని యాజమాన్యాన్ని కోరారు. ప్రాజెక్టులో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, యంత్రాలు పూర్తిస్థాయి కండిషన్ లో లేకున్నప్పటికీ, ఫైర్ (నిప్పంటుకున్న) సీముల నుండి, రక్షణ చర్యలు విధిగా పాటిస్తూ, 35 లక్షల టన్నుల బొగ్గు లక్ష్యాన్ని సాధించిన ఉద్యోగులందరికీ ఇన్సెంటివ్ స్కీం వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు కోటయ్య, కోట రమేష్, రఘువరణ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, హరికిషన్, బుగ్గాజీ, నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను సన్మానించిన కార్మిక నాయకులు

**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ డివిజన్ ఓసిపి.త్రీ ప్రాజెక్టులో మంగళవారం ఐఎన్టియూసి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పలువురు కార్మికులకు సన్మానం జరిగింది. ప్రాజెక్టు ఆవరణలో యూనియన్ ప్రాజెక్టు పిట్ కార్యదర్శి కొంగర రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న డివిజన్ జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య, యూనియన్ డివిజన్ ఉపాధ్యక్షులు బి.శంకర్ నాయక్, సర్వీస్ కాలం పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగి ఎకె. పాండే ను, సిపిఆర్ చేసి సంక్షేమ అధికారి ప్రాణాలు కాపాడినందుకు ఆకునూరి రాజయ్యకు, వెంకట రాజం లను శాలువాలతో సన్మానించారు. ఇక ఈ సందర్భంగా ఉద్యోగులు స్థానికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాయకుడు శంకర్ నాయక్, జీఎం దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త సత్యనారాయణ రెడ్డి, ఐరెడ్డి సంపత్ రెడ్డి, ఎస్. మల్లేశ్, కోల కనకయ్య, ఎం. శ్రీనివాస్, రమేష్, టి. సమ్మయ్య, బి. రవీందర్, ఎల్లబోయిన మల్లికార్జున్, వి. అశోక్, బి. నర్సయ్య, వి. తిరుపతి, బి. శ్రీనివాస్, బి. జాన్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, మధు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.




## తిమ్మాపూర్ మండలంలో రేషన్ పంపిణీకీ ఆలస్యమెందుకో?

### - సుగుర్తి జగదీశ్వర చారి



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ బీజేపీ మండలాద్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ మొదలు కాగా తిమ్మాపూర్ లో ఆలస్యమెందుకని ప్రశ్నిస్తూ మంగళవారం ప్రకటనను జారీ చేశారు. ప్రతీ నెలా ఏప్రిల్ 1నుండి రేషన్ బియ్యం పంపిణీ జరగాల్సి ఉండగా సన్న బియ్యం పంపిణీ మండలంలో ఎందుకు ప్రారభించలేదన్నారు. రాష్ట్రమంతటా ప్రారంభమైన పథకం కేవలం తిమ్మాపూర్ మండలంలో ప్రారంభించకపోవడం చాలా శోచనీయమని పేర్కొంటూ ఎమ్మెల్యే ద్వారా ప్రారభించాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని వాయిదా వేయడం సమజసం కాదన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలకు ఇస్తున్న ఉచిత బియ్యం పంపిణీ పథకంలో కేంద్రం వాటానే ఎక్కువగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని తమదిగా చెప్పుకునేందుకే సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని ఆరోపించారు. ప్రజలకు సన్న బియ్యం ఇవ్వడం మంచి కార్యక్రమమే అయినా కేంద్రం వాటాను ప్రజలకు తెలవకుండా చేయడం దుర్మార్గమని అన్నారు.కేంద్ర వాటాల గురించి ప్రజలే తెలుసుకుంటున్నారని తెలిపారు.హంగు ఆర్భాటాల పేరిట పంపిణీ కార్యక్రమాన్ని ఆలస్యం చేయకుండా ప్రతీ గ్రామంలోని రేషన్ షాప్ లను వెంటనే ప్రారంభించాలని ప్రకటన ద్వారా డిమాండ్ చేసారు.

## తొలి సంతకంతో సంతకాల సేకరణ విద్యావిస్తరణకు పునాదిగా నిలిచింది

### - పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి



**బెజ్జంకి(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో డిగ్రీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కోసం 2022వ సంవత్సరం జూన్ 21న జరిగిన సంతకాల సేకరణ కార్యక్రమం ఒక ముఖ్యమైన ప్రజా ఉద్యమంగా నిలిచిందని హర్షం వ్యక్తంచేస్తూ సిద్దిపేట జిల్లా డిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ పోతిరెడ్డి రాజశేఖరరెడ్డి ఒక ప్రకటనను జారీ చేశారు.ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తన తొలి సంతకంతో ప్రారంభించిన సంతకాల సేకరణ విద్యావిస్తరణకు ఒక పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. మండలమంతా పర్యటించి ప్రజలకు డిగ్రీ కళాశాల యొక్క ఆవశ్యకతను కాంగ్రెస్ శ్రేణుల ద్వారా వివరిస్తూ 2,500 సంతకాలు సేకరించి ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి తెలియజేశారన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్న సంతకాల సేకరణ కార్యక్రమం బెజ్జంకి మండలంలో ఉన్నత విద్యా సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి ఒక మైలురాయిగా నిలిచి డిగ్రీ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయడం ద్వారా యువతకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందడుగు వేసి సంతకాల సేకరణలో పాల్గొన్న అన్ని పార్టీల నాయకులకు, ప్రజలకు, సామాజిక సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ బెజ్జంకి మండలం యొక్క విద్యా, సామాజిక అభివృద్ధి కోసం 2022 లో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ చేసిన కృషి నేడు ఫలించినట్లు రాజశేఖరరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

## ఘనంగా అడ్లూరి జన్మదిన వేడుకలు

**- కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కార్యకర్తలు**





**ధర్మారం,(ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ విప్ అడ్డూరి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కార్యకర్తలు అభిమానులు పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఒకరికి ఒకరు కేక్ తినిపించుకున్నారు. రామయ్యపల్లి గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షులు తాజా మాజీ వార్డ్ మెంబర్ మరియు విద్యా కమిటీ చైర్మన్ కోట మహేందర్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో కేక్ కట్ చేసి కూలీలకు మజ్జిక ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మార్కెట్ చైర్మన్ రూప్ల నాయక్, ఏఎంసి డైరెక్టర్ లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు తాజా మాజీ ఉపసర్పంచ్ పంజాల లత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు సముద్రల మల్లయ్య, ఎగుర్ల తిరుపతి, మార్క సతీష్, కోట శ్రీకాంత్, రజనీకాంత్, సంతోష్ బాలయ్య గౌడ్, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రభుత్వ విప్ అడ్లూరి జన్మదిన వేడుకలు

**- మంత్రి వర్గంలో చోటు దక్కాలని ప్రత్యేక పూజలు**





**పెగడపల్లి, ఏప్రిల్,1 (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి శాసనసభ్యుడు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదినం సందర్భంగా మంత్రివర్గంలో చోటు దక్కాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్యకర్తలు పెగడపల్లి మండలంలోని స్వయంభు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష్మణ్ కుమార్ కు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విరజిల్లుతూ మంత్రి వర్గంలో చోటు దక్కాలని పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విప్ లక్ష్మణ్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ ఓరగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్యావ పల్లకి సేవలో పాల్గొనీ కస్తూర్బా గాంధీ స్కూల్ లో విద్యార్థులకు స్వీట్లు పంపిణీచేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షడు ప్రధాన కార్యదర్శులు చాట్ల విజయభాస్కర్, బండారి శ్రీనివాస్, సంది మల్లారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పురుషోత్తం, అనిల్ గౌడ్, అధికార ప్రతినిధి పూసల తిరుపతి, కడారి తిరుపతి, తోట మల్లేశం, మద్దెల సుధీర్, తెలంగాణ రాష్ట్ర ఓయూ జేఏసీ చైర్మన్ కోలాపూర్ చంద్రశేఖర్, శ్రీరామ్, అంజయ్య పటేల్, సత్యనారాయణ రెడ్డి, అజ్మీర అంజి నాయక్, ఇస్లావత్ రవి నాయక్, మందపల్లి అంజయ్య, మారం కొమురయ్య, కాసవిని కుమార్, మోదుంపల్లి ఎర్ర అంజయ్య, లక్ష్మణ్, చెట్ల కిషన్, కొంచెం రాజేందర్, చాట్లా ప్రశాంత్, వడ్లూరి ప్రవీణ్ కుమార్, లింగంపల్లి మహేష్, నరేందర్, పెద్ద సత్యం, ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి, కొత్తూరు విష్ణు, నీరటి రాజేందర్, బుర్ర సంపత్ కుమార్, తడగొండ కుమార్, లక్ష్మణ్, పుల్కం జలపతి, మాడిశెట్టి లక్ష్మీనారాయణ, ఆత్మకూరు అశోక్, మల్యాల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గంగులా ప్రజలను తప్పుదోవ పట్టిచ్చే ప్రయత్నం మానుకో...

**- పేద ప్రజలకు సన్నబియ్యం ఇవ్వడాన్ని ప్రతి పక్షాలు జీర్ణించుకుంటలేవు**



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1(ది క్రైమ్ న్యూస్):** గతంలో మానేర్ డ్యామ్ డెడ్ స్టోరేజ్ కు వచ్చినప్పుడు మేము ధర్నాలు చేస్తే మంత్రిగా ఉండి పట్టించుకోని గంగుల కమలాకర్ ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న 5.7 టిఎంసి నీటితో కలిపి ఈ నెల 15 తారీఖు వరకు 6.5 టిఎంసి వరకు నిల్వ ఉంటుందని తెలిపారు. మిడ్ మానేరు నుండి సరిపోయేంత నీటిని లోయర్ మానేరు డ్యామ్‌కు తరలిస్తామని నరేందర్ రెడ్డి అన్నారు.జూలై నెల వరకు కరీంనగర్ కార్పొరేషన్ త్రాగు నీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే గంగులకు అన్నీ తెలిసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకం తీసుకరావడాన్ని ప్రతి పక్షాలు తట్టుకోలేక పోతున్నాయని గతంలో దొడ్డు బియ్యం రీసైక్లింగ్ చేసి బిఆర్ఎస్ నాయకులు కోట్ల రూపాయలు సంపాదించారని నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ విలేఖరుల సమావేశంలో దన్న సింగ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జిడి రమేష్, దండి రవీందర్, కీర్తి కుమార్, ఆస్తాపురం రమేష్, జూపాక సుదర్శన్, ఉప్పరి అజయ్, సాయిరాం, మాసుం ఖాన్, బషీర్, ఇమామ్, ఆంజనేయులు, యనమల మంజుల, హనీఫ్, మామిడి సత్యనారాయణ రెడ్డి, వాడి వెంకట్ రెడ్డి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# మానకొండూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ

## • కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం

**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని రక్షకభట నిలయాన్ని జిల్లా నూతన రక్షకభటాదికారి సిపి గౌష్ ఆలం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిలయం ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాదీనంలో ఉన్న వాహనాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బంది విధులు, సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్ లో పొందుపరచాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి వాటికి గల కారణాలు తెలుసుకుని త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ ఆదేశించారు. సైబర్ నేరాల గురించి తెలుసుకుని అర్బన్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రక్షకభట నిలయ పరిధిలో గల అన్నీ గ్రామాలను సెక్టార్, సబ్ సెక్టార్లుగా విభజించి వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేసి అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకుంటూ రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షను, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు మొదలుగు విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా పాటిస్తూ రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి



సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎసిపి వెంకటస్వామి, సిఐ లక్ష్మీనారాయణ, అధికారులు, రక్షకభట నిలయం సిబ్బంది పాల్గొన్నారు.

# నీరు అందక పంట పొలాలు ఎండిపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుంది

## • పంటలు కోతకు వచ్చేచివరి దశల్లో ఉన్నాయి • రైతుల పంటలను కాపాడండి, సాగునీటిని అందించండి • బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ రూరల్ గ్రామాల్లో, కొత్తపల్లి లో సాగునీరు లేక కోతకు వచ్చిన పంటలు కాపాడుకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారనీ, ప్రభుత్వం వెంటనే చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించడానికి చర్యలు చేపట్టి, రైతుల పంటలను కాపాడాలని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. బిజెపి కిసాన్ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్ రూరల్ మండలం, కొత్త పల్లిలో నీళ్లు లేక ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నాడి రాజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా ఇక్కడి ప్రాంతంలో ఉన్న డి 93 కాలువ ద్వారా నీరు అందక పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఇట్టి కాలువ ద్వారా ప్రధానంగా చివరి ఆయకట్టు గ్రామాల వరకు పొలాలకు నీరు అందక వందల ఎకరాలు



నష్టపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. నీళ్ల లేక పంటను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డి 93 కాలువకు అందవలసిన నీరు అందని కారణంగా, కాలువ మీద ఆధారపడి పంటలు వేసుకున్న రైతులు, నీరు అందక నష్టాల పాలవుతున్నారని, ప్రస్తుతం ఇక్కడి ప్రాంతంలోని పంట పొలాలు ఎండిపోయే స్థితికి వచ్చాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డి 93 కాలువ కు సాగు నీటిని విడుదల చేసి, రైతులను ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త పల్లి మాజీ ఎంపీపీ వాసాల రమేష్, మాజీ బిజెపి పట్టణ అధ్యక్షులు శేఖర్, లక్ష్మారెడ్డి నరసింహారెడ్డి, హరిప్రసాద్, మహేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సంపత్, బోనాల మోహన్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు చిట్కూరు శ్రీనివాస్, వేముల చంద్రశేఖర్, రవి ప్రసాద్‌లతో పాటురైతులు పాల్గొన్నారు.

# ధర్మరక్షణ కొరకు ప్రతీ ఒక్కరు హనుమంతుడై కదలాలి

## • సనాతన హిందూధర్మమే సర్వజగద్రక్ష • ధర్మద్రోహుల భరతం పట్టాలి : శ్రీశ్రీశ్రీ శాంతానందస్వామి • వైభవంగా బజరంగదళ్ వీరహనుమాన్ విజయయాత్ర

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కౌరవులు వందమంది ఉన్నప్పటికీ వారి అహంకారం వల్ల కేవలం అయిదుగురు ఉన్నపాండవుల చేతిలో ఓడిపోయారని, హిందూధర్మ ద్రోహులకు సైతం అదే గతి పడుతుందని పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శాంతానందస్వామి అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆద్వర్యంలో బజరంగదళ్ మంగళవారం చేపట్టిన వీరహనుమాన్ విజయయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ, ధర్మరక్షణ కొరకు ప్రతీ ఒక్కడు హనుమంతుడివలే కదలాలని పిలుపునిచ్చారు. సనాతన హిందూ ధర్మమే ప్రపంచానికి సర్వజగద్రక్షగా అభివర్ణించిన ఆయన, విశ్వవ్యాప్తంగా సనాతన హిందూ ధర్మం వేగంగా విస్తరిస్తోందని, బలమైన ప్రాచీన మూలాలే ఇందుకు కారణమని పేర్కొన్నారు. అనేక యేళ్ళపాటు హిందూధర్మం పట్ల విషాన్ని చిమ్మిన పాలకుల అసలు నిజస్వరూపం బయటపడుతోందన్నారు. హిందూ ధర్మాన్ని మరిన్ని తరాలకు అందించేలా తమ కార్యాచరణ ఉండబోతుందన్నారు.

**కాశాయమయమైన పట్టణం:** బజరంగదళ్ చేపట్టిన వీరహనుమాన్ విజయయాత్ర విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా భారీగా తరలివచ్చిన కాశాయ కార్యకర్తలతో పట్టణం కాశాయవర్ణంగా మారింది. శోభాయాత్ర సందర్భంగా హనుమంతుడి ఉత్సవమూర్తి ప్రత్యేకంగా నిలిచింది. కార్యకర్తలు భారీగా తరలిరావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ శోభాయాత్రలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు స్వరూప్ కిరణ్ గౌడ్, కార్యదర్శి నాగులమల్యాల సత్యం, రాష్ట్ర నాయకులు





అయోధ్య రవి, నగర కార్యదర్శి కొట్టె మహేందర్, బజరంగదళ్ జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్, బజరంగదళ్ పెద్దపల్లి నగర కన్వీనర్ బోలవేన మణిదీప్ యాదవ్, వేల్పుల రమేష్, సత్సంగ ప్రముఖ్ బొమ్మకంటి రవికుమార్, పెరిక శ్రీను, పొలం మహేష్, రైతు రాకేష్, గాండ్ల అభిరామ్, గుమ్మడి వంశీ, అఖిల్, గుమ్మడి సిద్దు, సాయి, బిజెపి నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, పల్లె సదానందం, బెజ్జంకి దిలీప్ కుమార్, జంగా చక్రధర్ రెడ్డి, పెండ్యాల కరుణాకర్, వెళ్ళంపల్లి శ్రీనివాస రావు, పర్శ సమ్మయ్య, మౌటం నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## కాలనిలో పర్యటించిన ఎమ్మెల్యే సతీమణి మనాలి



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** కాలనీలోని రామగుండం కార్పొరేషన్ 18,17 డివిజన్లో మంగళవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ పర్యటించారు. డివిజన్ల కు వచ్చిన ఆమెకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సన్మానించి స్వాగతించారు. అనంతరం ఆమె డివిజన్లో పర్యటించి స్థానిక మహిళలను కలిశారు. ఇక మహిళలు తన కుటుంబాల స్థితిగతులను, ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు వివరించారు. ముఖ్యంగా బాలికల విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ఆమె మహిళలకు తగు సూచనలు, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఆమె తెలియజేశారు. అలాగే నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మనాలి స్థానిక మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మారెల్లి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గుండేటి రాజేష్, నాయకులు జై. దామోదర్ రావు, దేవనపల్లి చక్రవాణి, ఎం. రాజు, ఎ. రాములు, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 5న పుట్ట నారాయణ 47 వర్ధంతి

### - అమరుడి కుటుంబాన్ని ఆదుకోవాలి - ప్రజా సంఘాల నాయకులు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన దివంగత పుట్ట నారాయణ 47 వ వర్ధంతి గోదావరిఖని మార్కండేయ కాలనీ గణేష్ నగర్ స్నేహ సాహితి సిద్దార్థ హైస్కూల్ దగ్గర స్వగృహంలో ఈనెల 5న నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈమేరకు పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో మంగళవారం వర్ధంతి కరపత్రాలను సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈసందర్భంగా పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార స్వామి మాట్లాడుతూ 1978 లో గోదావరిఖనిలో జరిగిన బందు సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో 23 ఏళ్ళ సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ బలయ్యాడని అన్నారు. అప్పట్లో మృతుడు నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటామని ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. నాలుగు దశాబ్దాలుగా మృతుని కుటుంభం సింగరేణి యాజమాన్యంపై న్యాయ పోరాటం చేస్తోందని, నారాయణ కుటుంబంలోకి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 5న నిర్వహించే వర్ధంతి సభకు ప్రజా సంఘాల నాయకులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, విరసం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, పౌరహక్కుల సంఘం నాయకులు బొంకూరి లక్ష్మన్, సత్యనారాయణ, పుట్ట రాజన్న, రెడ్డిరాజుల సంపత్ పాల్గొన్నారు.

## ఆలివ్ షాట్స్.. ఇప్పుడిదే సరికొత్త ట్రెండ్




షాట్స్ అంటే మద్యానికి సంబంధించిన గ్లాసులే గుర్తుకొస్తాయి. కానీ ఇప్పుడో సరికొత్త ట్రెండ్ మొదలైంది. అదే ఆలివ్ ఆయిల్ షాట్స్! ఓ రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ నూనెను గుటుక్కున మింగేయడమే. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. సాక్షాత్తు కర్దాషిన్, జెన్నిఫర్ లోపెజ్ మద్దతిస్తున్న ట్రెండ్. జెన్నిఫర్‌కు ఆలివ్ ఆయిల్ మీద ఎంత నమ్మకం అంటే తన తరగని అందానికి రహస్యం బొటిక్స్, సర్జరీలు కాదు, ఆలివ్ ఆయిల్ సేవనమే అని చెబుతారు. నిజంగానే ఆలివ్ ఆయిల్‌తో చాలా ఉపయోగాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే పాలిఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ సంరక్షణకు దోహదం చేస్తాయట. గుండె నుంచి కాలేయం వరకు శరీరంలోని అన్ని అవయవాలకూ ఆలివ్ ఆయిల్ మేలు చేస్తుందనేది నిపుణుల మాట. భోజనానికీ భోజనానికీ మధ్య విరామంలో ఆలివ్ షాట్స్ తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. దీనికోసం ఎలాంటి రసాయనాలూ కలవని వర్జిన్ ఆలివ్ ఆయిల్‌ని రెండు చెంచాలు వాడాలి. అయితే, ఇలా చేయడం అందరి శరీరాలకు పడకపోవచ్చునీ, వైద్యులను సంప్రదించిన తర్వాతే ఆలివ్ షాట్స్ తీసుకోవాలనీ నిపుణులు సూచిస్తున్నారు.

## మౌత్‌వాష్ వాడటం మంచిదేనా.. నోటిలో పుండ్లు ఉంటే వాడొచ్చా ?



మౌత్‌వాష్‌ను ఒకప్పుడు విలాసంగా భావించేవారు. ఇప్పుడలా కాదు. నలుగురిలో మాట్లాడే టప్పుడు అసౌకర్యంగా ఉండకూడదన్నా, నోరు తాజాగా అనిపించాలన్నా.. మౌత్‌వాష్ వాడేస్తున్నారు. ఫ్లోరైడ్ జోడించిన మౌత్‌వాష్ వల్ల పళ్లకు బలమనీ, ఆల్కహాల్ కలవని మౌత్‌వాష్ వల్ల దుష్ఫలితాలు తగ్గుతాయనీ, అలోవెరా లాంటి సహజ పదార్థాలు జోడించిన మౌత్‌వాష్ మరింత ప్రయోజనకరమని నిపుణులు చెబుతున్నారు. ఇంకా బ్యాక్టీరియాను అరికట్టి, పంటి ఎనామిల్‌ను కాపాడటంలో ఫ్లోరైడ్ కలిగిన మౌత్‌వాష్‌లు సాయపడతాయి. హానికర సూక్ష్మక్రిములను అడ్డుకుని.. చిగుళ్లు గట్టిగా ఉండేలా, వాపులాంటి సమస్యలు రాకుండా చూసుకుంటాయి. పంటి మీద మరకల్ని పోగొట్టి, మెరిసేలా చేస్తాయి. శ్వాసలో దుర్వాసన హరించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. నోటిలో ఏర్పడే పుండ్లను తగ్గించడంలోనూ కీలకపాత్ర పోషిస్తాయి. అయితే ఏ మౌత్‌వాష్ వాడాలి అనే విషయాన్ని దంతవైద్యుడిని సంప్రదించిన తర్వాతే నిర్ణయించుకోవాలని సూచిస్తున్నారు ఆరోగ్యనిపుణులు.

# ఎండు కొబ్బరి ముక్క తింటే ఎన్ని లాభాలో తెలుసా..?



## నరాల సమస్యతో బాధపడే వారికి వరంలాంటిది..!

మన దేశంలో ఎండు కొబ్బరిని అందరి ఇళ్లలో వాడుతుంటారు. పూజ నుండి వంట వరకు అన్నింటిలో కొబ్బరిని ఉపయోగిస్తుంటారు. ఎండు కొబ్బరిని అనేక వంటకాల తయారీలో కూడా వాడుతుంటారు. ఇది తినడానికి చాలా రుచిగా కూడా ఉంటాయి. ఎండు కొబ్బరిని ఉపయోగించడం వల్ల ఆహారం రుచి పెరగడమే కాకుండా, దాని వినియోగం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. ఎండుకొబ్బరిలో ప్రొటీన్లు, విటమిన్లు, ఐరన్, కాల్షియం, మాంగనీస్, సెలీనియం, కాపర్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి మూలకాలు ఉంటాయి. అంతే కాకుండా ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కూడా ఉన్నాయి. అయితే ఎండు కొబ్బరి తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. కాబట్టి ఎండు కొబ్బరి వల్ల కలిగే లాభనష్టాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. రుచి కోసం ఎండు కొబ్బరి తినడం వల్ల మనకు అనేక ప్రయోజనాలు లభిస్తుండగా, ఏదైనా తీపి లేదా కూరగాయలలో ఎండు కొబ్బరిని కలుపుకుంటే, దాని రుచి మరింత పెరుగుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. అనేక ఇతర వ్యాధులు కూడా నయమవుతాయి. ఇందులో ఉండే గుణాలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా శరీరంలోని కొలెస్ట్రాల్ ను కూడా సులభంగా తగ్గిస్తాయి. కాబట్టి తరచుగా అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పకుండా ఎండుకొబ్బరిని ఆహారంలో తీసుకోవాలి. ఎండు కొబ్బరి తినడం వల్ల మన మెదడుకు పదును పెట్టడంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అదే సమయంలో మన హృదయాన్ని బలపరుస్తుంది. కొబ్బరిని పొడి లేదా తడి రూపంలో తినడం వల్ల మన జుట్టుకు చాలా మేలు జరుగుతుంది. ఎండు కొబ్బరిని తినడం వల్ల మన జుట్టు రాలడం ఆగిపోతుంది. క్రమంగా కొత్త జుట్టు పెరిగేలా చేస్తుంది. పైగా మీ కేశాలు నల్లటి రంగులో నిగనిగలాడుతుంది. అంతేకాదు.. ఎముకలకు కూడా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తినడం వల్ల మన ఎముకలకు బలం చేకూరడంతో పాటు వాటిలోని పగుళ్ల శబ్దం కూడా ఆగుతుంది. ఎండు కొబ్బరి తినడం తలనొప్పితో బాధపడేవారికి చాలా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తింటే మన శరీరానికి బలం చేకూరుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. దీని వల్ల రక్తం లేకపోవడం పోతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది మీ రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. దీని వల్ల మీరు ఎలాంటి వైరల్ ఇన్ఫెక్షన్‌ను చాలా వరకు నివారించవచ్చు. ఎండిన కొబ్బరిని తీసుకోవడం గుండెకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎండు కొబ్బరిని రోజూ తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే, ఎండు కొబ్బరి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగ్గా ఉంచడంలో సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల బరువు పెరుగుతారు. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారు కొబ్బరిని ఎక్కువ మోతాదులో తినకూడదు. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో చాలా పోషకాలు ఉంటాయి. అందువల్ల, మీరు దీనిని తీసుకుంటే, ఇది రొమ్ము క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధించవచ్చు. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి. మీరు దానిని ఎక్కువగా తీసుకుంటే, వాంతులు, కడుపు నొప్పికి కారణం కావచ్చు. ఎండిన కొబ్బరిని అధికంగా తీసుకోవడం మధుమేహ రోగులకు మంచికాదంటున్నారు. ఎందుకంటే కొబ్బరిలో చాలా చక్కెర ఉంటుంది. కాబట్టి దీన్ని తీసుకోవడం వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయి.



# ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారాన్ని ఎన్ని గంటల తర్వాత తినకూడదు?



బిజీగా ఉన్న నగర జీవితంలో ఆకలితో ఉన్నప్పుడు తాజా ఆహారాన్ని తయారు చేయడం సాధ్యం కాదు. అయితే ఆహారం త్వరగా చెడిపోకుండా ఉండేందుకు, ఎక్కువ సేపు పాడైపోకుండా ఉండేందుకు ఆహారాన్ని తయారు చేసి ఫ్రిజ్‌లో పెట్టే వారు చాలా మందే ఉన్నారు. సమయాన్ని ఆదా చేయడానికి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేస్తారు. రిఫ్రిజిరేటర్‌లో మిగిలిపోయిన వాటిని నిల్వ చేయడం ఉద్దేశ్యం ఆహారం వృధా కాకుండా నిరోధించడం లేదా సమయాన్ని ఆదా చేయడం. ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం పాడైపోకుండా కాపాడుతుంది. గడ్డకట్టడం ఉద్దేశ్యం ఏమిటంటే, కూరగాయలు, పండ్లు పాడవకుండా నిరోధించడం ద్వారా ఎక్కువ కాలం తాజాగా ఉంచడం. కానీ అన్ని ఆహారాలు ఎక్కువ కాలం ఉండవు. అందుకే రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన ఆహారం, పండ్లు, కూరగాయలు ఎంత సమయం తర్వాత తినకూడదో తెలుసుకుందాం. రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన వండిన అన్నం 1 రోజులోపు తినాలి. మీరు వండిన ఆహారాన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే అది తక్కువ సమయంలో దాని పోషక విలువలను కోల్పోతుంది. అయితే ఆయుర్వేదం ప్రకారం, అన్ని వండిన ఆహారం కేవలం 6 గంటల పాటు పోషకాహారాన్ని అందిస్తుంది. ఆ తర్వాత దానిలోని పోషకాలు కోల్పోతాయి. మీరు గోధుమ రోటీని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే, అది రోటీని తయారు చేసిన 12 నుండి 14 గంటలలోపు తినాలి. అలా చేయకపోతే, అందులో ఉన్న పోషకాలు పోతాయి. ఎక్కువసేపు ఫ్రిజ్‌లో ఉంచిన బ్రెడ్‌ను తిన్నట్లయితే మీకు కడుపు నొప్పిని కూడా వస్తుంది మీరు మీ భోజనంలో మిగిలిపోయిన పప్పును చెడిపోకుండా ఉండటానికి మీరు ఫ్రిజ్‌లో ఉంచినట్లయితే, దానిని 2 రోజులలోపు తినండి. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచిన పప్పును 2 రోజుల తర్వాత తింటే, కడుపులో గ్యాస్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. చాలా సార్లు మనం ఫ్రిజ్‌లో ఒక వారం పాటు పండ్లు, కూరగాయలను నిల్వ చేస్తాము. అయితే ఎక్కువ కాలం పాటు ఫ్రిజ్‌లో ఉంచిన కూరగాయలు, పండ్లు వాటి పోషక విలువలను కోల్పోతాయి. వాటిని తినడం వల్ల మీకు మంచి కంటే హాని ఎక్కువ. కూరగాయలు, పండ్లు కోయకుండా 3 నుండి 4 రోజులు ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు ఉంచకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు తరిగిన పండ్లను శీతలీకరించినట్లయితే, అది 6 గంటలలోపు తినాలి. లేకుంటే అది మీ అనారోగ్యానికి కారణమవుతుంది. బియ్యం, పప్పు, రోటీ లేదా రోటీ పిండి వంటి ఏదైనా రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన తర్వాత అన్ని వస్తువులను పూర్తిగా పాత్రతో కప్పి, వండిన ఆహారాన్ని 24 గంటల్లోపు తినాలి.

## ఈ గింజాలు ఆరోగ్యానికి వరం కంటే ఎక్కువ..! రోజూ తింటే రోగాలు మాయం.. మెరిసే, అందమైన చర్మం మీ సొంతం..!!



జాక్‌ఫ్రూట్ లాగానే జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజల్లో ఐరన్, కాల్షియం, కాపర్, పొటాషియం వంటి అంశాలు ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేయడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలలో రిబోఫ్లావిన్, థయామిన్ కూడా ఉన్నాయి. ఇవి కళ్ళు, చర్మం, జుట్టుకు మేలు చేస్తాయి. అనేక పోషకాలు పుష్కలంగా ఉన్న పనస గింజలు జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయి. రక్తహీనతను అధిగమించడంలో జాక్‌ఫ్రూట్ గింజలు కూడా ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. కావున, జాక్‌ఫ్రూట్ విత్తనాలను ఖచ్చితంగా తినండి. రక్తహీనతను అధిగమించడానికి జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజలు ఇనుముకు మంచి మూలం. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ పరిమాణం పెరుగుతుంది. ఇది రక్తహీనతను దూరం చేస్తుంది. జాక్‌ఫ్రూట్ గింజల్లో మంచి మొత్తంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం కళ్ళకు చాలా ప్రయోజనకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో విటమిన్ ఎ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అందువల్ల, కంటి చూపును మెరుగుపరచడానికి, మీరు తప్పనిసరిగా జాక్‌ఫ్రూట్ గింజలను తినాలి. రోగ నిరోధక శక్తిని పెంచడంలో జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ సీడ్స్‌లో యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే విటమిన్ సి గుణాలు ఉంటాయి. దీని కారణంగా రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. బూస్ట్ జాక్‌ఫ్రూట్ గింజల్లో కార్బోహైడ్రేట్లు మరియు విటమిన్ బి కాంప్లెక్స్ ఉంటాయి. ఇవి మీ ఆహారాన్ని శక్తిగా మార్చడంలో మరియు ఆరోగ్యకరమైన జీవక్రియను పెంచడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం ద్వారా మలబద్ధకం, కడుపు సంబంధిత సమస్యలు నయమవుతాయి.

## మధుమేహుల ఆరోగ్యంపై సబ్జా గింజల మ్యాజిక్..లాభాలు మామూలుగా లేవుగా!!

జీవనశైలి సరిగ్గా లేకపోతే, శరీరంలో అనేక వ్యాధులు రావడం ప్రారంభమవుతాయి. అలసట, అనారోగ్యం ఒక వ్యక్తిని ఒత్తిడికి గురి చేస్తుంది. చెడు ఆహారపు అలవాట్లు, అస్తవ్యస్థమైన జీవనశైలి కారణంగా అనేక రోగాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది ప్రజలు మధుమేహం, మలబద్ధకం వంటి ఆరోగ్య సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మధుమేహం రావడం సర్వసాధారణం. నీరు, ఫైబర్ లేకపోవడం వల్ల మలబద్ధకం సమస్య ఏర్పడుతుంది. ఇటువంటి సమస్యలను తగ్గించడానికి లేదా ఉపశమనం పొందడానికి ఇంటి నివారణలు చక్కటి ఫలితాలను ఇస్తాయి. ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరంగా భావించే సబ్జా గింజలతో మధుమేహం, మలబద్ధకాన్ని ఎలా నివారించవచ్చో తెలుసుకుందాం.. మధుమేహం నయం కాదు. అయితే, కొన్ని ఇంటి చిట్కాలు, ఆయుర్వేద ఔషధాలు తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. సబ్జా విత్తనాల్లో ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉన్నాయి. మీరు తరచుగా మలబద్ధకంతో బాధపడుతుంటే, ప్రతిరోజూ సబ్జా గింజలను తినండి. ఇందులో పీచు పుష్కలంగా ఉండి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. మధుమేహంతో బాధపడేవారు సబ్జా గింజలను తీసుకోవచ్చు. వీటిని మీరు తాగే నీళ్లలో నానబెట్టుకుని తాగటం ఉత్తమం. ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగటం వల్ల ఫలితం ఉంటుంది. శరీరంలోని బ్లడ్ షుగర్ లెవెల్‌ను కంట్రోల్‌లో ఉంచడంలో సహాయపడుతుంది. తక్కువ నీరు త్రాగడం, సరైన జీవనశైలి కారణంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వస్తుంది. సబ్జా గింజలు వీలైనంత ఎక్కువ నీరు త్రాగడమే కాకుండా మూత్రనాళ ఇన్ఫెక్షన్లను కూడా నయం చేస్తాయి.

## కొవ్వే కదా అని లైట్ తీసుకోకండి.. తేడా కొడితే మీ పని అంతేనట.. బీకేర్‌ఫుల్..



కొలెస్ట్రాల్ సమస్య ఇప్పుడు ప్రతీ ఇంట్లో కూడా పట్టిపీడిస్తోంది. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఈ సమస్యకు ప్రధాన కారణం.. బయటి ఆహారం ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత చెడ్డ కొలెస్ట్రాల్ ఉంటుంది. ప్రతీరోజూ వ్యాయామం చేయకపోతే ప్రమాదం ఎక్కువ అవుతుంది. అయితే, మీ జీవక్రియ బాగా ఉంటే, కొలెస్ట్రాల్ స్థాయిల గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్ ఒక్కసారిగా పెరిగితే ప్రమాదం కొనితెచ్చున్నట్లే.. చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, అది రక్తనాళాల్లో పేరుకుపోతుంది. దీని వల్ల రక్తనాళాలు ఇరుకుగా మారి రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఇది రక్తపోటు, గుండె జబ్బులు ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని రెట్టింపు చేస్తుంది. చెడు కొలెస్ట్రాల్ అధిక స్థాయిలు ఏ సమయంలోనైనా గుండె సమస్యలకు దారితీస్తుంది. కానీ చాలా తక్కువ మందికి అధిక కొలెస్ట్రాల్, దాని ప్రభావాల గురించి తెలుసు.. అందుకే గుండెపోటు, పక్షవాతం లాంటి ప్రమాదకర వ్యాధులకు దూరంగా ఉండాలంటే.. కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించుకోవాలి. అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు: కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, హృదయ స్పందన రేటు పెరుగుతుంది. కొంచెం గట్టిగా నడిచినా, మెట్లు ఎక్కినా ఊపిరి పీల్చుకునేందుకు ఆయాసంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. కళ్ల కింద ఉబ్బడం కొలెస్ట్రాల్ లక్షణం. కొన్నిసార్లు పసుపు రంగు మచ్చల్లాంటివి కళ్ళపై కనిపిస్తాయి. ఇది హై కొలెస్ట్రాల్ లక్షణం కూడా కొలెస్ట్రాల్ స్థాయి పెరిగితే శరీరంలో రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఒక్కసారిగా నరాలు మొద్దుబారిపోతాయి. ఆ సమయంలో కాళ్లకు చలనం కూడా అనిపించదు.. ఛాతీ నొప్పి, ఛాతీలో ఒత్తిడి, అసౌకర్యం కొలెస్ట్రాల్ పెరిగిన లక్షణాలు. ధమనులలో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల అడ్డంకులు ఏర్పడతాయి. దీనివల్ల గుండె జబ్బులు పెరుగుతాయి. కొలెస్ట్రాల్ వల్ల కూడా అధిక రక్తపోటు రావచ్చు. అధిక రక్త కొలెస్ట్రాల్ స్థాయిలు ధమనులపై ఒత్తిడిని కలిగిస్తాయి. దీని కారణంగా, రక్త ప్రసరణ చెదిరిపోతుంది.. రక్తపోటు పెరుగుతుంది. కొలెస్ట్రాల్ వల్ల దృష్టి మసకబారుతుంది. కళ్లు దెబ్బతింటాయి. అందుకే.. ఇలాంటి పరిస్థితిని తెచ్చుకోవద్దంటున్నారు ఆరోగ్య నిపుణులు.. కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకునే మార్గాలు.. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి తినడం, మద్యం త్రాగటం నియంత్రించాలి. వీధి ఆహారాన్ని తరచుగా తినవద్దు. నూనె, కొవ్వు రహిత ఆహారానికి దూరంగా ఉండాలి. కూరగాయలు, ధాన్యాలు, గింజలు, పండ్లు, చేపలు మొదలైన వాటిని ఎక్కువగా తినండి. తినడం, త్రాగడంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. తగినంత నిద్ర పొందండి, ఒత్తిడిని తగ్గించుకోండి. ప్రతి 3 నెలలకు రక్త పరీక్ష చేయడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను తనిఖీ చేయండి. ఇవన్నీ కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి..

## ఇంత చిన్న వెల్లుల్లి ఏం చేస్తుందనుకుంటే పొరపాటే..! ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇలా తింటే..

## ఎన్నో రోగాలకు దివ్యౌషధం..!!

అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగించే ఆహార పదార్థాలలో వెల్లుల్లి ఒకటి. వెల్లుల్లిలో విటమిన్లు సి, కె, ఫోలేట్, మాంగనీస్, సెలీనియం, ఫైబర్, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, కాపర్, పొటాషియం వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసాన్ని ఉదయాన్నే పరగడుపున తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగితే ఎన్నో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. జీర్ణ సమస్యలు రాకుండా ఉండాలంటే వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం మంచిది. వెల్లుల్లి రసం తాగడం వల్ల పొట్టలోని ఇన్ఫెక్షన్లు, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు రాకుండా కాపాడుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ కూడా అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలోని అల్లిసిన్ దీనికి సహాయపడుతుంది. అధిక కొలెస్ట్రాల్ తో బాధపడేవారు ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ సమయంలో వెల్లుల్లి రసం తాగాలి. ఇది చెడు కొలెస్ట్రాల్‌తో పోరాడి టాక్సిన్స్ ను బయటకు పంపిస్తుంది. వెల్లుల్లి రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యానికి మంచిది. రోజూ వెల్లుల్లి రసం తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె సంబంధిత వ్యాధులు దూరం అవుతాయి. ఇవి రక్తపోటును తగ్గించడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. వెల్లుల్లి శ్వాసకోశసమస్యలనుండికూడాఉపశమనంకలిగిస్తుంది.వెల్లుల్లిలోఉండే యాంటీబ్యాక్టీరియల్ భాగాలు దీనికి సహాయపడతాయి. ఉదయాన్నే వెల్లుల్లి రసాన్ని తాగడం వల్ల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు దూరం అవుతాయి. ఇమ్యూనిటీ పెరుగుతుంది. వెల్లుల్లి కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. కాలేయం, మూత్రపిండాలు, రక్తప్రవాహానికి అద్భుతమై డిటాక్స్ ఫైయర్ గా పనిచేస్తుంది. మెదడు పనితీరును రక్షిస్తుంది. జ్ఞాపకశక్తి, దృష్టి మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లిని తినడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌ల రిస్క్ తగ్గుతుంది. బరువు తగ్గడానికి వెల్లుల్లి రసాన్ని కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు. శరీరంలోని అనవసరమైన క్యాలరీలను కరిగించడంలో ఇవి మేలు చేస్తాయి. వెల్లుల్లి రసం బరువును తగ్గించడంలో సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల మెదడు ఆరోగ్యానికి కూడా మంచిది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. చర్మ ఆరోగ్యానికి కూడా వెల్లుల్లి తోడ్పడుతుంది. మొటిమలను, మంటను తగ్గిస్తుంది.



స్పోర్ట్స్

# ఆర్సీబీ టాప్ ప్లేస్ కొన్నాళ్లే..

## భారత మాజీ విధ్వంసక ఓపెనర్ సెహ్వాగ్



ఈ సీజన్ లో మూడుసార్లు ఫైనలిస్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు హవా నడుస్తోంది. వంద శాతం సక్సెస్ రేట్ తో విజయాలు సాధించింది. ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్ ల్లోనూ గెలిచింది. తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ చాంపియన్ కోల్ కతా నైట్ రైడర్స్, రెండో మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ పై అలవోక విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో టాప్ లో నిలిచింది. అయితే తాజాగా ఆర్సీబీని ట్రోల్ చేస్తూ, భారత మాజీ విధ్వంసక ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కామెంట్లు చేశాడు. ఆర్సీబీ ఒక పేద జట్టని, కొంతకాలంగా టాప్ ప్లేస్ ను ఎంజాయ్ చేస్తోందని, అది ఎంత కాలం ఉంటుందో తెలియదని, అప్పటివరకు అస్వాదించమన్నట్లుగా పేర్కొన్నాడు. ఐపీఎల్ ప్రారంభమైన 17 సీజన్ల నుంచి ఆర్సీబీ ఆడుతోంది. అయితే ఇప్పటవరకు ఒక్కసారి కూడా కప్పు కొట్టలేదు. మూడుసార్లు ఫైనల్ కు వెళ్లినా, డెక్కన్ ఛార్జర్స్ (ఇప్పుడు మనుగడలో లేదు), చెన్నై, సన్ రైజర్స్ హైదరాబాద్ చేతిలో పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో కప్పులేని పేద జట్టు అని సెహ్వాగ్ ట్రోల్ చేశాడు. ఇక ఐపీఎల్లో ఆడుతున్న పది జట్లలో ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ కప్పు సాధించలేదు. ఇక 2022 నుంచి ఆడుతున్న లక్నో సూపర్ జెయింట్స్ ఖాతాలో కప్పు లేదు. ఆ జట్టు కనీసం ఫైనల్ కూడా చేరలేదు. ఈ నేపథ్యంలో ఈ నాలుగు జట్లు కప్పు లేని పేద జట్లని సెహ్వాగ్ చమత్కరించాడు. ఐపీఎల్ లోని అన్ని జట్లు చాలా రిచ్ అని, ఏడాది, ఐదారు వందల కోట్లను సంపాదిస్తాయని పేర్కొన్నాడు. మరోవైపు ఆర్సీబీని పేద జట్టు అని ట్రోల్ చేసిన సెహ్వాగ్ ను కొంతమంది ఆర్సీబీ అభిమానులు కూడా ట్రోల్ చేస్తున్నారు. ఐపీఎల్ ఆడిన ఆటగాళ్లలో సెహ్వాగ్ ప్రాతినిథ్యం వహించిన జట్లు టైటిల్ గెలవలని, ఈ రకంగా చూస్తే సెహ్వాగ్ కూడా పేదోడేనని పలువురు ట్రోల్ చేస్తున్నారు. ఐపీఎల్ ఆరంభంలో సొంత నగరానికి చెందిన ఢిల్లీ డేర్ డేవిల్స్ కు ఆడిన సెహ్వాగ్, ఆ తర్వాత పంజాబ్ కింగ్స్ కు ఆడాడు. ఆ తర్వాత కొంతకాలనికి రిటైర్ అయ్యాడు. ఈ రెండు జట్లు కూడా ఐపీఎల్ టైటిల్ సాధించలేదని గుర్తు చేస్తున్నాడు. ఇక ఈసారి ఐపీఎల్ ఆసక్తికరంగా సాగుతోంది. లీగ్ లో ఒక పంజాబ్ మినహా మెజారిటీ జట్లు మూడేసి మ్యాచ్ లను పూర్తి చేశాయి. ఆర్సీబీ పాయింట్ల పట్టికలో నెం.1 స్థానంలో కొనసాగుతుండగా, డిఫెండింగ్ చాంపియన్ కోల్ కతా నైట్ రైడర్స్ అట్టడుగున పదో స్థానంలో నిలిచింది. బుధవారం పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఇరుజట్లు తమ చివరి మ్యాచ్ లో గెలిచి మంచి జోరుమీదున్నాయి.

# ప్రపంచ కప్ గెలవడమే నా టార్గెట్

## టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ

టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మంగళవారం కీలక ప్రకటన చేశాడు. 2027 వనేడే ప్రపంచ కప్ ఆడటం గురించి కీలక అప్‌డేట్ ఇచ్చాడు. తన తదుపరి ప్రధాన కెరీర్ గోల్ గురించి తెలిపాడు. ప్రపంచ కప్ గెలవడమే తన ముందున్న టార్గెట్ అని ఒక షో సందర్భంగా విరాట్ కోహ్లీ తన లక్ష్యాన్ని రివీల్ చేశాడు. తదుపరి వన్డే ప్రపంచకప్ గెలవాలని తాను చూస్తున్నానని చెప్పుకొచ్చాడు విరాట్ కోహ్లీ ప్రకటనపై సర్వత్రా చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఓ ప్రైవేట్ ఈవెంట్ మీ తదపరి లక్ష్యం ఏంటి.. అసలేం చేయబోతున్నారు.. పెద్దగా ఏమైనా ప్లాన్ చేస్తున్నారా.. అని అడిగిన ప్రశ్నకు విరాట్ కోహ్లీ స్పందించాడు. వన్డే వరల్డ్ కప్ తదుపరి ఎడిషన్ 2027లో దక్షిణాఫ్రికాలో జరగనుంది. 2023లో జరిగిన వన్డే ప్రపంచ కప్ ను గెలుచుకోవడానికి భారత్ తీవ్రంగా ప్రయత్నించింది. కానీ ఫైనల్ లో ఓటమిని చవిచూసి రన్నరప్ గా మిగిలిపోయింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్ లో ఓటమి పాలైంది. ఈ ఎడిషన్ లో 11 మ్యాచ్ లలో 95.62 సగటుతో రికార్డు స్థాయిలో 765 పరుగులు సాధించినందుకు కోహ్లీ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గా ఎంపికయ్యాడు. కోహ్లీ మూడు సెంచరీలు, ఆరు అర్ధ సెంచరీలు చేశాడు. అయితే ప్రతిష్ఠాత్మక గౌరవం లభించినప్పటికీ ఫైనల్ లో భారత్ ఓడిపోయిన తర్వాత కోహ్లీ తీవ్ర నిరాశకు గురయ్యాడు. మ్యాచ్ తర్వాత జరిగిన ప్రదర్శన సమయంలో కూడా మాట్లాడలేదు. అప్పటి నుంచి సీనియర్ ద్వయం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను తదుపరి ప్రపంచ కప్ వరకు వన్డేలు ఆడటం కొనసాగిస్తారా అని అభిమానులు అంచనాలు వేస్తున్నారు. అయితే ఇటీవల ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజయం 2027 ప్రపంచకప్ వరకు విరాట్, రోహిత్ లు తమ కెరీర్ ను కొనసాగించడానికి దాదాపు మార్గం సుగమం చేసింది. టోర్నమెంట్ లో కోహ్లీ మరోసారి మంచి ఫామ్ లో కనిపించాడు. పాకిస్థాన్, ఆస్ట్రేలియాలపై మ్యాచ్ విన్నింగ్ నాక్స్ ఆడాడు. రోహిత్ కూడా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరు వన్డే ప్రపంచకప్ వరకు ఆడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.





# రోహిత్ బ్యాటర్‌గా రాణించాలి

## ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్

ఈ సీజన్లో ముంబై ఇండియన్స్ తొలి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ చేతిలో పరాజయం పొందిన తర్వాత ఆదివారం సొంతగడ్డ ముంబైపై తొలి మ్యాచ్ ఆడిన ముంబై.. కోల్ కతా నైట్ రైడర్స్ పై ఎనిమిది వికెట్లతో ఘన విజయం సాధించింది. దీంతో పాయింట్ల పట్టికలో పది నుంచి ఆరో స్థానానికి ఎగబాకింది. ఓపెనర్ కమ్ వికెట్ కీపర్ ర్యాన్ రికెల్టన్ (63 నాటౌట్), అరంగేట్ర బౌలర్ అశ్వనీ కుమార్ (4 వికెట్లు)తో సత్తా చాటి టాప్ ఫర్మార్లుగా నిలిచారు. దీంతో 116 పరుగులకు ఆలౌటైన కేకేఆర.. కేవలం 117 పరుగుల టార్గెన్ ను ముంబై ముందుంచింది. అయితే ఈజీ టార్గెట్ ను ఛేజ్ చేయడంలో ముంబై బ్యాటర్ రోహిత్ శర్మ చెలరేగుతాడనకుంటే దాదాపు బంతికో పరుగు చొప్పున చేసి 13 పరుగులకే ఆలౌటయ్యాడు. ఈ సీజన్ లో మూడు మ్యాచ్ లాడిన హిట్ మ్యాన్ 0, 8, 13 పరుగులతో ఓవరాల్ గా 21 పరుగులే సాధించాడు. దీంతో అతని మీద విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ .. రోహిత్ శర్మ వైఫల్యాలపై ఘాటుగా స్పందించాడు. అక్కడ రోహిత్ ప్లేస్ లో ఎవరైనా ఉన్నట్లయితే ఆ ఆటగాడిని తప్పించేవారని పేర్కొన్నాడు. గత సీజన్ నుంచి ముంబై టీమ్ లో కేవలం బ్యాటర్ గా మాత్రమే రోహిత్ ఆడుతున్నాడు. కెప్టెన్ గా హార్దిక్ పాండ్యాకు పగ్గాలను టీమ్ మేనేజ్మెంట్ అప్పగించింది. ఇక ఈ సీజన్ లో రోహిత్ దాదాపు గా ఇంపాక్ట్ సబ్ గా బరిలోకి దిగుతున్నాడు. దీంతో బ్యాటర్ గా కనీస ప్రదర్శన చేయడం రోహిత్ విధి అని వాన్ చెబుతున్నాడు. సీనియర్ రోహిత్ ఇచ్చే ఆరంభాలతోనే జట్టు పుంజుకుంటుందని పేర్కొన్నాడు. తను ఇంపాక్ట్ సబ్ గా బరిలోకి దిగుతుండటంతో కనీసం తన సారథ్య సలహాలను కూడా జట్టు అవసరం పడటం లేదని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఇండియన్ వన్డే, టెస్టు జట్టు కెప్టెన్ గా రోహిత్ శర్మ వ్యవహరిస్తున్నాడు. అతని సారథ్యంలో గత కొంతకాలంగా అద్భుతంగా ఆడుతోంది. మరపురాని విజయాలను తన సొంతం చేసుకుంది గతేడాది టీ20 ప్రపంచకప్, ఈ ఏడాది ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలను భారత్ నెగ్గింది. ఇవి కూడా ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా సాధించింది. ప్రస్తుతం క్రికెట్లో రోహిత్ ని మించి అత్యుత్తమ సారథి లేదనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి రోహిత్ ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించడం ముంబై చేస్తున్న పొరపాటని వాన్ అభిప్రాయ పడ్డాడు. జట్టుకు ఐదుసార్లు కప్పును అందించిన అతని సేవలను వినియోగించుకోవాలని సూచించాడు. ఇక 2020 నుంచి ముంబై కప్పు కొట్టలేదు. గతేడాది పాండ్యా సారథ్యంలో టోర్నీలోనే అత్యధమంగా పదో స్థానంలో ముంబై నిలిచింది. ఈ నేపథ్యంలో టీమ్ మేనేజ్మెంట్ మరోసారి దీనిపై ఆలోచన చేయాలని సూచించాడు. ఇక ఈ సీజన్ లో మూడు మ్యాచ్ లు ఆడిన ముంబై.. రెండింటిలో ఓడిపోయి, ఒక్కదాంట్లోనే గెలిచింది.



# ఐపీఎల్‌లో అదిరిపోయే అరంగేట్రం..

## రూ.30 లక్షలు దక్కించుకున్న అశ్వని కుమార్

ఐపీఎల్? 18వ సీజన్?లో యంగ్ ప్లేయర్స్ దుమ్ము రేపుతున్నారు. అనామకులుగా లీగ్?లోకి ఎంట్రీ ఇచ్చి తమ ప్రదర్శనలతో సగర్వంగా క్రికెట్ ప్రంపచానికి వారిని వారు పరిచయం చేసుకుంటున్నారు. ఇటీవల సూపర్ ఇన్నింగ్స్?తో ముంబయి జట్టుకు చెందిన విఘ్నేశ్ పుతుర్ మెరిశాడు. ఇప్పుడు అదే జట్టు నుంచి మరో పేస్ సంచలనం క్రికెట్ ప్రపంచానికి పరిచయమయ్యాడు. అతడే అశ్వని కుమార్. మొహాలికి చెందిన అశ్వని కుమార్ ఐపీఎల్‌లో అదిరిపోయే అరంగేట్రం చేశాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన తన మొదటి మ్యాచ్‌లోనే 3 ఓవర్లలో 24 పరుగులు సమర్పించి 4 వికెట్లు కూల్చి రికార్డు సృష్టించాడు. కోల్‌కతా నడ్డి విరిచి 116 పరుగులకే ఆలౌట్ చేయడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఆడిన ఫస్ట్ మ్యాచ్‌తోనే అదరగొట్టిన అశ్వని కుమార్‌ను ముంబయి ఇండియన్స్ యాజమాన్యం ఇటీవలే ఐపీఎల్ వేలంలో రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. తన కుమారుడికి క్రికెటంటే ప్రాణం అని, ఎప్పటికప్పుడు తన స్కిల్?ను పెంచుకునేందుకు పరితపించేవాడని అశ్విని నాన్న హర్కేశ్ కుమార్ అన్నాడు. ' అశ్విని కుమార్ ఎండనక, వాననక చాలా కష్టపడేవాడు. శిక్షణకు అస్సలు దుమ్మా కొట్టేవాడు కాదు. ట్రైనింగ్ ముగించుకుని ఎప్పుడో రాత్రి పదిగంటలకు ఇంటికి వచ్చేవాడు. తిరిగి ఉదయం అయిదుగంటలకే క్రికెట్ అకాడమీకి వెళ్లేవాడు. కొన్నిసార్లు సైకిల్ మీద కూడా అంతదూరం వెళ్లేవాడు అశ్విని. మరి కొన్ని సందర్భాల్లో షేర్‌ఆటోలో వెళ్లేందుకు రూ.30 నన్ను అడిగి తీసుకునేవాడు. అలాంటి అశ్వని కుమార్‌ను ముంబయి ఇండియన్స్ రూ.30 లక్షలకు వేలంలో కొనుగోలు చేసింది. తాను తీసుకున్న ప్రతిపైసాకూ అశ్విని న్యాయం చేశాడు. మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసి వికెట్లు పడగొట్టాడు. ముంబయి విజయానికి కృషి చేశాడు' అని హర్కేశ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశాడు. కాగా యంగ్ టాలెంట్?ను ప్రోత్సహించడంలో ముంబయి ఇండియన్స్ ఎప్పుడూ ముందుంటుంది. గత దశాబ్ద కాలంలో పలువురు యువ ప్లేయర్లలో ఉన్న ప్రతిభ గుర్తించి వేలంలో కొనుగోలు చేసింది. అలా యంగ్ ప్లేయర్స్?కు ముంబయి ఇప్పటికీ ఎంతో మందికి అవకాశాలు కల్పించింది. వారు ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి క్రికెట్?లో రాణిస్తున్నారు. అలా ప్రస్తుత సీజన్?లో అశ్వని కుమార్, విఘ్నేశ్ పుతూర్ వెలుగులోకి వచ్చారు. అయితే ఆ ఫ్రాంచైజీ కొత్త టాలెంట్?ను గుర్తించడంలో మేనేజ్?మెంట్ టీమ్? కీలక పాత్ర పోషిస్తుంది. దేశీయ క్రికెట్, లీగ్?ల్లో ఆడుతున్న టాలెంటెడ్ ప్లేయర్స్?ను గుర్తించి ఈ టీమ్? యాజమాన్యం దృష్టికి తీసుకుస్తుంది. ఆ తర్వాత వారిని వేలంలో కొనుగోలు చేసి అవకాశాలు కల్పిస్తున్నారు. డిఫరెంట్ యాక్షన్?తో పేసర్ జస్ప్రీత్ బుమ్రాలోని టాలెంట్?ను గుర్తించిన ముంబయి 2013లో కొనుగోలు చేసింది. అరంగేట్ర మ్యాచ్?లోనే ఈ యార్కర్ స్పెషలిస్ట్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత టీమ్‌ఇండియాలో బుమ్రా కీలక సభ్యుడైపోయాడు. మూడు ఫార్మాట్లలోనూ అదరగొడుతున్నాడు. ప్రస్తుత తరంలో అత్యుత్తమ బౌలర్?గా పేరు పొందాడు. హార్దిక్ పాండ్యను ముంబయి ఇండియన్స్ 2015 మెగావేలంలో రూ.10లక్షలకు దక్కించుకుంది. బరోడాలో హార్దిక్ స్థానిక టీ20 టోర్నీ ఆడుతున్నప్పుడు ముంబయి మేనేజ్?మెంట్ టీమ్ అతడి ప్రతిభను గుర్తించింది. ఆ తర్వాత హార్దిక్?ను జట్టులోకి తీసుకుంది. ప్రస్తుతం అతడు ముంబయికి కెప్టెన్?గా వ్యవహరిస్తున్నాడు. 2015, 2017, 2019, 2020లో ముంబయి ఇండియన్స్ ఐపీఎల్ టైటిల్ గెలవడంలో హార్దిక్ కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం టీమ్ ఇండియా పరిమిత ఓవర్ల జట్టులో సభ్యుడు. 2024 టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ భారత్ గెలవడంలో పాండ్య పాత్ర ఉంది. మరోవైపు, కృనాల్ పాండ్యను 2016 వేలంలో ముంబయి కొనుగోలు చేసింది. ప్రస్తుతం టీమ్‌ఇండియా తరఫున వన్డే, టీ20లు ఆడుతున్నాడు. తెలుగు కుర్రాడు తిలక్ వర్మను 2022 మెగావేలంలో అతడిని దక్కించుకుంది. తనదైన శైలిలో ఆడుతూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. దీంతో టీమ్‌ఇండియాలోకి ఎంట్రీ ఇచ్చాడు. ప్రస్తుతం టీ20 ఫార్మాట్?లో రెగ్యులర్ ప్లేయర్?గా ఉన్నాడు. అద్భుతమైన షాట్ సెలెక్షన్, టాలెంట్?తో రాణిస్తున్న తిలక్ భవిష్యత్తులో భారత్ తరఫున మూడు ఫార్మాట్లలో ఆడే అవకాశం ఉంది.

# కేకేఆర్‌తో తలపడే సన్‌రైజర్స్ తుది జట్టు ఎంపిక



ఐపీఎల్ 2025 సీజన్‌లో వరుస పరాజయాలతో చతికిలపడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. గురువారం కోల్‌కతాలోని ఐకానిక్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ సీజన్‌ను ఘనంగా ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఆ తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. భారీ స్కోరే లక్ష్యంగా బ్యాటింగ్ చేస్తూ అనవసర షాట్లతో మూల్యం చెల్లించుకుంటుంది. బ్యాటింగ్ వైఫల్యంతో బౌలర్లు పూర్తిగా తేలిపోతున్నారు. కేకేఆర్‌తో మ్యాచ్‌లో విజయం సాధించి గెలుపు బాట పట్టాలని సన్‌రైజర్స్ పట్టుదలతో ఉంది. మరోవైపు కేకేఆర్ పరిస్థితి కూడా సన్‌రైజర్స్‌లానే ఉంది. ఓటమితో ఈ సీజన్‌ను ప్రారంభించిన ఆ జట్టు.. రాజస్థాన్ రాయల్స్‌పై ఘన విజయాన్నందుకుంది. కానీ ముంబై ఇండియన్స్‌తో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ క్రమంలోనే సొంతగడ్డపై సన్‌రైజర్స్‌ను కట్టడి చేయాలని కేకేఆర్ భావిస్తోంది. ఈ క్రమంలోనే ఈ పోరుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో పరాజయం అనంతరం తుది జట్టులో మార్పులు చేస్తామని కెప్టెన్ ప్యాట్ కమిన్స్ హింట్ ఇచ్చాడు. టీమ్ కాంబినేషన్‌కు సంబంధించిన ఆప్షన్స్‌ను పరిశీలిస్తామని చెప్పాడు. బ్యాటింగ్, బౌలింగ్ బలహీనతలను అధిగమించేందుకు అవసరమైతే కీలక ఆటగాళ్లను కూడా పక్కనపెడుతామని స్పష్టం చేశాడు. బ్యాటింగ్ లైనప్ బలంగానే ఉన్నా.. భారీ స్కోర్ చేయాలనే ఆలోచనలతో అనవసర షాట్లతో సన్‌రైజర్స్ మూల్యం చెల్లించుకుంటుంది. గత రెండు మ్యాచ్‌ల్లోనూ ఇదే జరిగింది. పరిస్థితులకు తగ్గట్లే ఆడే ప్రయత్నం సన్‌రైజర్స్ చేయలేకపోతుంది. కేకేఆర్‌తో మ్యాచ్ గెలవాలంటే సన్‌రైజర్స్ తమ అప్రోచ్‌ను మార్చుకోవాలి. ప్రతీసారి 300 పరుగులే లక్ష్యంగా ఆడితే కుదురదు. అయితే టీమ్‌కాంబినేషన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మార్పులు చేసే అవకాశం ఉంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో విఫలమైన అభినవ్ మనోహర్‌పై వేటు వేయనున్నారు. అతని స్థానంలో సచిన్ బేబీ లేదా అథర్వ టైడ్‌ను ఆడించవచ్చు. గత మ్యాచ్‌లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన వియాన్ మల్డర్‌ను కూడా తప్పించనున్నారు. ఆడమ్ జంపాను ఇంపాక్ట్ ప్లేయర్‌గా వాడుకోనున్నారు. బౌలింగ్ విభాగంలో కూడా మార్పులు జరిగే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లో జీషన్ అన్సారీ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. కాబట్టి అతను తుది జట్టులో కొనసాగించే అవకాశం ఉంది. పేస్ విభాగంలో కూడా మార్పులు జరగనున్నాయి. హర్షల్ పటేల్ స్థానంలో జయదేవ్ ఉనాద్కత్‌ను తుది జట్టులోకి తీసుకోవచ్చు. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ శుభారంభం అందించాల్సిన అవసరం ఉంది. ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డి, హెన్రీచ్ క్లాసెన్‌లతో పాటు అనికేత్ వర్మ చెలరేగితే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తిరగుండదు. గత మ్యాచ్‌లో యువప్లేయర్ అనికేత్ వర్మ హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. భారీ సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. కానీ అతనికి మరో ఎండ్‌లో సహకారం లభించలేదు. బౌలింగ్ విభాగంలో షమీ, ప్యాట్ కమిన్స్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. ముఖ్యంగా షమీ వైఫల్యం ఆరెంజ్ ఆర్మీని ఆందోళనకు గురిచేస్తోంది. కేకేఆర్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తుది జట్టు(అంచనా): అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డి, హెన్రీచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్/సచిన్ బేబీ/అథర్వ టైడ్, ప్యాట్ కమిన్స్, హర్షల్ పటేల్/జయదేవ్ ఉనాద్కత్, జీషన్ అన్సారీ, మహమ్మద్ షమీ ఇంపాక్ట్ ప్లేయర్: ఆడమ్ జంపా/ కామిందు మెండీస్.

# విశ్వజి



## ఈ నూనె వాడితే నవ యవ్వనం, సౌందర్యం డబుల్!

చాలామంది నేటి రోజుల్లో అందం కోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. రకరకాల మాయిశ్చరైజింగ్ ప్రొడక్ట్స్ ఉపయోగిస్తున్నారు. అంతే కాదు చాలా యాంటీ ఏజింగ్ క్రీములను కూడా ఉపయోగిస్తున్నారు. ముఖం మీద ముడతలు రాకుండా, అకాల వృద్ధాప్యం రాకుండా చాలా జాగ్రత్తలే తీసుకుంటున్నారు. అయితే వృద్ధాప్యం త్వరగా రాకుండా నివారించటం కోసం కొన్ని రకాల ఆయిల్స్ వాడుతున్నారు. అటువంటి వాటిలో ఒక బెస్ట్ ఆయిల్ గురించి ఈ రోజు మనం తెలుసుకుందాం. గంధపు నూనెతో చాలా లాభాలు గంధపు నూనె యాంటీ ఏజింగ్ ఆయిల్ గా చాలా బాగా పని చేస్తుంది. గంధపుచెట్టు నుండి గంధపు నూనెను తయారు చేస్తారు. గంధపు చెక్కల నుండి తయారయ్యే ఈ సుగంధ భరితమైన గంధపు నూనె మన చర్మ ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తుంది.. ఈ నూనె అన్ని శారీరక, మానసిక రుగ్మతల యొక్క చికిత్సల కోసం ఆయుర్వేద ఔషధాలలో ఉపయోగిస్తారు. గంధపు నూనెను మానసికంగా మనం రిలాక్స్ అవ్వటానికి ఉపయోగిస్తారు. %ూశ్రీంశీ =ఝుం% సినిమానే అనుకున్నాం..పాటలు కూడా ఇంత దారుణంగా ఉన్నాయ్ ఏంటీ బ్రో..! గంధపు నూనె సహజమైన మాయిశ్చరైజర్ గంధపు నూనె ఒక అద్భుతమైన సహజమైన మాయిశ్చరైజర్ గా పనిచేస్తుంది. గంధపు నూనెలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది శరీరంపై వచ్చే రాష్ మరియు వాపు వంటి సమస్యలను నివారిస్తుంది. ఇది శరీరాన్ని డీహైడ్రేట్ గా ఉంచుతుంది.అన్నిటికంటే ముఖ్యంగా గంధపు నూనెలో ఉంటే యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ ఏజింగ్ లక్షణాలు త్వరగా రాకుండా కాపాడతాయి. చర్మానికి, జుట్టుకు బెస్ట్ గంధం నూనె గంధపు నూనెలో యాంటీ బ్యాక్టీరియల్ తో పాటు యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇవి మన ముఖంపై వచ్చే మొటిమలను నయం చేయడానికి చర్మం పై ఉన్న మచ్చలు, మరకలను తొలగించడానికి ఉపయోగపడతాయి. గంధపు నూనెలో ఆస్ట్రింజెంట్ గుణాలు ఉంటాయి. ఇవి చర్మ దృఢత్వాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడతాయి. చర్మానికి, జుట్టుకి, ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయడానికి మాత్రమే కాకుండా దీనిని అందం ఇనుమడింప చేయడానికి కూడా ఉపయోగిస్తారు. %ూశీషవతీవం దీఎ% గంధపు నూనెతో ఈ సమస్యలకు పరిష్కారం గంధపు నూనెతో ఎగ్జిమా, సోరియాసిస్ వంటి అనేక చర్మ సంబంధిత సమస్యలు తగ్గుతాయి . ఇది చర్మం యొక్క అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. త్వరగా ముసలితనం రాకుండా చేస్తుంది . గంధపు నూనెను రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల స్కిన్ టోన్ మెరుగుపడుతుంది . కాబట్టి అనేక సమస్యలకు గంధపు నూనె చక్కని పరిష్కారం. వాడే ముందు. కాస్త చేతికి రాసుకుని టెస్ట్ చేసుకున్నాకే మీ స్కిన్ కు సరిపడితేనే వాడండి.

### నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారా?

## అయితే వెంటనే వీటిని తినండి!



ప్రస్తుత సమాజంలో నిద్రలేమి సమస్య అతి పెద్ద సమస్యగా మారింది. అనేక సమస్యలతో సతమతమవుతూ సరిగ్గా నిద్రపోలేక, పడుకుంటే నిద్రరాక అనారోగ్యానికి గురవుతున్నారు. అలా నిద్రలేమి సమస్యతో బాద పడుతున్న వారు రోజువారీ ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకుంటే నిద్రలేమి సమస్యకు చెక్ పెట్టొచ్చు అని చెప్తున్నారు డైటీషియన్లు.కొన్ని రకాల పండ్లతో పాటు, కొన్ని రకాల ఆకు కూరలు తీసుకోవడం వలన కొంత మేరకు నిద్రలేమి సమస్యను అరికట్టవచ్చునని చెప్తున్నారు. నిద్రలేమికి ఎన్నో కారణాలు ఎక్కువగా నాన్ వెజ్ తినే వారికి తొందరగా డైజెషన్ కాకపోవడం వలన నిద్రకు భంగం కలుగుతుంది. నిద్రలేమి సమస్యతో గుండె సంబంధిత వ్యాధుల వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇక మానసిక ఒత్తిడికి గురవుతున్న వారిలో కూడా నిద్రలేమి సమస్య ఉంటుంది. నిద్ర వేళకు ఫుల్ గా భోజనం చేయడం జీర్ణక్రియ ఆలస్యంగా జరగడం వలన కడుపులో ఆయాసం ,ఉబ్బరం తో రాత్రంతా నిద్రకు భంగం కలుగుతుంది. ఇలా అనేక కారణాలు నిద్రలేమిని కలిగిస్తాయి. ఇవి తింటే నిద్రలేమి సమస్యకు చెక్ నిద్రలేమి సమస్యకు ఆకుకూరలతో చెక్ పెట్టొచ్చు. పాలకూర, బచ్చలికూర, తోటకూర వంటి ఆకుకూరల్లో మెగ్నీషియం,కార్బోహైడ్రేట్లు మిటమిన్లు ఏ,విటమిన్ సి, విటమిన్ కె,తోపాటు ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది. వీటిని తింటే నిద్రలేమి సమస్యకు చెక్ పెట్టొచ్చు. ఆకుకూరలలో తొందరగా అరిగే చాన్స్ ఉండటం వలన నిద్రకు ఎలాంటి సమస్య ఉండదు. పాలకూర తో గుండె సంబంధిత వ్యాధులను కూడా కట్టడి చేసే అవకాశం ఉందని వైద్యనిపుణులు సూచిస్తుంటారు. %ూశ్రీంశీ =ఝుం% పెళ్ళైన కొత్త జంటల మధ్య శృంగారలేమి.. కారణాలివే.. మీరు చెయ్యాల్సిందిదే! పండ్లు, పాలతో పాటు ఇవి తింటే మంచి నిద్ర అయితే ఆకుకూరలు మాత్రమే కాదు కొన్నిరకాల పండ్లు కూడా మన నిద్రకు ఎంతగానో ఉపయోగపడతాయి. కివీ, చెర్రీస్ వంటి పండ్లు, అరటిపండ్లు మన నిద్రను మేరుగుపరచటం కోసం దోహదం చేస్తాయి. గోరు వెచ్చని పాలలో దాల్చిన చెక్క పొడిని గ్లాసు పాలలో చిటికెడు పొడిని కలుపుకొని తాగితే మంచి నిద్ర పడుతుంది. వాల్ నట్స్, గుమ్మడి గింజలు, చియా సీడ్స్ వంటి వాటిని ఆహారంలో తీసుకోవటం వలన కూడా నిద్ర బాగా పడుతుంది. మంచి పోషకాహారం మన నిద్రను మెరుగుపరుస్తుంది.

## హీరో, హీరోయిన్స్ సిక్రెట్‌గా తినే బ్రేక్ ఫాస్ట్ ఇదే!



చద్దన్నం.. ఈ పేరు వింటేనే చాలా మందికి నోరూరిపోతుంది. పల్లెటూర్లలో ప్రతి ఒక్కరికీ చద్దన్నం సుపరిచితమే. రాత్రి మిగిలిన అన్నాన్ని నీళ్లలో లేదా పెరుగులో నానబెట్టి ఉదయాన్నే తినడాన్ని చద్దన్నం అంటారు. దీన్ని పేదవాడి ఆహారంగా చాలా మంది భావిస్తారు. కానీ చద్దన్నంలో పోషకాలు అధికంగా ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిని ఇప్పుడు సినీ నటీనటులు సైతం ఉదయాన్నే తింటున్నారు. జగపతిబాబు, సమంత, నిధి అగర్వాల్‌తో సహా పలువురు ప్రముఖులు కొన్ని సందర్భాల్లో వారే స్వయంగా వెల్లడించారు. చద్దన్నం తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. చద్దన్నంలో పోషకాలు: చద్దన్నంలో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా, ఇది విటమిన్ బి12 కు గొప్ప మూలం. దీనిలో విటమిన్ బి, ఐరన్, పొటాషియం , కాల్షియం వంటి ఖనిజాలను కలిగి ఉంటుంది. అంతేకాకుండా, చద్దన్నంలో ప్రోబయోటిక్స్ కూడా ఉంటాయి, ఇవి జీర్ణక్రియకు సహాయపడతాయి. చద్దన్నం తినడం వల్ల కలిగే కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు: %=వఙశీఎఎవఅంవం ఖీశీతీ శీబ% "ఈ ఆహారాలతో క్యాన్సర్ రిస్క్... తినటం మానేయండి!" చద్దన్నంలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియకు సహాయపడతాయి. ఇది మలబద్ధకం , ఇతర జీర్ణ సంబంధిత సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. దీనిలో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. ఇది రోజంతా చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది. చద్దన్నం శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. ఇది వేసవిలో వడదెబ్బను నివారించడానికి సహాయపడుతుంది. చద్దన్నంలో ఉండే పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. ఇది వివిధ రకాల వ్యాధుల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. %ూశీషవతీవం దీఎ% చద్దన్నంలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది, ఇది ఎముకలను బలపరుస్తుంది. ఇది బోలు ఎముకల వ్యాధిని నివారించడానికి సహాయపడుతుంది. దీనిలోని పొటాషియం ఉంటుంది, ఇది రక్తపోటును నియంత్రించడానికి సహాయపడుతుంది. చద్దన్నంలో కేలరీలు తక్కువగా ఉంటాయి మరియు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. దీనిలో ఉండే కాల్షియం ఎముకలను బలపరుస్తుంది. జుట్టుకు పోషణను అందిస్తుంది , దానిని బలపరుస్తుంది. చద్దన్నం ఎలా తయారవుతుంది? రాత్రి వండిన అన్నాన్ని నీటిలో లేదా పెరుగులో నానబెట్టి ఉదయాన్నే తినడాన్ని చద్దన్నం అంటారు. ఇలా నానబెట్టడం వల్ల అన్నంలో కొన్ని మార్పులు జరుగుతాయి, ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దీనిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం మంచిది. మీరు దీన్ని పెరుగుతో లేదా నీళ్లతో కలిపి తినవచ్చు. మీరు కావాలంటే కొంచెం ఉప్పు మరియు ఉల్లిపాయ కూడా కలుపుకోవచ్చు.

## మంట పెడుతున్న మూత్రం.. క్యాన్సర్ లక్షణామే?

ప్రతి ఏటా ఫిబ్రవరి 4న వరల్డ్ క్యాన్సర్ డే నిర్వహించబడుతుంది. ప్రజల్లో క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడం, ఈ ప్రాణాంతక వ్యాధితో పోరాడటానికి ప్రపంచవ్యాప్తంగా ప్రయత్నాలను బలపేతం చేయడం దీని వెనుక ఉన్న ఉద్దేశం. చెడు ఆహారపు అలవాట్లు చెడు జీవనశైలి కారణంగా ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ బారిన పడుతున్నవారి సంఖ్య భారీగా పెరుగుతుంది. ఈ ప్రాణాంతక వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించగలిగితే దీనిని విజయవంతంగా జయించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలు కోల్పోక తప్పదు.అయితే ప్రారంభ దశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తుపట్టడం అంత ఈజీ కాదు. ఎందుకంటే 99 శాతంమందికి అవి క్యాన్సర్ లక్షణాలు అని తెలియదు. క్యాన్సర్ వస్తే కనిపించే లక్షణాలు ఇవే: బరువు తగ్గిపోవడం అమెరికన్ క్యాన్సర్ సొసైటీ తెలిపిన వివరాల ప్రకారం..క్యాన్సర్ సోకినవారిలో చాలామంది వేగంగా బరువు తగ్గిపోతుంటారు.పాంక్రియాస్, కడుపు, ఊపిరితిత్తులు, అన్న వాహిక క్యాన్సర్ లు వచ్చినప్పుడు ఇలా జరుగుతుంటది. "ఏప్రిల్ లో ఏనుగు కుంభస్థలాన్ని బద్దలు కొట్టే రాశులవారు వీరేనన్న శని!" తరచూ జ్వరం క్యాన్సర్ రోగుల్లో జ్వరం అనేది సాధారణ లక్షణం. క్యానర్స్ పుట్టిన దగ్గర నుంచి ఇతర అవయువాలకు వ్యాప్తి చెందేటప్పుడు జ్వరం వస్తుంది. క్యాన్సర్ లక్షణాల్లో అలసట కూడా ఒకటి. విశ్రాంతి తీసుకున్నా కూడా రోగులు అలసట నుంచి బయటపడలేరు. లుకేమియా వంటి కొన్ని క్యాన్సర్ లలో అలసటే తొలి లక్షణం. పెద్ద పేగు లేదా కడుపు క్యాన్సర్లు రక్తహీనతకు కారణమవుతాయి. చర్మ మార్పులు చర్మంపై కొత్త మచ్చలు, పుట్టుమచ్చలలో మార్పులు లేదా చర్మం రంగు మారడం వంటివి క్యాన్సర్ యొక్క లక్షణాలు కావచ్చు. %ూశీషవతీవం దీఎ% గాయాలు మానకపోవడం శరీరంపై ఏర్పడిన గాయాలు చాలా కాలం పాటు మానకపోతే అది క్యాన్సర్ సంకేతంగా పరిగణించబడుతుంది.

# మార్కెట్

## బంగారం ధరలు హై జంప్

### ఒక్కరోజే రూ.2వేలు పెరిగిన రేటు

### దేశీయ మార్కెట్‌లో సరికొత్త స్థాయికి చేరిక



బంగారం ధరలు ఆకాశమే హద్దు అన్నట్టు దూసుకుపోతున్నాయి. దేశీయ మార్కెట్‌లో పసిడి రేట్లు ఒక్కరోజే మరో రూ.2వేలు ఎగిసి ఆల్‌టైమ్ హైకి చేరాయి. 24 క్యారెట్ 10 గ్రాముల పుత్తడి విలువ తొలిసారి రూ.94,150 పలికింది. గడిచిన 3 నెలల్లో రూ.15,200 ఎగబాకింది. న్యూఢిల్లీ : బులియన్ మార్కెట్‌లో బంగారం ధగధగలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సామాన్య, సగటు మధ్యతరగతి వర్గాలకు అందనంత ఎత్తుకు ఎగబాకిన గోల్డ్ రేట్లు.. ఇంకా పైకి పోతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం దేశీయంగా మరో ఆల్‌టైమ్ హైని చేరాయి. ఈ ఒక్కరోజే 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల ధర ఢిల్లీలో మునుపెన్నడూ లేనివిధంగా రూ.94,150గా నమోదైంది. ఏకంగా ఒకేసారి తులం విలువ రూ.2,000 ఎగిసింది. దాదాపు గడిచిన రెండు నెలల్లో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. ఫిబ్రవరి 10న రూ.2,400 పెరిగింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే. మరోవైపు మార్కెట్‌లో ధరలు పరుగులు పెడుతుండటంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా బంగారం రేటు రూ.15,200 పుంజుకున్నది. గత ఏడాది డిసెంబర్ 31న 24 క్యారెట్ గోల్డ్ ధర రూ.78,950 వద్ద ముగిసింది. హైదరాబాద్‌లో..హైదరాబాద్‌లోనూ గోల్డ్ రేట్లు దూకుడు మీదున్నాయి. 24 క్యారెట్ తులం రూ.930 ఎగిసి రూ.92,840 పలికింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) రూ.850 పెరిగి రూ.85,100గా ఉన్నది. గత వారం రోజుల్లో 24 క్యారెట్ రేటు రూ.3,550, 22 క్యారెట్ 3,250 ఎగబాకడం గమనార్హం. కాగా, స్టాక్‌హోల్డర్లు, జ్యుయెల్లర్స్ నుంచి అమాంతం పెరిగిన డిమాండే మార్కెట్‌లో ఈ అప్ ట్రెండ్‌కు కారణమని అఖిల భారత సరఫా అసోసియేషన్ వర్గాలు తెలిపాయి. స్టాక్ మార్కెట్లు నష్టపోతుండటంతో అక్కడి పెట్టుబడులకు ప్రత్యామ్నాయంగా మదుపరులకు బంగారమే కనిపిస్తున్నదని, ఇది కూడా ధరలను ఎగదోస్తున్నదని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో వెండి ధర కిలో రూ.500 తగ్గింది. 1,02,500కు పరిమితమైంది.

### కారుకు ఆ పేపర్స్ లేకుండా టోల్ గేట్ దాటితే

## ఆటోమేటిక్‌గా భారీ పెనాల్టీ..!!



దేశంలో రోజురోజుకూ వాహనచట్టాలను ఉల్లంఘిస్తున్న వ్యక్తుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ప్రజలను ప్రభుత్వాలు ఎన్నిసార్లు దీనిపై అప్రమత్తం చేసినప్పటికీ వాహనదారుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావటం లేదు. ఇన్సూరెన్స్ విషయంలో అప్రమత్తంగా ఉండని పరిస్థితిపై ఆందోళనలు పెరుగుతూనే ఉన్నాయి. వివరాల్లోకి వెళితే దేశంలో తొలిసారిగా ఒడిశా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ పేపర్లు లేని వాహనదారులకు ఈపెనాల్టీలు అందించటానికి నిర్ణయించింది. దీనికోసం టోల్ ప్లాజాల వద్ద ఈ-డిటెక్షన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తోంది. మ్మెదటిసారి తప్పుచేసిన వ్యక్తులకు రూ.2,000 పెనాల్టీ విధించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే 3 నెలల వరకు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉన్నట్లు వెల్లడైంది. "బెంగళూరులో వణికిపోతున్న తెలుగు టెక్కీలు..! కొత్త రచ్చతో నిద్ర పట్టట్లే.. " ఒకసారి కంటే సార్లు ఇలా దొరికిన వాహనదారులపై రూ.4,000 పెనాల్టీ విధించనున్నట్లు వెల్లడించారు. 1988 మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 146 ప్రకారం ప్రజా రహదారులపై నడిచే ప్రతి మోటారు వాహనానికి చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉండాల్సి ఉంది. వాస్తవానికి అనేక ప్రైవేట్, కమర్షియల్ వాహనాలు చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ లేకుండా రోడ్లపై నడుస్తున్నాయి. దీని వల్ల రోడ్డు ప్రమాదాల బాధితులకు పరిహారం నిరాకరించబడుతుందని ఒడిశా ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. అయితే కొత్త వ్యవస్థతో చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ లేని వారు ఏదైనా సంఘటన జరగడానికి ముందే ప్రతిదీ పొందేలా ఒడిశా ప్రభుత్వం నిర్ధారిస్తుంది. వాస్తవానికి ఈడిటెక్షన్ వ్యవస్థను బిహార్ రాష్ట్రంలోని 32 టోల్ ప్లాజాల్లో ఇలాంటి వ్యవస్థను ఉంచింది. దీని ద్వారా పొల్యూషన్ సర్టిఫికెట్లు లేని వాహనాలను గుర్తించటానికి వినియోగిస్తున్నారు. పొల్యూషన్ సర్టిఫికెట్ లేదని గుర్తించిన వాహనాలకు రూ.10 వేలు పెనాల్టీ విధించబడుతోంది. ఈ వ్యవస్థలను ట్రయల్స్ కోసం ప్రవేశపెట్టినప్పుడు కేవలం 2 రోజుల్లోనే 5,000కి పైగా ఈ-చలాన్లు జారీ చేయబడినట్లు బీహార్ నివేదించింది. రానున్న రోజుల్లో ఈ వ్యవస్థను బీహార్ పాట్నా, ముజఫర్‌పూర్, భాగల్పూర్ సహా ఇతర స్మార్ట్ సిటీలకు విస్తరిస్తామని పేర్కొంది. దీనిని భవిష్యత్తులో దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఇలాంటి వ్యవస్థను వాహన చట్టాలను ఉల్లంఘించే వాహనదారులపై ప్రయోగించనున్నట్లు తెలుస్తోంది.


## ఎల్ఐసి కస్టమర్లు జాగ్రత్త.. ఈ మొబైల్ యాప్ మీ డబ్బును మింగేస్తుంది,

టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందుతుందో ఆర్థిక మోసాలు కూడా అదే రీతిలో పెరిగాయి. వీటి వల్ల ఎక్కువగా మోసపోయేది కూడా సామాన్యులే. ప్రస్తుతం నేటి ప్రపంచంలో ఎన్నో రకాల మోసాలు ఎక్కడో ఓ చోట జరుగునే ఉన్నాయి, దీనివల్ల ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బు రెండు నిమిషాల్లో మాయమవుతుంది. తాజాగా దినికి సంబంధించి ఎల్ఐసి కూడా మోసపూరితమైన యాప్‌ల గురించి ప్రజలను హెచ్చరించింది. ఎల్ఐసి జారీ చేసిన నోటీసు ఇండియా యాప్ అని చూపించే ఫేక్ యాప్‌ను మీరు ఉపయోగిస్తే లేదా చుసిన తమకు సమాచారం అందజేయాలని %వ×జ% ఇటీవల నోటీసు జారీ చేసింది, ఎల్ఐసి పేరుతో కనిపించే ఇలాంటి యాప్ నిజం కాదు. దీని వల్ల మీ డబ్బును కోల్పోయే అవకాశం ఉంది. ఈ కారణంగా ఇలాంటి మొబైల్ యాప్‌ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నాము. దీనితో పాటు మీ అన్ని ట్రాన్సక్షన్ అఫీషియల్ వెబ్‌సైట్ సహాయంతో మాత్రమే చేయాలని లేదా డబ్బును డిజిటల్ యాప్ ద్వారా ట్రాన్సక్షన్ చేయాలని కూడా తెలియజేసింది. " ఎల్ఐసి గతంలో కూడా నోటీసు జారీ గత ఏడాది సెప్టెంబర్‌లో కూడా ఒక నోటీసు జారీ చేసింది.

## అన్నీ ఉత్త మాటలే.. పెట్టుబడుల వార్తలు అంతా అబద్ధం.. ప్రకటించిన బీవైడీ

### హైదరాబాద్‌లో ఈవీ ప్లాంట్ పెట్టే యోచనేదీ లేదు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): చైనాకు చెందిన విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ) తయారీ దిగ్గజం బీవైడీ (బిల్డ్ యువర్ డ్రీమ్స్).. తెలంగాణలో కార్ల తయారీ పరిశ్రమ ఏదీ లేదని ప్రకటించింది. హైదరాబాద్‌లో 1.4 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఈవీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు వస్తున్న వార్తలను తోసిపుచ్చింది. ఈ మేరకు టెక్ఇన్ఏషియా.కామ్ చెప్తున్నది. అలాగే తమ వుయ్‌చాట్ అకౌంట్‌లో పోస్ట్ చేసిన ఓ అధికారిక ప్రకటనలో ఈ వార్తలన్నీ అబద్ధాలని బీవైడీ సైతం పేర్కొనడం గమనార్హం. కాగా, చైనా ప్రముఖ బిజినెస్ మీడియా సంస్థ యికై గ్లోబల్ మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. దీంతో యికై చైనాలోని అత్యంత ప్రధాన బిజినెస్ మీడియా కావడంతో ఈ అంశాన్ని కొట్టిపారేయలేమని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.



# కక్షపూరిత కేసులకు భయపడేది లేదు

**మా కుటుంబంపై కక్షతో వరుస కేసులు**

**అయినా జగన్ వెంటే నడుస్తామన్న పేర్ని నాని**



మచిలీపట్నం : తమపై ఎన్ని కక్షపూరిత కేసులు పెట్టినా భయపడేది లేదని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. మంగళవారం మచిలీపట్నంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో సివిల్ స్లపై శాఖలో ఎన్నడూ లేని విధంగా తమపై క్రిమినల్ కేసులు పెడుతున్నారంటూ వాపోయారు. అసలు చట్టం ప్రకారం ఎవరిపై పెట్టకూడని కేసులు తన కుటుంబంపై పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి వేధింపులు తనకు కొత్తేం కాదని.. కేసులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఎన్ని వేధింపులకు గురి చేసినా మాజీ సీఎం జగన్ ను వీడేది లేదని తేల్చి చెప్పారు. సివిల్ స్లపై శాఖ మంత్రి స్వయంగా వెళ్లి టన్నుల కొద్దీ రేషన్ బియ్యాన్ని పట్టుకుంటే వారిపై ఎందుకు క్రమినల్ కేసులు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లి సీజ్ ది షిప్ అన్న కేసుల్లో కూడా ఎందుకు క్రిమినల్ సెక్షన్లు పెట్టలేదని అడిగారు. తనపై పెట్టింది వేధింపులు కేసు మాత్రమే అని.. అది చట్టం ప్రకారం క్రిమినల్ కేసు కాదన్నారు. ఇలాంటి బెదిరింపులకు తాను ఎన్నడూ భయపడలేదని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతల ఇళ్ల చుట్టూ పోలీసులే ఉంటున్నారని.. అరెస్ట్ చేయడమే వారి పనిగా మారిపోయిందన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా జగన్ వెంటే ఉంటామని పేర్ని నాని తెలిపారు. కూటమి తప్పుల్ని ఎండగడుతూనే ఉంటామని అన్నారు. వైఎస్ఆర్ సిపి నుంచి తప్పుకునే ప్రసక్తే లేదని తెలియజేశారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు మేలు చేయకుండా వ్యవస్థలను వేధింపులకు వాడుకుంటున్నారని మండి పడ్డారు. ప్రభుత్వానికి జరిగిన నష్టానికి రెట్టింపు సొమ్ము జమ చేశామని చెప్పారు. తన భార్యపై తప్పుడు సెక్షన్లు పెట్టి అరెస్ట్ చేయాలని చూశారని, ఆ సెక్షన్లు వర్తించవని జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసిందని పేర్కొన్నారు. తమ కుటు–ంబంపై తప్ప ఇప్పటివరకు ఎవరిపైనా క్రిమినల్ కేసు లేదని, 'స్వయంగా పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెళ్లి 22 వేల టన్నుల బియ్యం పట్టుకున్నా కేసు లేదని అన్నారు. సీజ్ ద గోడౌన్ అన్నా ఎవరిపైనా క్రిమినల్ కేసు లేదని, వారిపై పెట్టింది కేవలం సిక్స్ఎ కేసు మాత్రమేనని పేర్నినాని స్పష్టం చేశారు.

## విదేశీ యువతిపై అత్యాచారం

**దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

హైదరాబాద్ : రాష్ట్రంలో అత్యాచారాలు బాగాపెరిగిపోతున్నాయి. ఏదోవిధంగా యువతులను నమ్మిస్తున్న యువకులు దారుణాలకు ఒడిగడుతున్నారు. మొన్న ఓ ఆలయానికి వెళ్లిన యువతిని సామూహిక అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. దానిని మరువకముందే హైదరాబాద్ శివారులో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్టుకు వెళు న్న యువతికి లిఫ్ట్ ఇస్తానని చెప్పి ముగ్గురు యువకులు కార్‌లో ఎక్కించుకున్నారు. అనంతరం మీర్‌పేట్ దగ్గరలోని మందమల్లమ్మ దగ్గర.. సదరు యువతిని కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆ జర్మనీ యువతి పహాడీ షరీఫ్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మీర్‌పేట్ దగ్గర లిఫ్ట్ ఇస్తామని చెప్పి వాళ్లు కార్ ఎక్కించుకున్నట్టు ఆమె కంప్లైంట్లో వివరించింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల్ని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. బాధితురాలు విదేశీ యువతి కావడంతో కేసును మరింత సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధిత యువతిని వైద్య పరీక్షల కోసం హాస్పటల్‌కు తరలించారు పోలీసులు.

## ఢిల్లీ ఝుండేవాలన్ ప్రాంతంలో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ : ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది.నగరంలోని ఝుండేవాలన్ ప్రాంతంలో ఉన్న అనార్కలి భవనంలో మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటినా సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. 15 అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపులోకి తెచ్చారు. అపార్ట్ మెంట్ బ్లాక్ 3లోని అనార్కలి కాంప్లెక్స్‌లో మధ్యాహ్నం 2.35 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగినట్లు– తమకు సమాచారం అందిందని అగ్నిమాపక అధికారి ఒకరు తెలిపారు. మంటలు సమీపంలోని డిడిఎ షాపింగ్ కాంప్లెక్స్‌కు వ్యాపించాయని డిసిపి ఎం హర్ష వర్ధన్ తెలిపారు. మంటలు భారీగా ఎగిసి పడటంతో సమీపంలో పార్క్ చేసిన పలు కార్లు దగ్ధమయ్యాయని, మంటలు సమీపంలోని బ్యాంకుకు కూడా వ్యాపించాయని పోలీసులు తెలిపారు. అయితే, ఎటు–వంటి ప్రాణనష్టం జరగలేదని ఆయన అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు– తెలిపారు.

## రాజకీయ లబ్ది కోసం లేనిపోని ఆరోపణలు

**ప్రభుత్వాన్ని అప్రతిష్ట చేసే యత్నాలు**

**ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శలు**

హైదరాబాద్ : ఎటువంటి పరిస్థితుల్లోనూ సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు నష్టం కలిగించే ప్రయత్నం చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోరని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ప్రతీ విషయాన్ని రాజకీయం చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే కుట్ర బీజేపీ, బీఆర్ఎస్ కలిసికట్టుగా చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటు–న్నారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందే రాష్ట్రంలో భూములు ఆదాయ వనరుగా మారాలని ప్రభుత్వం భావిస్తోందని, విద్యార్థులకు ఏమాత్రం నష్టం కలగకుండా ప్రభుత్వ విధానాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పక్కన ఉన్న సర్వే నెంబర్ 25లో గల 400 ఎకరాల భూమిని సీఎం రేవంత్ రెడ్డి కోర్టులో పోరాటం చేసి సాధించారని అద్దంకి దయాకర్ తెలిపారు. చట్టాలను గౌరవిస్తూ, న్యాయపరమైన మార్గంలోనే భూమిని రాబట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. ఈ భూమిని అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్, కేటీఆర్ ఈ భూములను వేలం వేసి ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించాలని చూశారని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిందని అద్దంకి దయాకర్ గుర్తుచేశారు. అందువల్లే ఈ భూమి ఇప్పటికి ప్రభుత్వ ఆధీనంలో ఉందని, విద్యార్థులకు నష్టం కలగకుండా రేవంత్ రెడ్డి అన్ని జాగ్రత్తలు తీసుకుంటు–న్నారని తెలిపారు. 1970లలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఐఈ÷ఖ కోసం 2500 ఎకరాల భూమిని కేటాయించారని అద్దంకి దయాకర్ తెలిపారు. కానీ ఇప్పుడు కొన్ని రాజకీయ పార్టీలు విద్యార్థుల భావోద్వేగాలను రెచ్చగొట్టి తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఈ విషయాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తున్నాయని అద్దంకి దయాకర్ ఆరోపించారు. విద్యార్థులను సెంటిమెంట్‌తో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని, ప్రభుత్వంపై నెగటివ్ ప్రచారం చేయడమే వారి లక్ష్యమని అన్నారు. బీఆర్ఎస్ అనుబంధ సంఘాలు బ్యాక్‌గ్రౌండ్‌లో జేసీబీలు, వన్యప్రాణులు ఉన్నట్లు– సోషల్ మీడియాలో కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అద్దంకి దయాకర్ తెలిపారు.

## వంశీ రిమాండ్ 15 వరకు పొడిగింపు

విజయవాడ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ కేసులో ఈ రోజు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి.. వల్లభనేని వంశీ రిమాండ్‌ను జిల్లా కోర్టు పొడిగించింది.. ఆత్కురులో 9 ఎకరాలు కబ్జా చేసేందుకు ప్రయత్నించారని నమోదైన కేసులో వల్లభనేని వంశీకి రిమాండ్ పొడిగించింది. వంశీ రిమాండ్‌ను ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు– ప్రకటించింది.. మరోవైపు, వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా వేసింది.. గన్నవరంలో సీతామహాలక్ష్మి అనే మహిళ స్థలం కబ్జా చేశారన్న కేసులో బెయిల్ ఇవ్వాలని వంశీ పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ గురువారానికి వాయిదా వేసింది.. మరోవైపు.. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఏ1గా ఉన్న వంశీ ప్రధాన అనుచరుడు రంగాను సీఐడీ కస్టడీకి ఇచ్చింది న్యాయస్థానం.. దీంతో, బుధవారం నుంచి మూడు రోజుల పాటు రంగను సీఐడీ అధికారులు విచారించనున్నారు.. మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణకు అనుమతి ఇచ్చింది కోర్టు.. కాగా, ఇదే కేసులో ఏ71గా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఉన్నారు,

## పాస్టర్ మృతిలో తప్పడు ప్రచారం

**రాజమండ్రిలో వ్యక్తి అరెస్ట్..రిమాండ్**

**పాస్టర్ మృతిపై వీడిన అనుమానాలు**

రాజమండ్రి : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తి అరెస్ట్ అయ్యాడు. రాజమండ్రిలోని లలితా నగర్ ప్రాంత వాసి దేవబత్తుల నాగమల్లేష్ ని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారు. స్థానిక వీఆర్ఓ ఫిర్యాదు మేరకు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న మల్లేష్‌ని అరెస్ట్ చేసినట్లు రాజమండ్రి మూడవ పట్టణ పోలీసులు తెలిపారు. కోర్టులో ప్రవేశ పెట్టిన మల్లేష్ కు రిమాండ్ విధించడంతో రాజమండ్రి జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా.. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై స్పష్టత వచ్చింది. బెజవాడలో ఉన్న 3 గంటలు ఏం చేశారనే దానిపై మిస్టరీ వీడింది. ఈ నెల 24న ప్రవీణ్ బెజవాడ మీదుగా రాజమండ్రి వెళ్తూ అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో బెజవాడ నగరంలో ఉన్న 200 సీసీ టీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు ప్రవీణ్.. విజయవాడ నగరంలో ఏం చేశాడనే విషయాన్ని గుర్తించి నివేదికను పోలీస్ కమిషనర్ (సీపీ)కి అందజేశారు పోలీసులు. విజయవాడ నగరంలో పాస్టర్ ప్రవీణ్ ఈ నెల 24న హైదరాబాద్ నుంచి రాజమండ్రి బయల్దేరుతూ గుంటుపల్లి నుంచి భవానీపురం వచ్చే మార్గంలో ఒకసారి బైకుపై నుంచి పడిపోయారు. ఈ సమయంలోనే ఆయన బుల్లెట్ హెడ్ లైట్ కూడా ధ్వంసమైంది.. ఆ తర్వాత భవానీపురంలో పెట్రోల్ బంకులో పెట్రోలు కొట్టించుకుని నగరంలో దుర్గగుడి ప్లై ఓవర్ మీదుగా బెంజిసర్కిల్ ప్లై ఓవర్ పై ప్రయాణించి రామవరప్పాడు రింగు సెంటర్‌కు చేరుకున్నారు. రామవరప్పాడు రింగు సెంటర్‌కు చేరుకున్న తర్వాత అస్వస్థతకు గురైన పాస్టర్ ప్రవీణ్ అక్కడే ఉన్న గ్రీనరీ పార్క్ లో కూర్చున్నారు. 5.15 నుంచి 7.30 వరకు అక్కడే ఉన్న ఆయనను స్థానికంగా విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు వెళ్లి మంచినీరు అందించారు. పక్కనే ఉన్న టీస్టాల్ కు వెళ్లిన పాస్టర్ ప్రవీణ్ టీ తాగారు. ఇక, పాస్టర్ టీ తాగటానికి ముందు మొహం కడుక్కున్నారని టీస్టాల్ కార్మికుడు నాగార్జున తెలిపారు. ఇదే సమయంలో ప్రవీణ్ బుల్లెట్ హెడ్‌లైట్ ఊడిపోయి ఉండటంతో నాగార్జున తన హోటల్ లో ఉన్న తాడు తీసుకువచ్చి బిగించాడు. అయినప్పటికీ హెడ్ లైట్ ఊడిపోవటంతో వైరు వంటి దానితో కట్టడానికి నాగార్జున హోటల్‌లోకి, ఎస్ ఐ సుబ్బరావు తన జీపు వద్దకు వెళ్లారు.. అయితే, తిరిగి వచ్చే సమయానికి పాస్టర్ ప్రవీణ్ అక్కడ నుంచి బుల్లెట్‌తో సహా వెళ్లిపోయారు. నీరసంగా ఉన్నారని కాసేపు రెస్ట్ తీసుకుని వెళ్లాలని సూచించినా కూడా ప్రవీణ్ వినకుండా వెళ్ళిపోయాని నాగార్జున తెలిపారు. సుమారు 35 నిమిషాలపాటు– పాస్టర్ ప్రవీణ్ రామవరప్పాడు రింగు సెంటరులో ఉన్నట్టు గుర్తించారు. మొత్తం సీసీ టీవీ ఫుటేజ్ ను పోలీసులు సేకరించారు.

## అత్యాచారం కేసులో మతబోధకుడికి జీవితఖైదు

**దోషిగా తేల్చి శిక్ష విధించిన మొహాలీ కోర్టు**

చండీగఢ్ : అత్చారం కేసులో పంజాబ్‌కు చెందిన ప్రముఖ మతబోధకుడు, సోషల్‌మీడియా ఇన్ఫ్లుయెన్సర్ బాజిందర్ సింగ్‌కు జీవితఖైదు పడింది. అత్యారం తరవాత తప్పించుకున్నాడని అంటున్నారు. చివరు పోలీసులకు చిక్కాడు. 2018లో ఓ యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు గానూ ఇటీవల అతడిని మొహాలీ కోర్టు దోషిగా తేల్చింది. తాజాగా శిక్ష ఖరారు చేస్తూ..బాజిందర్ సింగ్‌కు జీవితఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఐదుగురిని న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. అప్పట్లో ఈ కేసు సంచలనం రేపింది. బాజిందర్ సింగ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని జిరాక్‌పుర్‌కు చెందిన ఓ మహిళ 2018లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విదేశాలకు తీసుకెళ్తానని ఆశపెట్టి అతడు తనను ఇంటికి ఆహ్వానించాడని బాధితురాలు తెలిపింది. అక్కడ తనపై లైంగిక దాడికి పాల్పడి.. ఆ దృశ్యాలను రికార్డ్ చేశాడని ఆరోపించింది. అతడి డిమాండ్లకు అంగీకరించకపోతే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించినట్లు తెలిపింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఇటీవల దిల్లీ ఎయిర్‌పోర్టులో అతడిని అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన కోర్టు.. అతడిని దోషిగా తేల్చి జీవితఖైదు విధించింది. హరియాణాకు చెందిన బాజిందర్ సింగ్ 2012లో మతబోధకుడిగా మారాడు. జలంధర్, మొహాలిలలో ప్రార్థనా మందిరాలు ఏర్పాటు చేశాడు. అనతికాలంలోనే పాపులర్ అయిన సింగ్‌కు సోషల్ మీడియాలోనూ లక్షలాది ఫాలోవర్లు ఏర్పడ్డారు. అయితే, ఇతడిపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమార్తెకు నయం చేస్తానని డబ్బులు తీసుకున్నట్లు దిల్లీకి చెందిన దంపతులు 2022లో కేసు పెట్టారు. 2023లో సింగ్‌పై ఆదాయపు పన్ను సోదాలు కూడా చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కపుర్తలాకు చెందిన మరో యువతి అతడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ పోలీసులను ఆశ్రయించింది. దీంతో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. మొత్తానికి పోలీసులు అరెస్ట్ చేసి, కేసులు రుజువు చేయడంతో జీవితఖైదు పడింది.

## ఎటిఎం కార్డు సైజులో రేషన్ కార్డు

**కెవైసీ ప్రక్రియ ముగిసాక కొత్త కార్డులు జారీ**

**పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**



అమరావతి : ఈ ఏడాది మే నుంచి ఏటీఎం కార్డు సైజులో కొత్త రేషన్ కార్డులు జారీ చేయబోతున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఏప్రిల్ 30వ తేదీతో ఈ కేవైసీ పక్రియ పూర్తి అయిన వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 44 వేల 394 ప్రభుత్వ పాఠశాలలకు సూపర్ ఫైన్ బియ్యాన్ని మధ్యాహ్న భోజనానికి సరఫరా చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. మంగళవారం మంత్రి నాదెండ్ల మనోహర్ సచివాలయంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఫ్యామిలీ రేషన్ కార్డునే సైజు తగ్గించి అన్ని వివరాలతో జారీ చేయనున్నామని స్పష్టం చేశారు. కొత్త కార్డుల జారీ సమయంలోనే కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇస్తామని తెలిపారు. క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లతో కొత్త రేషన్ కార్డులు జారీ అవుతాయని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలా ఎక్కడా వ్యక్తుల బొమ్మలు రేషన్ కార్డుపై ఉండబోవని స్పష్టం చేశారు. ఈ కేవైసీ పూర్తి అయిన తర్వాత ఎంతమందికి కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలో స్పష్టత వస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం నుంచి దీపం 2 రెండో విడత సిలిండర్ బుకింగ్ ప్రారంభమైందని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. కొత్తగా 2 లక్షల మంది గ్యాస్ కనెక్షన్లు తీసుకున్నట్లు– చమురు కంపెనీలు తెలిపాయని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 35 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. రైతుకు ఒక భరోసా ఇస్తూ వారికి 24 గంటల్లోపు వారి ఖాతాల్లో నగదు జమ చేశామని అన్నారు. రూ.8 వేల 279 కోట్లు ధాన్యం కొనుగోలు చెల్లింపులు చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. 5 గోదాముల్లో మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించే బియ్యం నిల్వ చేసి ప్యాకింగ్ చేయిస్తున్నామని తెలిపారు. రబీలోనూ ఖరీఫ్ బియ్యం కొనుగోలు కొనసాగుతుందని చెప్పారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠినంగానే వ్యవహరిస్తున్నామని అన్నారు. పీడీ యాక్టులోనూ రేషన్ బియ్యం స్మగ్లింగ్‌ను చేర్చామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం రూ.1600 కోట్లతో ఎండీయూలు కొనుగోలు చేసి దుర్వినియోగం చేసిందని ఆరోపణలు చేశారు. ఎండీయూల కొనుగోలు ఓ పెద్ద కుంభకోణమని షాకింగ్ కామెంట్స్ చేశారు.దీనిపై విచారణ జరుగుతోందని.. త్వరలోనే ఓ నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేశారు. త జగన్ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లలో కూడా అవినీతి జరిగిందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. రైతులు ధాన్యాలను అమ్ముకునేందుకు మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చే పరిస్థితి ఉందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లల్లో వాట్సాప్ , జీపీఎస్‌లను సాంకేతికంగా ఉపయోగిస్తున్నామని తెలిపారు. రైతులే వారికి నచ్చిన మిల్లుల వద్ద ధాన్యం అమ్ముకునేలా అవకాశం కల్పించామని చెప్పారు. ఈ సీజన్‌లో చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మాటిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వలో మాదిరిగా ధాన్యం కొనుగోలు చేయలేదని అన్నారు. రబీ సీజన్‌లో రైతులకు ఒక భరోసా కల్పిస్తూ ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బీలో 13 లక్షలు 50 వేల మెట్రిక్ టన్నులు పంట వస్తుందని అంచనా వేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సివిల్ స్లపై నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఏపీ వ్యాప్తంగా 2900 రైతు సహాయక కేంద్రాలు ఏర్పాటు– చేస్తామని హామీ ఇచ్చారు. 12 వేల మంది సిబ్బంది అందుబాటు–లో ఉంటారని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దీపం 2 పథకం అమలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

## 5 నుంచి ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు

**ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం**

కడప : ఒంటిమిట్ట ఏకశిలానగరంలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయంలో ఏప్రిల్ 5 నుండి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం విదితమే. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. ఉదయం 8 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకు మ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను ఉదయం 11.30 గంటల నుండి సర్వదర్శనానికి అనుమతించారు. ఒంటిమిట్ట ఏకశిలాన గరంలో జగదభి రామయ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం అవుతోంది. రామయ్య వార్షిక బ్రహ్మోత్స వాలు జరగబోతున్నాయని టీటీడీ అధికారులు ప్రకటి ంచారు.. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు భారీగా నిర్వహిస్తున్నా మన్నారు. కోదండ రామయ్య బ్రహ్మోత్సవాల ముందు, కోయిల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయి ఓతీగా వస్తోందని..అన్నారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు కోయిల్ ఆల్వార్ కార్యక్రమం పూర్తి చేశారు.

## హైదర్‌గూడ క్వాటర్స్ వద్ద పోలీసుల మోహరింపు

**పలు పార్టీల పిలుపు నేపథ్యంలో అధికారుల చర్యలు**

హైదరాబాద్ : హెచ్‌సీయూకు వెళ్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించిన సందర్భంగా హైదర్‌గూడ క్వాటర్స్ వద్ద పోలీసులు మోహరించారు. మంగళవారం వర్సిటీకి వెళ్లాలని బీజేపీ ఎమ్మెల్యేలు, నేతల బృందం నిర్ణయించింది. హెచ్‌సీయూ భూముల వేలాన్ని బీజేపీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. పలువురు బీజేపీ నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే హెచ్‌సీయూ మెయిన్ గేట్ దగ్గర ధర్నాకు సీపీఎం పిలుపునిచ్చింది. 400 ఎకరాల భూమి విషయంలో వివాదం కొనసాగుతోంది. మరోవైపు హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్ద కూడా బలగాలను మోహరించారు. అలాగే హెచ్‌సీయూ భూములపై విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. తరగతుల బహిష్కరణకు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. హెచ్‌సీయూ భూముల అమ్మకానికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ వద్ద ఆందోళనకు పిలుపునివ్వగా.. సీపీఐ పార్టీ మాత్రం దీనికి దూరంగా ఉంది. సీపీఐ అనుబంధ విద్యార్థి సంఘాలు అన్నీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తీసుకొస్తున్నాయి. అలాగే హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని బీఆర్ఎస్ పార్టీ కూడా ఖండించింది. కాంగ్రెస్ సర్కార్ ఆచీతూచి వ్యవహరించాలని, ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా రాబోయే తరాలకు ఏం మిగలదని.. దీనిపై సీఎం రేవంత్ పునరాలోచన చేయాలని, వెనక్కి తగ్గాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక బీజేపీ ఆధ్వర్యంలో హైదర్‌గూడ క్వార్టర్స్ నుంచి హెచ్‌సీయూ వద్దకు వెళ్లి నిరసన చేయాలని నిర్ణయించింది. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఒక బృందంలా ఏర్పడి హైదర్‌గూడ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బయలుదేరి హెచ్‌సీయూ భూముల వద్దకు చేరుకుని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తేవాలని నిర్ణయించింది. అయితే ఎమ్మెల్యేలు వెళ్లేందుకు అనుమతి లేదంటూ పోలీసులు పెద్దఎత్తున హైదర్‌గూడ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు మోహరించారు. ఇప్పటికే ఆ భూములు ప్రభుత్వానివే అంటూ టీజీఐఐసీ ఆధారాలను బయటపెట్టింది. దీనికి సంబంధించి రెండు ప్రకటనలను విడుదల చేసింది. ప్రస్తుతం వివాదం నెలకొన్న భూములను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హెచ్‌సీయూ స్వాధీనం చేసిందని, దానికి బదులుగా వర్సిటీకి సర్కార్.. 397 ఎకరాలను బదలాయించిందని స్పష్టం చేసింది. దీనిపై అప్పటి వర్సిటీ రిజిస్ట్రార్ సంతకం చేశారని తెలిపింది. సంబంధిత కాపీలను సీఎంవో విడుదల చేసింది. అయితే కంచగచ్చిబౌలిలో 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అంటూ టీజీఐఐసీ చేసిన ప్రకటనను హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ఖండించారు.

### రేవంత్‌లోనూ కెసిఆర్ అహంకారం...

**మండిపడ్డ ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్**

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ భూ విక్రయ విధానంపై ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా సెంట్రల్ యూనివర్శిటీ భూముల అమ్మకంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిపాలన పరిస్థితులను చూస్తుంటే, కేసీఆర్ అహంకారం ఇప్పుడు రేవంత్ రెడ్డిలో కనిపిస్తోందని పాయల్ శంకర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, నాడు ఎంపీగా ఉన్నప్పుడు 'ప్రభుత్వ భూములు అమ్మకూడదు' అని చెప్పిన రేవంత్ రెడ్డి, నేడు ఏ అధికారంతో భూములను అమ్ముతున్నారని అంటూ నిలదీశారు. వేల ఎకరాల భూములను నాడు కేసీఆర్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని, ఇప్పుడు అదే విధానం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోం దని అన్నారు.. రాష్ట్రాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేయాలంటే భూములను అమ్మడం తప్పనిసరని రేవంత్ రెడ్డి భావిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. ధరణి పేరుతో కేసీఆర్ భూ దోపిడీ చేశాడు. ఇప్పుడు భూమాత పేరుతో కాంగ్రెస్ భూ దందాకు తెరలేపుతోంది. యూనివర్శిటీ భూములు ప్రభుత్వానివే కాకపోతే, అవి ఎవరివి? విద్యా సంస్థలకు సంబంధించిన భూములను అమ్మకానికి పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.



# సినిమాలు లేక ఖాళీగా ఉన్న సమయంలో పెళ్లి చేసుకున్నా : అదితి

ఇటీవలి కాలంలో చాలా మంది ముద్దుగుమ్మలు పెళ్లి పీటలెక్కారు. కొందరు లవ్ మ్యారేజ్ చేసుకోగా, మరి కొందరు పెద్దలు చూసిన వ్యక్తిని మనువాడారు. అయితే ఇటీవల నటుడు సిద్ధార్థ్ని వివాహం చేసుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది అదితి రావు హైదరి. మహా సముద్రం సినిమాలో హీరోయిన్ గా నటించిన అదితి రావు హైదరి తో షూటింగ్ సమయంలో సిద్దార్థ్ కి పరిచయం కాగా, ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లి వరకు వెళ్లింది. ఇరు కుటుంబాల సమక్షంలో వివాహం వైభవంగా జరిగింది. వనపర్తి పెళ్లికి వేదిక అయింది. సిద్దు, అదితిలు పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో తమ పిక్స్ షేర్ చేసుకుంటూ నువ్వే నా సూర్యుడు, నువ్వే నా చంద్రుడు.. నువ్వు నా తారా లోకం అంటూ మిసెస్ అండ్ మిస్టర్ సిద్దు అని అదితి రావు ఇన్ స్టా లో పోస్ట్ పెట్టగా, ఆ పోస్ట్ నెట్టింట వైరల్ అయింది. అయితే అదితి తన సినీ ప్రస్థానాన్ని 2006లో మలయాళ చిత్రం "ప్రజాపతి"తో ప్రారంభించింది. ఇందులో ఆమె మమ్ముట్టి సరసన నటించింది. ఇక ఆ తర్వాత వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంది. ఆమె తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో నటించి మంచి పేరు తెచ్చుకుంది. హిందీలో "దిల్లీ 6", "రాక్‌స్టార్", "పద్మావత్" వంటి చిత్రాల్లో నటించగా, తెలుగులో "సమ్మోహనం", "మహాసముద్రం" వంటి సినిమాల్లో నటించి అలరించింది. అదితిలో మంచి టాలెంట్ ఉన్నా కూడా ఆమెకి పెద్ద హిట్స్ పడలేదు. ఆమెకి భరతనాట్యం కూడా వచ్చు. చాలా బాగా చేస్తుంది. అయితే హీరమండి సినిమాలో తన నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయంటూ రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది అదితి. హీరామండి తర్వాత తనకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు.. నా నటనకు , డాన్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చిన అవకాశాలు రాకపోవడం బాధ అనిపించింది. అయితే సినిమాలు లేక ఖాళీగా ఉన్న సమయంలోనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నా అని తెలిపింది. ఇక అదితి ఆమె 1978 అక్టోబర్ 28న హైదరాబాద్‌లో జన్మించింది. ఆమె తల్లి విద్యా రావు, ఒక ప్రముఖ శాస్త్రీయ గాయని, తండ్రి ఎహ్సాన్ హైదరి. అదితి రాజకీయంగా ప్రముఖమైన కుటుంబాల నుండి వచ్చింది.

# మళ్లీ ప్రభాస్‌తో నటించనున్న దిశాపటాని

పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. కొన్ని నెలలుగా రాజాసాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్నారు డార్లింగ్. ఇదిలా ఉంటే.. డార్లింగ్ సరసన మరోసారి ఛాన్స్ కొట్టేసింది బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ. ఇప్పటికే ప్రభాస్ తో కలిసి ఓ సినిమాలో నటించి మెప్పించింది దిశా పటానీ. కొన్నాళ్లుగా బాలీవుడ్ ఇండస్ట్రీలో సరైన హిట్టు కోసం ఎదురుచూస్తున్న ఈఅమ్మడుకు.. ఇప్పుడు ప్రభాస్ సరసన వరుస ఆఫర్స్ వస్తున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా దిశా పేరు మారుమోగుతుంది. మోడలింగ్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టిన దిశా పటానీ.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని హైలెట్ అయ్యింది. ఆ తర్వాత వరుణ్ తేజ్ సరసన లోఫర్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. కానీ ఈ సినిమా ప్లాప్ కావడంతో ఆమె బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. హిందీలో వరుస ఆఫర్స్ అందుకుంటూ అక్కడే స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. చాలా కాలం తర్వాత ఇటీవల నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి చిత్రంలో ప్రభాస్ జోడిగా కనిపించింది. ఈ మూవీతో పాన్ ఇండియా లెవల్లో మరోసారి పాపులర్ అయ్యింది. ఇక ఇప్పుడు మరోసారి ప్రభాస్ సరసన కనిపించనుందట. డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో డార్లింగ్ నటిస్తున్న సినిమాలో ఇమాన్వీ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మరో హీరోయిన్ దిశా పటానీ కనిపించనుందని అంటున్నారు.





# శ్రీలీలకు నిరాశను కలిగించిన రాబిన్‌హుడ్

తెలుగులో వరుస హిట్లతో అతి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న యంగ్ హీరోయిన్ శ్రీలీల. బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ టాలీవుడ్ ఇండస్ట్రీలో బిజీ హీరోయిన్ గా దూసుకుపోయింది ఈ ముద్దుగుమ్మ. ధమాకా సినిమాతో ఈ అమ్మడు క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ సినిమాలో తన ఎనర్జిటిక్ డ్యాన్సులతో అదరగొట్టింది. కానీ ఆ తర్వాత ఈ అమ్మడు ఖాతాలో అదే స్థాయిలో హిట్టు రావడం లేదు. కొన్నాళ్లుగా ఆమె చేస్తున్న ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడుతూనే ఉన్నాయి. స్కంద, ఆదికేశవ, ఎక్స్?ట్రార్టినరీ మ్యాన్ ఇలా శ్రీలీల నటించిన అన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను నిరాశపరుస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన గుంటూరు కారం సినిమాతో ఓ హిట్ పడింది. కానీ ఈ సినిమా శ్రీలీలకు అంతగా క్రేజ్ రాలేదు. ఇక గుంటూరు కారం సినిమా తర్వాత చాలా కాలం గ్యాప్ తీసుకున్న శ్రీలీల.. ఇప్పుడు రాబిన్ హుడ్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఈ సినిమా ఇటీవలే థియేటర్లలో రిలీజ్ రాగా.. మిశ్రమ స్పందన వచ్చింది. ఈ సినిమాతో శ్రీలీలకు మరోసారి నిరాశే ఎదురయ్యింది. నిజానికి ఈ మూవీలో ముందుగా రష్మిక చేయాల్సింది. కానీ డేట్స్ అడ్జస్ట్ కాకపోవడంతో ఆమె స్థానంలోకి శ్రీలీల వచ్చింది. దీంతో ఇప్పుడు ఈ అమ్మడు ఖాతాలో మరో ప్లాపు వచ్చి చేరింది.



# అందం, అభినయంతో అదరగొడుతున్న పాయల్‌రాజ్‌పుత్

ఆర్ ఎక్స్ 100 సినిమాతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న చిన్నది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ తన అందచందాలతో ఎప్పుడూ నెట్టింట్లో తెగ ట్రెండ్ అవుతుంటుంది. తాజాగా ఈ బ్యూటీ షార్ట్ డ్రెస్ లో తన గ్లామర్ తో కుర్రకారుకు చెమటలు పట్టిస్తుంది. డెమిన్ క్లాత్ తో తయారు చేసిన ఈ డ్రెస్ లో ఋ అమ్మడు చాలా అందంగా ఉంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. అందాల ముద్దుగుమ్మ పాయల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. చేసిన సినిమాలు తక్కువే అయినా ఈ బ్యూటీ యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఆర్ ఎక్స్ 100 సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. మరీ ముఖ్యంగా ఈ సినిమాలో పాయల్ తన గ్లామర్ తో కుర్రకారుకు నిద్రలేకుండా చేసింది. పాయల్ రాజ్ పుత్ మొదటి సినిమా మంచి గుర్తింపు తెచ్చినప్పటికీ అంతగా అవకాశాలు రాలేదు. ఆర్ ఎక్స్ 100 సినిమా తర్వాత పాయల్ డిస్కో రాజా, వెంకీ మామా, అనగనగా ఓ అతిథి, పకపా. మాయాపేటిక,మంగళ వారం వంటి సినిమాల్లో నటించింది. ఈ సినిమాల్లో మంగళవారం మూవీతో మరోసారి ఈ అమ్మడుకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమాలో పాయల్ తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ బ్యూటీ ఎప్పుడూ తన వరస ఫొటో షూట్ తో నెటిజన్స్ ను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ నటి, డెమిన్ క్లాత్ తో తయారు చేసిన సింగిల్ పీస్ షాట్ ధరించి తన అందాలతో మత్తెక్కిస్తుంది. డిఫరెంట్ ఫోజులతో ఉన్న ఈ ఫొటోలు నెటిజన్స్ ను తెగ ఆకట్టుకుంటున్నాయి.



# దమ్ముంటే నా సినిమా బ్యాన్ చేయండి : నాగవంశీ

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ నిర్మాణంలో వచ్చిన తాజా చిత్రం మ్యాడ్ స్క్వేర్. సూపర్ హిట్ చిత్రం మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ మూవీ టికెట్ రేట్లు ఎక్కువగా ఉన్నాయని.. సినిమా బాగాలేకున్న మేకర్స్ ఫేక్ కలెక్షన్ల్ చూపిస్తున్నారని కామెంట్లు వస్తున్న విషయం తెలిసిందే. పలు వెబ్‌సైట్‌లలో ఈ సినిమాకు నెగిటివ్ రివ్యూలు వచ్చాయి. దీంతో తాజాగా ప్రెస్ మీట్ పెట్టిన నాగవంశీ.. మీడియా జర్నలిస్ట్‌లతో పాటు రివ్యూలు ఇచ్చే పలు వెబ్‌సైట్‌లపై ఆగ్రహాం వ్యక్తం చేశాడు. ఆ సినిమాకు తక్కువ కలెక్షన్లు వచ్చాయని అంటున్నారు. వారికి నేను సమాధానం చెప్పాలి అనుకుంటున్నా. ఎవరికి తక్కువ కలెక్షన్లు వచ్చాయి అనిపిస్తుందో నా దగ్గరికి రండి వారికి అసలు కలెక్షన్లు చూపిస్తాను. ఇదేమైన పెద్ద హీరో సినిమానా కలెక్షన్లు రాకున్న బయట హౌస్‌ఫుల్ బోర్డ్ పెట్టడానికి.. నాకు అలాంటి అవసరం కూడా లేదు. సినిమా ఆడుతున్నప్పుడు.. ఎందుకు సపోర్ట్ చేయడం లేదు. ఎందుకు నెగిటివ్ రివ్యూలు రాస్తున్నారు. నా మీద అంత పగ ఉంటే దమ్ముంటే నా సినిమాలు బ్యాన్ చేసి చూపించండి. నా సినిమా ఆర్టికల్స్ రాయకండి. నా దగ్గర యాడ్ తీసుకోకండి. అప్పుడు నేను కూడా చూపిస్తాను నా సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో అంటూ నాగవంశీ చెప్పుకోచ్చాడు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com